రాధాస్వామి

పరమసంత్ పరమ దయాల్
పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్

# సత్సంగ సుధ

(ఎనిమిదవ భాగం)

## చండీగఢ్‌లో అమృతవర్షం

అనువాదం
**జ్యోతిరాణి**

ప్రోత్సాహకులు
**దయాల్ ఆనందరావు మహారాజ్**
**దయాల్ శివమంగళ్ సింగ్ మహారాజ్**

ప్రకాశకులు
**శివ సాహిత్య ప్రకాశన మండలి**
రాధాస్వామి సత్సంగ భవనం
ప్లాట్ నెం. 7, ఏ.ఓ.సి. గేట్
వెస్ట్ మారేడ్ పల్లి, సికింద్రాబాద్.



పరమసంత్ పరమ దయాల్ పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్

# పరమ సంత్ పరమ దయాల్ మహారాజ్
# ఫకీర్ చంద్‌జీ మహారాజ్
## సందేశం

1. నీ నడవడిని, ప్రవర్తనను పవిత్రంగా ఉంచుకో! మనిషివి కా!
2. సదా ఆశావాదివై ఉండాలి.
3. స్మరణ మనసును శాంతింపచేస్తుంది.
4. మనసు, వాక్కు, కర్మల ద్వారా పరిశుద్ధంగా ఉండాలి.
5. నీ వ్యక్తిగత స్వార్థం కోసం ఇతరులను మోసగించకు.
6. నీ శరీరం హరిమందిరం. ప్రభువు స్వయంగా ఇందులో కొలువై ఉన్నాడు. ఆయన్ని అన్వేషించు. అవశ్యం లభిస్తాడు.
7. ఆత్మ-పరమాత్మల కలయికలో మనసే ఆటంకం అవుతుంది. మనసును వశం చేసుకో. ఆత్మ తనకు తానుగా పరమాత్మ వైపు ఆకర్షింపబడుతుంది.
8. సాధారణమైన, సరళమైన జీవనం గడుపుతూ ఉన్నతంగా ఆలోచించు.
9. అసహ్యాన్ని అసహ్యంతో తొలగించటం అసాధ్యం.
10. నీవిచ్చిన మాటను నిలబెట్టుకో. అదే మానవత.
11. కర్మ నియమం నుండి ఎవరూ తప్పించుకోలేరు.
12. నీ కోసం నీవు ఆచరించని అంశాన్ని ఇతరులకు ఎన్నటికీ వర్తింపచేయకు. నీవు పాటించని సూత్రం ఇతరులు పాటించాలని అనుకోకు.
13. నీ భారం ఇతరులపై పడదోసే ప్రయత్నం చేయకు.
14. సదా శుభసంకల్పం చేయాలి.
15. నీకు ఎవరిమీద విశ్వాసం కుదిరితే వారిని ఒక్కరినే పరిపూర్ణంగా నమ్ముకో. ఈ రోజు దేవిని, రేపు రాముణ్ణి, ఎల్లుండి కృష్ణుణ్ణి, ఆ తరువాత బాబాజీని విశ్వసించి పూజిస్తే రెంటని చెడ్డ రేవడిలా ఉంటుంది నీ పరిస్థితి.
16. ఇతరుల సొమ్మును ఆశించకు.
17. ఎవరి భోజనం వారే సంపాదించుకుని తినాలి.
18. స్త్రీలే జాతి నిర్మాతలు. సత్సంతానానికి జన్మనివ్వండి.
19. సత్యమైన సత్పురుషుడైన సద్గురువు శరణు వేడుకో. మోసగించే గురువుల

బారి నుండి తప్పించుకో.

20. నామం జపించే ముందు నిష్కల్మశుడవు, నిజాయితీ పరుడవు కావటం తప్పనిసరి. మనసులో భేద భావాలకు, ఈర్ష్యా ద్వేషాలకు చోటివ్వకు. దానిని పవిత్రంగా ఉంచుకో. ఒకవైపు నామం జపిస్తూ, మరొక వైపు హానికరమైన ఆలోచనలు, కర్మలు చేస్తే ఆ నామమే నీకు హానిని కలిగిస్తుంది

21. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం అభ్యాసం చేయి.

22. గురుచరణాలే ప్రకాశం. బుద్ధి, జ్ఞానం, వివేకములే గురునామం. అంతరంలో ప్రకాశాన్ని దర్శించుకో.

23. ప్రతిరోజూ దానం చేయి. నీ పేదరికం తొలగిపోతుంది.

24. ఇళ్ళల్లో శాంతి ఉండేలా చూడు. కలహాలు జరిగే ఇంట్లో ఏదో ఒక ఆపద, నష్టం సంభవించి తీరుతుంది.

25. ఎలాంటి కర్మచేస్తావో అలాంటి ఫలితం అనుభవించక తప్పదు.

26. పూర్వజన్మలోనో, ఈ జన్మలోనో నీవు చేసిన కర్మల ఫలితమే నీకు లభిస్తుంది. అంతే! నిన్నెవరూ కష్టపెట్టరు. సుఖపెట్టరు.

27. సంపూర్ణ విశ్వాసంతో నీ గురువును అంతరంలో సాక్షాత్కరింపచేసుకుని జనన మరణాల చక్రం నుండి విముక్తి పొందడానికీ, నిజగృహానికి చేరుకోవడానికి ప్రయత్నించాలి.

28. నేనెవరిని? ఎక్కడి నుండి వచ్చాను? ఎక్కడికి వెళ్తాను? అసలైన భగవంతుడెవరు? ఎక్కడుంటాడు? నిజగృహానికి ఎలా చేరుకోగలను? అని ప్రతి మనిషీ ఆలోచించాలి.

29. గురువును మనిషి అనుకోకు. ఆయన సర్వాధారుడైన పరమాత్ముడని విశ్వసిస్తేనే నీవు ఇహపరాలలో జయం పొందుతావు.

30. మానసిక, శారీరిక బ్రహ్మచర్యాన్ని విధిగా పాటించు.

31. క్షమ, ప్రేమ, శుభ సంకల్పం, శరణాగతి, నిష్కామకర్మ, బ్రహ్మచర్య పాలన నిన్ను ఉద్ధరిస్తాయి.

32. సంత్ మతంలోకి రావాలనుకంటే ముందుగా నీవు చేయవలసిన పని ఒకటుంది. మాంసభోజనం, మద్యపానం, వ్యభిచారం, దొంగతనం ఈ

నాలుగు అలవాట్లనూ వదిలితీరాలి. లేకుంటే సాధన జరగదు.

33. నీవు ఎవరికైనా ఋణపడి ఉంటే వెంటనే చెల్లించు. ఎదుటివారు మరిచిపోయి, అడగకపోతే నీవు తిరిగి ఇవ్వకుంటే నిన్ను ఏ భగవంతుడూ, ఏ గురువూ, ఏ సంత్ మహాత్ముడూ రక్షించలేడు. ఆ ఋణం తీర్చడం కోసమైనా నీవు మరో జన్మ ఎత్తవలసి వస్తుంది.

34. సదా సజ్జన సాంగత్యములో ఉండాలి.

35. మనం అందరం ప్రకాశస్వరూపులమే!

36. పరమతత్వాధారుణ్ణి కలుసుకోవాలనే తపన కలిగినవారే దుఃఖజీవులు. అలాంటి వారిని గురుదేశానికి తీసుకుపొమ్మని నా గురువు నన్ను ఆదేశించాడు.

37. ఏదైనా పనిని ప్రారంభించదలుచుకుంటే అది తప్పక విజయవంతం అవుతుందన్న ప్రగాఢ విశ్వాసంతో మొదలుపెట్టు. అవుతుందో, కాదోననే సంశయాలను వదలి దానిని ప్రారంభిస్తే జయం కలుగుతుంది.

38. గురుధారణ చేయడమంటే గురువు కాళ్ళకు తలవంచి మొక్కడం కాదు. గురువచనాలను ఆచరించడం!

39. సత్యమార్గాన్ని చూపించడం, వాస్తవాన్ని బోధించడం నా కర్తవ్యం. చెప్పటం వరకే నా బాధ్యత. ఆచరించే వంతు మీదే!

40. ఈ భవసాగరం నుండి నిన్ను బయటికి లాగగలిగే సమర్ధుడు సద్గురువే.

41. మనిషి తన భారాన్ని ఇతరులపై వేయకూడదు. ఇదే మానవత. మీ స్వార్థం కోసం నీ సంబంధితులను వేధించటం అపరాధం.

42., జనన మరణాల చక్రం నుండి, 84 లక్షల చక్రం నుండి తప్పించుకోవాలనుకున్నవారే నా వద్దకు రావాలి. వచ్చి గురు సేవ చేయాలి. గురువును సేవించకుంటేగ ఏమీ లభించదు.

43. గురు సేవ ఎలా చేయాలి? గురువును దర్శించుకుని ఆయన వచనాలను శ్రద్ధగా వినాలి. ఆ తరువాత మననం చేసుకోవాలి. వాటిలోని సారాన్ని జీర్ణించుకోవాలి. ఆచరించాలి. అప్పుడే నీ పడవ తీరం చేరుతుంది. ప్రతి రోజూ సత్సంగం చేయాలి. గురువచనాలను వినాలి.

# చండీగఢ్‌లో అమృత వర్షం

## పరమసంత్ పరమదయాల్ పండిత్ ఫకీర్ చంద్ మహారాజ్

# సత్సంగం

### డాక్టర్ ఆహుజాగారి ఇంటి నంబరు. 2412 సెక్టర్ 18-సి, చండీగఢ్

### తేది. 28 - 5 - 1977

1905లో కనిపించిన ఒక దృశ్యం కారణంగా వారానికో ఉత్తరం చొప్పున దాతా దాయాల్‌కు పదినెలల పాటు జాబులు రాశాను. ఆ తరువాత ఆయన నాకో ఉత్తరం రాశారు. అందులో "ఫకీర్ ! నీ ఉత్తరాలు అందుతూనే ఉన్నాయి. నీ ఆలోచనలను నేను గౌరవిస్తాను. కానీ నేను వాస్తవాన్ని, సత్యాన్ని, శాంతిని రాధాస్వామి మతంలో పవిత్రవిభూతి హుజూర్ రాయ్ సాలిగ్రామ్ సాహబ్ నుండి పొందాను. ఈ మార్గంలో నడవడానికి నీకు అభ్యంతరం లేకుంటే లాహోర్‌కి వచ్చి కలుసుకో గలవు" అని రాశారు. అప్పుడు ఇది రాధాకృష్ణ మతం కాబోలనుకున్నాను. ఈ ఉత్తరం ఉదయం అందింది. అంతకు ముందే నేను శలవుకావాలని దరఖాస్తు చేసుకున్నాను. నా స్థానంలో పనిచేయడానికి మరో స్టేషన్ మాస్టర్ వచ్చాడు. కనుక నేను లాహోర్‌కు బయల్దేరాను. దాతాదయాల్ మహారాజ్‌ను రామునిగా భావించి ఆయన దగ్గరకు వెళ్ళాను. ఆయన నాకు నామదానమిచ్చారు. 'సార్‌బచన్ నజమ్' చదవమన్నారు. చదివాను. అందులో మాయాసంవాదంలో అన్నిటి ఖండన-విమర్శ ఉంది. రాముడు, కృష్ణుడు కాలుని అవతారాలనీ, అసలైన పరమాత్మ వద్దకు వేదాంతులు చేరలేదనీ, జైనమునులు కూడా చేరుకోలేదనీ, బుద్ధుడూ, ముసల్మానులు అందరూ మరిచారనీ ఉంది. ఇదంతా చదివి అయోమయంగా తోచి ఏడవసాగాను. ఎందుకు ఏడుస్తున్నావని దాతాదయాల్ మహారాజ్ అడిగారు. ఈ ఖండన, విమర్శ నేను సహించలేక పోతున్నానన్నాను. "చదవటం మానెయ్! ఆ విషయాలు అలా ఎందుకు రాశారో నీకు అర్థమయ్యే రోజొస్తుంది" అన్నారాయన. "నేను ఈ మార్గంలో సత్యవాదినై నడుస్తాను. నా అనుభవంలోకి వచ్చిన విషయాలను చెబుతాను" అని ఆ సమయంలో దృఢమైన ప్రతిజ్ఞచేశాను. ఇప్పుడిక మీరే ఆలోచించండి! ఒక బ్రాహ్మణునితో రాముడు,

కృష్ణుడు కాలుని అవతారాలనీ, వ్యాసుడు చేరుకోలేదనీ, పరాశరుడు మరిచి పోయాడనీ చెబితే అతని హృదయం ఎంత బాధపడుతుందో ఊహించండి. అయినా దాతాదయాలుని పట్ల నా విశ్వాసం సడలలేదు. తగ్గలేదు. ఈ పంథాయి-అనగా మార్గం అర్థమయ్యేది కాదు. ఎందుకంటే గురువు సేవ చేయాలని ఈ సంప్రదాయంలో చెప్పటం జరిగింది. నావలన సాధ్యమైనంత సేవ చేశాను. ఈ సంగతి దుర్గాదాస్‌కు తెలుసు. తమను తాము అధికులమని, ఉన్నతులమని పైస్థాయిలో ఉన్నవారమని చెబుతూ, అన్నిటినీ ఖండనచేసే, విమర్శించే హక్కు సంత్ మతంవారికెలా ఉందో, ఏం కారణమో అప్పట్లో నాకు అర్థమయ్యేది కాదు. కనుక నేను దాతాదయాల్ ను "నాకు సంతులు చెప్పే ఆ నిజగృహాన్ని చూపించు' ' అని వేధించేవాణ్ణి. ఒకసారి బాగ్దాద్ నుండి వచ్చాక ఉదయం 8 గం॥ నుండి సాయంత్రం 5 గం॥ల వరకు "మీ రాధాస్వామి మతం చెప్పే ఆ గృహం చూప" మని వేధించాను. రేపు పొద్దున చూపిస్తానన్నారు దాతాదయాల్. ఉదయం నేను వెళ్ళగానే దోసిలి పట్టమన్నాడు. నేను దోసిలి పట్టాను. ఆయన ఐదుపైసలు ఒక కొబ్బరికాయ అందులో వేసి తలవంచి మొక్కాడు. "నేను నీకు ఆజ్ఞ ఇస్తున్నాను. పాటించు! నిన్ను ఆ ఇంటికి చేర్చే సత్యమైన సద్గురువు సత్సంగీయుల రూపంలో నీకు లభిస్తాడు" అన్నారు. నేను బగ్దాద్‌లో గురుపదవిని ప్రారంభించాను. అప్పుడు నా కళ్ళు తెరుచుకున్నాయి. సంత్ మతం ఏం చెబుతున్నదో దానికి నేనివాళ సాక్ష్యమిస్తాను. "ఫకీర్ చంద్! నీవొక వేళ సంతుల పక్షం వహిస్తే, నీకు సంత్ మతానికి సిఫార్సు చేసే అనుచరుడవు అనే ఊహవస్తే దుఃఖితుడవై మరణిస్తావు' ' అనుకునేవాణ్ణి. నాకు సంత్ మతంలోని సత్యం యొక్క చిరునామా మీ వలన లభించింది. నేను గురు పదవిలోకి రాకుంటే ఎన్నటికీ సత్యం యొక్క చిరునామా నాకు తెలిసేది కాదు. నేను సంత్ మతానికి వ్యతిరేకంగా చాలా విషయాలు చెప్పేవాణ్ణి. ఇప్పుడు నాకు గత్యంతరం లేదు. నేను వివశుడను. కొందరు నన్ను ధ్యానిస్తారు. నన్నెవరు ధ్యానం చేస్తున్నారో నాకు తెలియదు. వారి లోపల నా రూపం సాక్షాత్కరిస్తుంది. వారి పనులు సఫలమవు తాయి. జాగ్రతవస్థలోనో, స్వప్నంలోనో నా రూపం వారికి సాయపడుతుంది. ఏదైనా పని అవుతుందంటే అది నెరవేరుతుంది. నాకా విషయాలే తెలియవు. ఇతర గురువులు చేసే పనినే నేనూ చేస్తే కొత్తదుకాణం తెరుచుకునే పని నాకు ఉండేదే కాదు. ఈ మతానుయాయులు,

ధర్మావలంబులు, పంథాయి వారు మతాన్ని తప్పుగా అర్థం చేసుకోవటం వలన మానవజాతి వేరువేరు సంప్రదాయాలలోకి విభజించబడింది. అమాయకులైన గృహస్థులను మూర్ఖులుగా చేసి దోచుకోవటం జరిగింది. అందుకే నేనీ పని చేస్తాను. మూడు విధాలుగా దీనిని నిర్వహించటం నా బాధ్యత.

తూ తో ఆయా నర దేహీ మే, ధర్ ఫకీర్ కా భేషా ।
దుఃఖీ జీవ కో అంగ్ లగాకర్, లేజా గురు కీ దేశా ॥

తీన్ తాప్ సే జీవ దుఃఖీ హై, నిబల్ అబల్ అజ్ఞానీ ।
తేరా కామ్ దయా కా భాయీ, నామ్ దాన్ దే దానీ ॥

తేరా రూప్ హై అద్భుత్ అచరజ్, తేరీ ఉత్తమ దేహీ ।
జగ్ కళ్యాణ జగత్ మే ఆయా, పరమ దయాల్ సనేహీ ॥

తూ ఇరాక్ సే అబ్ కే ఆయా, సత్ సంగత్ కే కారన్ ।
లే ప్రసాద్ యహ సత్ సంగత్ కా, హో జా భవ నిధి తారణ్ ॥

నరదేహంలో నీవొచ్చావు ధరించి ఫకీరు రూపం
దుఃఖ జీవులకు అభయమునొసగి కొనిపో గురుని దేశం

నిబల అబల అజ్ఞానులు జీవులు త్రయతాపాల బాధితులు
దయ చూపటమే నీ కర్తవ్యం నామ దాన మిచ్చి బ్రోవూ !!

అద్భుతమాశ్చర్యం నీదు రూపమూ నీదే ఉత్తమ దేహం
జగతికి శుభమును కూర్చుటకొరకే వచ్చిన పరమ దయాలూ

సత్సంగముకై నీవొచ్చావూ ఇరాక్ దేశము నుండీ
స్వీకరించు సత్సంగ ప్రసాదము దాటుము భవసాగరము

"ఫకీర్ చంద్ ! ప్రపంచపు అజ్ఞానాన్ని ఎలా దూరం చేయగలుగుతావు? ఇతరుల నిర్బలతను ఎలా తరమ గలుగుతావు? జీవులను భవసాగరం నుండి ఎలా దాటించగలుగుతావు" అని నా ఆత్మను ప్రశ్నిస్తుంటాను. మన విషయ వికారాలతో కూడిన జీవనమే మన నిర్బలతకు కారణం. యుక్తవయసులో అవసరానికి మించి ఎక్కువగా విషయ భోగాలనుభవించే మనిషిలో అశాంతి

రావటం తప్పదు. ఎవరూ దీనిని ఆపజాలరు. నా జీవితంలో ఈ విషయం అనుభవానికి వచ్చింది. లోకులు నామం జపిస్తారు. విషయభోగాలనుభవిస్తారు. తమలో ఘంట మోగాలనీ, ప్రకాశం కన్పించాలనీ కోరుకుంటారు - అది అసాధ్యం, ఎందుకు?

నేను 1905లో నామం తీసుక్కున్నాను. 1916 డిసెంబరు వరకు (నేను ప్రథమ మహాయుద్ధం లోకి వెళ్ళనంతవరకు) ఏడవటం, ప్రేమగీతాలను పాడటం తప్ప ఏమీ జరగలేదు. ఏ ప్రకాశమూ కనిపించలేదు. నేను బస్రాబగ్దాద్‌కు వెళ్ళాను. అక్కడ 12 సంవత్సరాలు ఒంటరిగా ఉన్నాను. అక్కడ నా శారీరక, మానసిక బ్రహ్మచర్యాలు మెరుగయ్యాయి. అన్ని సంవత్సరాలలో కేవలం రెండే సార్లు ఇంటికి వెళ్ళాను. నాలో శబ్దం కూడా ప్రతిధ్వనించింది. ప్రకాశమూ సాక్షాత్కరించింది. తన్మయత్వం కూడా కలిగింది. వీణానాదం వినిపించింది. ఆ తరువాత తిరిగి స్వదేశానికి వచ్చినప్పుడు "నీకు సంతానంలేదు. సంతానాన్ని కన"మని దాతా చెప్పారు. నేను కేవలం సంతానం కోసమే నా భార్యదగ్గరికి వెళ్తే నాకు ఏ దుఃఖమూ కలిగేదికాదు. కానీ నేను నా రుచి కోసం వెళ్ళాను. ఇక అంతకు ముందున్న శాంతి అంతా పోయింది. ఆ రోజుల్లోని నా ఫోటో మందిరంలో పెట్టబడి ఉంది. అదెంతో ప్రకాశవంతమైన ఫోటో అని దానిని చూసిన వారు గ్రహిస్తారు. నాకేమైందని నేను బాధపడేవాణ్ణి. నేనీ పనిని ఎందుకు చేస్తాను? నా వంటి మూర్ఖులకు సత్యాన్ని చెప్పడానికి చేస్తాను. అప్పట్లో నేను వీణా నాదం విన్నాను. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలను అభ్యాసంలో చూశాను. దుర్గాదాసు నాతో ఉండేవాడు. రగ్గు కప్పుకొని కూడా పై కప్పుకున్న ఊచలను లెక్క పెట్టేవాణ్ణి. ఆ తరువాత ఇంటికి వచ్చాను. "నీవు కామాతురుడివి కాలేదా?" అని నా ఆత్మను ప్రశ్నిస్తాను. అయ్యాను. నా తోటి వారు లంచం తింటే నాకు కోపం వచ్చేది కదా! నేను అనుచితంగా సంపాదించలేదు. కాని నా మనసులో నా ఉన్నతి కలగాలనే కోరిక ఉండేది! ఈ పని చేయడానికి నా స్వార్థం ఏమిటంటే నా వలె ఈ మార్గం పై నడిచే వారికి సత్యం ఏమిటో చెప్పాలనుకోవటమే! నా శాంతి దూరమయ్యాక ఏడ్చేవాణ్ణి. అక్కడికి లాహోర్ నుండి ఒక సత్సంగి దాతా దయాల్ రాసిన ఒక ఉత్తరం తీసుకొచ్చాడు. అతనికి ఏదో సందేహం కలిగి ప్రశ్నించాడట. అయితే దాతా దయాల్ అతనితో, "సునామ్ స్టేషన్ లో స్టేషన్ మాస్టర్ ఫకీర్ చంద్‌ను అడిగి తెలుసుకో" అన్నారట. అతడు నా

వద్దకు వచ్చాడు. నాకేం రాదనీ , నాకేం తెలియదనీ చెప్పాను. ఎందుకంటే నేనే అశాంతిగా ఉన్నాను. అతనికేం బోధిస్తాను? అతడు దాతా దగ్గరికి వెళ్ళిపోయాడు. దాతాతో ఆ వ్యక్తి ఈ విషయం చెప్పినప్పుడు "ఫకీర్ నుండి ఎవరికైతే ఏమీ లభించదో వారికి నా నుండి కూడా ఏమీ లభించదు" అన్నారట. అతడు ఉత్తరం తీసుకుని నా దగ్గరకి వచ్చినప్పుడు మనసులో అనేక రకాల ఊహలు వచ్చాయి. ఈ గురుమతం ఎలాంటిది? నా వద్ద ఏమీ లేదు. ఆయనేం రాశారు? ఆ రోజుల్లో నేను తంబురా వాయించేవాణ్ణి. ప్రేమతో పాడేవాణ్ణి. నేను అంతరంలో ప్రార్థించటం ప్రారంభించి స్పృహ కోల్పోయాను. "ఫకీర్ చంద్! నీలో కామమనే అవగుణం ఉంది. జహాఁ కామ్ తహాఁ నామ్ నహీ। జహాఁ నామ్ వహాఁ నహీఁ కామ్ ॥ కామమున్న **చోట నామం లేదు! నామమున్న చోట కామం లేదు"** అన్న ఆ మాటలు ఎవరో చెబుతున్నట్లుగా అంతరంలో ధ్వనించింది. నన్ను నేనిక సంభాళించుకున్నాను. ప్రపంచానికి నేనీ సత్సంగాన్ని ఎందుకు చేయిస్తాను? "ఓ మనిషీ! నువ్వెంత భక్తి చేసినా అవసరానికి మించిన కామం అనుభవిస్తే నీకు శాంతి లభించదు" అని చెప్పడానికే ప్రవచనాలిస్తుంటాను. నేను చెప్పదలచుకున్న రెండవ విషయం నన్ను ఎందరో ధ్యానం చేస్తుంటారు. నా రూపం ప్రకటమవుతుంటుంది. నాకా విషయం తెలియదు. నన్నెవరు తలచుకుంటున్నారో, ధ్యానిస్తున్నారో నాకు తెలియదు. స్వప్నంలో అభ్యాసంలో సాక్షాత్కరించే రూపాలు, వర్ణాలు మన మనసులో ఉన్నవే! మేధస్సులో ఉన్నవే!! ఫకీర్‌చంద్ డోగ్రా వచ్చాడు. అతని కుటుంబమంతా నాకెంతో గౌరవమర్యాదలిస్తారు. రెండు సంవత్సరాల క్రితం అతని తల్లి లోపల నా రూపం ప్రకటమై "అమ్మా! నీవు నా అప్పు ఇవ్వాల్సి ఉంది. నా అప్పు తీర్చు" అందట. ఆమె నాకు ఉత్తరం రాసింది. "అమ్మా! ఇది నీ మనసు ఆడుతున్న ఆట" అని చెప్పాను. నేనెంత చెప్పినా ఆమె ఒప్పుకోలేదు. ఆమె వృద్ధురాలు. తన 70, 80 తులాల వెండి నగలను కరిగించి జండాలను చేయించి మా ఇంట్లో వదిలి వెళ్ళింది. ఇలాంటి సంఘటనలు చాలా సార్లు జరుగుతుంటాయి. మీ లోపల ఏదైనా రూపం సాక్షాత్కరిస్తుంది. కొందరిలో రాముడు, కృష్ణుడు, మరి కొందరిలో దేవి సాక్షాత్కరించింది. గురు రూపం సాక్షాత్కరించింది. ఇలా సాక్షాత్కరించే దెవరు? ఓ అమాయక ప్రజలారా! ఏ రకమైన సంస్కారాలు నీ మేధస్సుపై పడి ఉన్నాయో అవే స్ఫురిస్తాయి. భిన్న విభిన్న రూపాలుగా ఏర్పడి ప్రకటిస్తాయి. ఈ

పంథాలు వారు, మతాలవాళ్ళు మోసం చేశారు. నేను జీవించి ఉండి హుషియార్‌పూర్‌లో కూర్చుని ఉన్నాను. ఎక్కడికీ వెళ్ళలేదు. ఆ విషయలేవీ నాకు తెలియవు. మరణించిన గురువో, మరెవరో వస్తారని నేనెలా నమ్మగలను? ఈ లీలంతా నీ మనసుదే! ఈ మనసు గురించి మనకు తెలియదు. అందరూ దీని పరిధిలోకి వచ్చారు.

మన్ కే నాచ్ సారే నాచే నాచే ఋషి మునిదేవా

మనసు ఆడించినట్లే ఋషులు, మునులు,దేవతలు సైతం ఆడతారు.

నేనిక్కడికి ఏదో ఒక ధ్యేయంతో వచ్చాను. నాపై బాధ్యత ఉంది. "ఫకీర్ ! శరీరాన్ని వదిలే ముందు బోధనా పద్ధతిని మార్చు" అన్నారు దాతా దయాల్. నేను బోధనా పద్ధతిని మారుస్తున్నాను. గురువులంతా నామమిస్తారు. నేను 1942 తరువాత ఎవరికీ నామమీయలేదు. నేను రెండు డిగ్రీలు గలవాడిని. ఒకటి దాతా దయాల్ జీ మహారాజ్, మరొకరు సావన్ సింగ్ జీ మహారాజ్‌లతో యోగ్యతా పత్రాలు పుచ్చుకున్నాను. నేను ఆరు వేలమందికి నామమిచ్చినా ఒక్కో వ్యక్తి నెలకు ఒక్క రూపాయి ఇచ్చినా నెలకు ఆరు వేల రూపాయలొస్తాయి. నేనెవరికీ నామమివ్వను. కారణం? 1942లో ఒక సంఘటన జరిగింది. జబల్‌పూర్‌కు చెందిన ఒక సోదరి దీనికి కారణం. ఆమె భర్త టెలిగ్రాఫ్ ఇన్‌స్పెక్టరు. తన ముగ్గురు పిల్లలను తీసుకుని హోషియార్‌పూర్‌కు నా దగ్గరకి వచ్చింది. ఆరోజు నేను అక్కడ లేను. ఫిరోజ్‌పూర్‌కు వెళ్ళానని తెలుసుకుని అక్కడికి వచ్చింది. ఆమె త్రికుటిలో అభ్యాసం చేసేది. ఎరుపు వర్ణం సూర్యునిలో నా రూపాన్ని చూసేది. ఈ పిల్లలు వేధిస్తుంటారు. సాయపడమని అడిగింది. నేనావిణ్ణి "ఏమమ్మా! నీకు అత్త ఉందా" అని అడిగాను "లేదు" అంది. తల్లి ఉందా అంటే లేదంది. ఆడపడుచుందా అంటే లేదంది. ఈ ప్రవచనం నేను బాధతప్త హృదయంతో ఇస్తున్నాను. నీవు అర్థం చేసుకో! చేసుకోకపో! ఇది నా పని కాదు. నాపైన గురు ఋణం ఉంది. దానిని తీర్చుకోవాలనుకుంటున్నాను. శిక్షణను మార్చమని ఆయన చెప్పారు. ఎలా మార్చాలి? ఏం మార్చాలి? నాకు అర్థమైంది చెబుతాను! ఈ జబల్‌పూర్ మహిళకు ఎవరూ లేరు. త్రికుటిలో అభ్యాసం చేస్తుంది. ఈమె ఏం కోరితే అది నెరవేరుతుంది. పిల్లలతో తప్పించుకోవాలని కోరుకుంటున్నది. మరో ఉపాయమేమీ లేదు.

అందుకే ఆమె పిల్లలు చనిపోతారు అనుకున్నాను. నేనామెకు ఈ విషయం చెప్పలేదు. నా మిత్రుడు వలీరాం అక్కడే ఉన్నాడు. ఆమె వెళ్ళి పోయాక "వలీరాం! ఒక విషయం చెప్పనా? ఈ స్త్రీ పిల్లలు ముగ్గురూ చనిపోతారు" అని చెప్పాను అతనితో. తొమ్మిది నెలల లోపల ముగ్గురు పిల్లలూ చని పోయారు. ఆ తరువాత నేనాలోచించాను. నేనొకవేళ అనర్హులకి నామదానమిస్తే వీళ్ళు తమకే హాని చేసుకుంటారు. నామం జపించే మనిషి మనసులో ఉండేదే అభివృద్ధి అవుతుంది. అందుకే నామం ఎవరికి లభించాలి? ఎవరికి ఇవ్వాలి?

విషయన్ సే జో హోయె ఉదాసా । పరమారథ్ కీ జా మన్ ఆసా ॥
ధన్ సంతాన్ ప్రీతి నహిఁ జాకే, ఖోజత్ ఫిరే సాధు గురు జాగే ॥

విషయ వికారాలపై ఉదాసీనత చూపి
మనసులోన పరమార్థపు ఆశలనే పెంచి,
ధనముపై, సంతానముపై ప్రీతిని విడిచి
వెదుకుతూ తిరగాలి సాధు గురువులకై మేల్కొని.

ఇప్పుడు పన్నెండు పదమూడేళ్ళ పిల్లలకు నామం ఇవ్వబడుతోంది. వాళ్ళు గృహస్థ జీవన భోగినులై ఉంటారు. ఈ నామం వారికి హానిని కలిగిస్తుంది. ఈ గురువులు గురునామాన్ని కాదు విషాన్నిస్తున్నారనవచ్చు. వీళ్ళు తమ పేరు కోసం శిష్యుల్ని చేసుకుంటారు. నేను నిర్భయుడినై చెబుతున్నాను. దీనికి ఋజువు వినండి. హుజూర్ రాయ్ సాహబ్ సాలిగ్‌రామ్ మహారాజ్ రాధాస్వామి మతం నడిపించారు. ఆయన తన ప్రేమవాణిలో స్పష్టంగా రాశారు. "ఎవరి మనసు మలినమై ఉందో వారు మనసును శుద్ధి చేసుకోక, చేసుకోదలచు కోక తమ అశుద్ధ విచారాలను ఆపుకోలేకపోతే వాళ్ళీ శబ్ద అభ్యాసాన్ని చేయకూడదు. లేకుంటే ఇది వారికి ఎంతో నష్టాన్ని కలుగచేస్తుంది" అని! ఈ పనిని నేను నా గౌరవ ప్రతిష్టల కోసం నిర్వహించటం లేదు. ఆలోచించండి. నేను కూడా పరదా పెడితే, తెరమరుగు చేస్తే లక్షలు, కోట్లు రూపాయలకు యజమానినై ఉండే వాడిని. నా రూపం సాక్షాత్కరించిన వారికి నిజం చెప్పక నా ఇష్టమున్నన్ని రూపాయలు సంపాదించుకునే వాణ్ణి. ఇప్పుడు ముఖ్యులు తప్ప ఎవరొస్తారు? ఈ పని ఎందుకు చేస్తాను? నీ మనసు మలినంగా ఉంటే, దీనిని నీవు శుద్ధి చేయదలచుకుంటే నీ

మనసు పరిశుద్ధం కావాలనే ఊహతో నామాన్ని జపించు. అది శుద్ధి అవుతుంది. ఏ కోరికతో నీవు సాధన చేస్తావో ఆ కోరిక నెరవేరుతుంది. నా జీవితానుభవాల ఆధారంగా దీనిని ఋజువు చేస్తాను. లోకులు ఏ కోరికతో నా ధ్యానం చేస్తే ఆ కోరిక ఫలిస్తుంది. ఆ గొప్పదనం నాకు ఆపాదిస్తారు. నన్ను ఎవరు ధ్యానిస్తున్నారో నాకు అసలే తెలియదు. ఈ సాలెగూటిని ఎందుకు కట్టుకున్నానా అని ఆలోచిస్తుంటాను. సంత్ మతాన్ని ప్రక్షాళన చేయడానికే నేను అవతరించాను. మిమ్మల్ని మేం సంతులం మూర్ఖుల్ని చేసి దోచుకున్నాం. ఎవరూ సత్యమైన విషయం చెప్పరు. నేనెవరి అంతరంలోకీ వెళ్ళను. ఎవరైనా తాము చెప్పిన మాట నిజమైతే లౌడ్ స్పీకర్ పెట్టి మరీ గొప్పలు చెప్పుకుంటారు.. అబద్ధమైతే కాలుని రూపం మీలో సాక్షాత్కరించింది. గురువు కాదు అంటారు. అందుకే గృహస్థులకు చెబుతుంటాను, మీరు మీ జీవితాన్ని సార్థకం చేసుకోవాలనుకుంటే ముందుగా (నీయత్) నడవడి, ప్రవర్తనను సరిచేసుకోండి. నీవు అభ్యాసం చేసినపుడు నీ మనసు లోపల కోరిక ఏది ఉంటే అది పూర్తవుతుంది. నీలో కోరికలు, స్ఫురణలు వస్తాయి, నీవు ఏమని అనుకుంటావు? బాబా సావన్ సింగ్ వచ్చాడు, లేదా బాబా ఫకీర్ వచ్చాడు అనుకుంటావు. ఈ గురువులు చెబుతుంటారు. నామం తీసుకో, అంత్యసమయంలో గురువు వచ్చి తీసుకువెళ్తాడని కొందరంటారు. తాము చనిపోతున్న ఘడియలలో బాబా విమానం తెచ్చాడనో, పల్లకీ తెచ్చాడనో, గుర్రం తెచ్చాడనో చెబుతుంటారు. నాకీ విషయాలు ఏ మాత్రం తెలియదు. ఎవరు మృతిచెందారో తెలియదు. నీవు ప్రపంచంలోకి వచ్చావు. బతకడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి ప్రవృతి మార్గం, మరొకటి నివృత్తి మార్గం.

ఏంచేయాల్సి ఉంది? నేను అనుభవించిన మాటే చెబుతాను. దేనిదీ దావాలేదు. మీరు నిస్సందేహంగా మీ గురువులకు చెప్పండి ముసలిఫకీర్ ఇలా ఇలా అన్నాడు! నిజమా అబద్ధమా అని అడగండి. విమర్శించడానికి మీకు హక్కుంది! నేను గుత్తేదారును కాను. నాకు అర్థమైనదానినే చెబుతుంటాను. అహుజాగారు నన్ను పిలిచారు. నన్నెంతో ప్రేమిస్తారు, పొగడుతారు. అహుజాగారూ! నన్ను పొగడడం వలన ఏమీ దొరకదు. నా ఫోటో పెట్టుకోవటం వలన నీవు సత్ లోకానికి వెళ్ళలేవు. నా మాటల్నివిని, అర్థంచేసుకుని దానిని ఆచరిస్తే నీనావ తీరం

చేరుతుంది. నన్ను మెచ్చుకుంటే నీకేం లభిస్తుంది? గురువు వచ్చి అంత్య సమయంలో తీసుకు వెళ్తాడని కొందరు గురువులు చెప్పేమాట అబద్ధం. దీనిని ఋజువు చేస్తాను. హుజూర్ మహారాజ్ రాయ్‌సాలిగ్ రామ్ సాహబ్ రాధాస్వామి మతాన్ని నడిపించారు. ఆయన స్పష్టంగా రాశారు. అంత్య సమయంలో నీ కనుల ముందర గతమంతా ఓ సినిమా వలె కనిపిస్తుంది. ఏ గురువు దగ్గర నామం తీసుకుంటే ఆ గురువు కూడా కళ్ళెదుట కన్పిస్తాడు. నామం వినిపిస్తాడు. నీకు సంబంధించిన వాళ్ళొస్తారు. ఇలాంటి స్థితిలో నీవు మరణిస్తే కొంతకాలం వరకు పై లోకాలలో ఉండి మళ్ళీ ఎపుడైనా ఎవరైనా సంత్ సద్గురు వక్త్ ప్రపంచం లోకి వస్తే ఆయన సాంగత్యంలోకి వచ్చి మిగిలిన సంపాదన పూర్తి చేసుకుంటావు. మరి ఇప్పుడు సైన్సు ఏం చెబుతోంది? మీలో వృద్ధులు సత్సంగానికి వచ్చారు. ఈ విషయం మీకే చెబుతున్నాను, నవయువకులకు చెప్పటంలేదు.

యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ సోవియట్ రష్యా, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్ డాక్టర్లు మరణిస్తున్న మనిషిలో నుండి ఏదో వస్తువు బయటికి వెళ్ళిపోవటం తెరపైన (స్క్రీన్‌పైన) చూశారు. మరణించబోయే వారిని సున్నితపు త్రాసుపైన తూచారు. ప్రాణాలుపోయాకా చూశారు. ఒకరి బరువు పది గ్రాములు తగ్గింది. మరొకరి బరువు ఇరవై గ్రాములు తగ్గింది. దీనిని బట్టి మరణించిన వారిలో నుండి బయటకు వెళ్ళిన వస్తువు బరువుగా ఉందని తెలుస్తోంది. భూమి గురుత్వార్షణశక్తి దానిని పైకి వెళ్ళనీయదు. ఆ వస్తువు బరువుగా ఎందుకుంటుంది? స్థూల పదార్థంపట్ల మరణిస్తున్న వ్యక్తికి ఉన్న మోహమే దీనికి కారణం. ఆహుజాగారూ! ఇదీ విషయం. దుర్గాదాస్, ఇతర పాత సత్సంగీలున్నారు. నన్ను ప్రేమ చేసే వీరికి చెప్పదలచు కుంటున్నాను. వీరిని మోసగించను. మరణించే సమయంలో ఎవరికైనా గురువుపై, తండ్రిపై, తల్లిపై, గురువు ఆశ్రమంపై, బ్యాస్ పై, బాబా ఫకీర్‌తో, రామునితో మహమ్మద్‌తో, కృష్ణునితో ప్రేమ ఉంటే, స్థూల పదార్థాలపట్ల మోహం ఉన్న కారణంగా శరీరం నుండి వెలువడే వస్తువు ఈ వాసనల కోరికల వలన భారం అవుతుంది. కనుక భూమి ఆకర్షణ శక్తి దానిని పైకి వెళ్ళనీయదు. సమస్త జీవనం ఏం చేసినా రాకపోకలు వదలవు. వాస్తవం చెబుతున్నాను. బాబా సావన్‌సింగ్ విషయం వినండి. ఆయననేవారు "హరిద్వార్‌ను ప్రేమించే వారు

మరణించాక హరిద్వార్‌లో చేపలవుతారు" అని. ఇప్పుడు నేనూ అదే మాట అడుగుతున్నాను. "బ్యాస్‌ను ప్రేమించేవారు వ్యాస్‌లో చేపలు కారా? ఆగ్రా, హూషియార్ పూర్‌పై ప్రేమ పెంచుకునే వారు అక్కడి చేపలు కారా? ఆలోచించండి నేనేం చెబుతున్నానో! మీరు సత్సంగానికి వచ్చారు. గురుసేవ చేయండి. పైసలివ్వటం వల్లనే గురుసేవ కాదు. ఇచ్చి పుచ్చుకోవటం లోక రివాజు. పైసలివ్వటం వలన ముక్తి లభిస్తే పెద్ద పెద్ద షావుకార్లంతా తరించి పోతారు. గురుభక్తి ఏమిటి?

దర్శన్ కరే బచన్ పుని సునే, సున్ సున్ కర్ నిత్ మన్ మే గునే ॥
గున్ గున్ కాఢ్ లే తిస్ సారా, కాఢ్ సార్ తిస్ కరే అహారా ॥

దర్శనమును చేసుకుని, వచనాలను మళ్ళీ మళ్ళీ విని విన్నవాటిని నిత్యం మనసులోని తలచి, వాటిలోని సారం గ్రహించాలి.

ఇదీ గురుభక్తి. నా మాటలను శ్రద్ధగా వినండి. నేను తప్పు చెబితే నా చెవులు పట్టుకొనండి. ఇప్పుడు సనాతన ధర్మపు మాటలు వినండి. అందులో నాలుగు ఆశ్రమాలున్నాయి. పాతిక సంవత్సరాల వరకు బ్రహ్మచర్యం పాటించాలి. ఇదే మాట నేనూ చెబుతున్నాను. మానసిక, శారీరక బ్రహ్మచర్యం పాటించండి. 25 నుండి 50 సంవత్సరాలు వరకు గృహస్థాశ్రమం, 50 నుండి 75 సంవత్సరాల వరకు వానప్రస్థం, భార్య వెంట ఉన్నా భోగించరాదు. ఇవాళ రేపటి కాలంలో "50, 60, 70 సంవత్సరాల తరువాత సన్యాసం తీసుకో" అంటారు. సన్యాసి ధర్మం ఏమిటి? మూడు రోజులకంటే ఎక్కువ ఒకచోట నిలవటం సన్యాసి ధర్మంకాదు. ఎందుకు? ఎందుకంటే ఆ స్థలంపై అతనికి మోహం ఏర్పడుతుంది. మోహం ఉండకూడదు గనుక సన్యాసి స్థలం మారటం తప్పనిసరి.

నేను గురువునై అహుజాతో లేదా దుర్గాదాస్‌తోనో మోహం పెంచుకుంటే నేనెక్కడికిపోతానో చెప్పండి. అందుకే నేనసలు శిష్యులనే చేసుకోలేదు. నా గురువు అప్పగించిన బాధ్యత నిర్వహించాను. మరి నేనేం చెప్పాలనుకుంటున్నాను? సూఫీసాహబ్! నీవీ ప్రపంచం నుండి తరించిపోవాలనుకుంటే ఏం చేయాలి? కవిత్వం రాసేవారు దాటిపో గలిగితే ఇంకేం కష్టముండేదే కాదు. ఈ మనోరమ ఎన్నో భజనలను గానం చేస్తుంది! ఈమెకు ఏదో ఆపద వస్తే నా దగ్గరకు వచ్చింది.

"నీ భక్తి ఎక్కడికి పోయింది" అని అడిగాను. ఆచరించటం వేరు! మాటలు పైపైన చెప్పటం వేరు! నేను కూడా పడిపోతుంటాను. నన్ను మీరే సంరక్షించారు. ఈ వయసులో కూడా నా సద్గురువులు మీరే! దయ మాత్రం దాతాదయాలునిదే! నా రూపం మీ లోపల సాక్షాత్కరిస్తుందని విన్నాక నా లోపల కనిపించేవి కూడా లేవనీ మాయా అనీ, కల్పితమనీ నమ్మకం ఏర్పడింది. ఈ జ్ఞానాన్ని ఎప్పుడైనా మరిచినప్పుడు నేను కూడా మనసు పరిభ్రమణంలోకి వస్తాను. నేను అలా మనసు పరిభ్రమణంలోకి రానని అనుకోకండి. అందుకే అసలైన ఇంటికి వెళ్లటం లేదా శబ్దంలోకి వెళ్ళటం మన చేతిలో లేదని నిర్ధారించుకున్నాను. ప్రయత్నించటం మన ధర్మం. "జిస్ పర్ దయా ఆది కర్తా కీ వహ యహ నియామత్ పాయే", ఆది కర్తాపురుషుని దయ "ఎవరిపై ఉంటే వారికే ఇది లభిస్తుంది" అనే మాట వాస్తవం. నేనే పతనమవుతుంటాను, పడి పోతుంటాను! ఇక మీరు పతనమవరని, పడిపోరని ఎలా అనుకుంటాను? ఆయన దయ కలిగిన వారు ఆ స్థానాన్ని ఆ ఇంటిని పొందుతారు. మనమంతా మనస్సు పరిభ్రమణంలోకి వచ్చామని సత్సంగం ప్రారంభించక ముందే నేను చెప్పాను. భర్తకు భార్యతో, భార్యకు భర్తతో సరిపడదు. అన్నతమ్మునికి శత్రువు. రాజుకు ప్రజలతో సరిపడదు. మన ఊహలో, భావనలో చాలా శక్తి ఉంది. మనిషి ఈ మనస్సు కంటే పైకి వెళ్ళలేకుంటే మోక్షం ఆలోచనను వదిలెయ్! మనసులో ఉంటూ ఒకవేళ ఎవరైనా ఈర్ష్య పడితే, శత్రుత్వం చేస్తే అతనికి శిక్ష పడుతుంది. తప్పించుకోలేడు. ఎవరైనా కానీ! ఫకీరైనా, దాతాదయాలైనా, బాబా సావన్ సింహ అయినా, అవతారాలైనా, పీర్ పైగంబర్ లైనా ఎవరైనా కానీ తప్పించుకోలేరు. బాబా సావన్‌సింగ్ అస్వస్థులు కాలేదా? దాతాదయాల్ ధామం పాడుపడలేదా? మీరు పొరపాటులో ఉన్నారు. గురువు రూపాన్ని అర్థం చేసుకోలేదు. బుద్ధి, తెలివి, వివేక జ్ఞానాలపేరే గురునామం. గురువును గొప్పగా చేసి పొగిడితే నీ నావ తీరం చేరదు. గురువేది చెబుతున్నాడో దానిని ఆచరించాలి. నా మాటలను ఆలోచించండి! నేను మీకు సత్సంగమిస్తున్నాను.

మన్ కే నాచ్ సారే నాచే, ఋషి ముని నర దేవా ।

ఋషులు, మునులు, నరులు, దేవుళ్ల మనసు ఆడించినట్లే ఆడుతారు. మీరు సత్సంగంలోకి వచ్చారు. నేను ఏదో ఒక లక్ష్యంతో పనిచేస్తాను.

మానవతా మందిరం ఉంది. నిజమే! కానీ నేను ప్రజలకళ్ళల్లో కారం కొట్టదలచుకోను. నా ప్రసాదంతో నీకు కొడుకు పుట్టాడు. మీరు డబ్బు పంపారు. అవునని అంగీకరించను. నా రూపం మీ అంతరంలో సాక్షాత్కరించిందనీ లేదా నన్ను ధ్యానించటం వలన మీ పని సఫలమైందనే భావంతో నాకు డబ్బులిస్తే తీసుకోను. ఇది పాపం. సహాయ పడే ఆలోచనతో సాయపడడానికి నాకు అభ్యంతరంలేదు. ఓ పెద్దమనిషినో, చిన్నమనిషినో నా వలలో చిక్కుపడేసుకోవాలని నాకు ఎప్పుడూ ఆలోచన రాలేదు. లోగడ నీకేది దొరికినా లేదా ప్రస్తుతం దొరుకుతున్నా, భవిష్యత్తులో ధొరికేదున్నా అది నీ కర్మఫలమే! నీ ఊహల, ఆలోచనావిచారాల ఫలమే! నీ విశ్వాసఫలితమే! కొందరు నన్ను విశ్వసిస్తారు. వారికి నేనేదైనా శుభం పలికితే వారి పనులు సఫలమవుతాయి. వాటిని నేను నెరవేరుస్తున్నానా? ఏ మాత్రం కాదు. నీ విశ్వాసమే నెరవేరుస్తుంది. ఏంచెప్పాలనుకుంటున్నాను? ప్రపంచం నుండి తరించి పోవాలనుకుంటే నీవు మరణించడానికి ముందు ప్రపంచంలో ఏ స్థూల పదార్థంతోనూ మోహం కలిగి ఉండకూడదు. బాబా ఫకీర్‌తో మోహం ఉన్నా నీవు తరించిపోలేవు. నా గురువు ఫకీర్ అని ఒకరంటారు. నా గురువు దాతాదయాల్ అని మరొకరంటారు. నా గురువు సావన్ సింహ అని ఇంకొకరంటారు. సంతులకే మణిమయమకుటమైన సంత్ శిరోమణి కబీర్ ఏమని చెప్పిపోయాడు?

గురు కో మానుష్ జాన్‌తే, తే నర కహియే అంధ్ ।
దుఃఖీ హోయ్ సంసార్ మే, ఆగే యమ కా ఫంద్ ॥

ఏ మనిషి తన గురువును శరీరధారిగా భావిస్తాడో అతడు అంధుడే ననీ, యముని బారి నుండి తప్పించుకోలేడనీ కబీర్ సాహబ్ చెబుతున్నాడు.

గురు కియా హై దేహ కో, సతగురు చీన్హా నాహిఁ ।
కహే కబీర్ తా దాస్ కో తీన్ తాప్ భర్‌మాహిఁ ॥

గురువును మనిషని భావించిన నరుడొక అంధుడు
దుఃఖితుడగునీ లోకంలో ఆపై యమునికి బంధితుడు
గురువు చేసెను దేహం సత గురువు ఎంపిక లేదు
అనెను కబీరు ఆ దాసునికి, వదలవు భ్రమలు త్రయతాపాలు.

ఫకీర్‌చంద్‌ను గురువనుకునే మనిషి మూర్ఖుడు. ఒకవేళ నీవు అక్కడికి చేరుకోలేకపోతే నీవు ఎవరినుండి నామం, ఉపదేశం తీసుకున్నావో ఆయన్ని శరీరధారి అనుకోకు, "గురుర్బ్రహ్మా, గురుర్విష్ణూ, గురుర్దేవో మహేశ్వరః, గురు సాక్షాత్ పరబ్రహ్మా తస్మైశ్రీ గురవేనమః" అనుకో! గురువొక ఆదర్శం. నా ఉత్తీర్ణతా, సాఫల్యతా రహస్యమేమిటి? నేను దాతాదయాల్‌ను మనిషనుకోలేదు. ఆయన్ని నేను రాముని అవతారంగా విశ్వసించాను. ఆయన నా భావాన్ని, ఊహను గురుమతం వైపు మళ్ళించారు. నా రూపం మీలో ప్రకటించినా అది నేను కాననే విషయం బోధపడ్డాక నాకళ్ళు తెరుచుకున్నాయి. మరిప్పుడు నేనేం చేస్తాను? ప్రకాశ, శబ్దాలే నా ఇష్టం, ఆదర్శం. ప్రకాశమే గురుచరణాలు! నీవు ఫకీర్‌చంద్‌తో ప్రేమ పెంచుకున్నావు. కనుక ముక్తి లభిస్తుందనే ఆలోచనలో నీవుండకూడదు. అది అబద్ధం. ఫకీర్‌చంద్ ఏం చెబుతున్నాడో వి... అర్థంచేసుకుని, దానిని ఆచరించటం వలన ముక్తి లభిస్తుంది. నేను నా ఆత్మను శుద్ధిగా, పవిత్రంగా ఉంచుకుని ఈ లోకం నుండి వెళ్ళగోరుతున్నాను. అజ్ఞానంలో ఉంచి మిమ్మల్ని దోచుకోగోరటం లేదు. మీ ఇష్టమైతే మానవతా మందిరానికి సహాయపడండి. లేకుంటే లేదు. మీ కిష్టమైతే నా పుస్తకాలు చదవండి, లేకుంటే లేదు. ఇది తరించిపోవడానికి మార్గం. ఇప్పుడు ప్రపంచం యొక్క మార్గంఏమిటి? మనిషి ఆలోచనలో, భావనలో చాలా బలముంది. ఎందుకు చెబుతున్నాను? కొందరు అంతరంలో నా రూపం సాక్షాత్కరింపచేసుకుని తమ తమ పనులు సఫలం చేసుకుంటారు. నాకా విషయాలే తెలియవు. ఓ కుర్రవాడుండేవాడు. సైన్స్ పరీక్ష రాయడానికి వెళ్ళాడు. పేపరు కఠినంగా ఉండటంతో నన్ను తలచుకున్నాడు. నా రూపం సాక్షాత్కరించి, "నన్ను వీళ్ళెవరైనా చూస్తారు. నేను బెంచీ కిందకూర్చుంటాను. నీ సైన్స్ ప్రశ్నలకు జవాబులు చెబుతుంటాను. నీవు రాస్తుండు" అంది. ఆ పిల్లవాడికి నూటికి 98 మార్కులొచ్చాయట. మరి అతనికి సాక్షాత్కరించిన దెవరు? నేనైతే వెళ్ళలేదు. ఆ కుర్రవాడి విశ్వాసమే పనిచేసింది. నీవు లోకానికి నిజం చెప్పకుంటే నీకు గౌరవాదరాలు లభిస్తాయి. ఆ గౌరవాదరాలే నిన్ను తినేస్తాయి. అంటే హానిని కలిగిస్తాయి. ఈ రోజు మీకు వాస్తవం చెప్పకుంటే మరణించాక ఏమవుతాను? ఎక్కడికి పోతాను? అని భయపడుతుంటాను. కొందరు అంత్య సమయంలో గడిపిన జీవితం చూశాను. దాతా దయాలుని

ధామం పాడుబడింది. జీసస్ క్రీస్తు పరిస్థితి ఏమైంది? రేపు నాకేం జరుగుతుందో తెలియదు. ఈ జీవితంలో ఎవరితోనూ మోసంతో వ్యవహరించనందుకు సంతోషంగా ఉంది. నేను మూడు పాపాలు చేశాను. ఆరునెలలు మాంసంతిన్నాను. ఒకసారి ఓ వేశ్య దగ్గరకు వెళ్ళాను. మూడుసార్లు మద్యం తాగాను. నేను నా స్వార్థం కోసం ఎప్పుడూ మోసం, కుట్రలు చేయలేదు. నేను కూడా నరకానికి వెళ్తే ఏం ఫర్వాలేదు. శరీరాన్ని విడిచే ముందు బోధనా పద్ధతిని మార్చుమని దాతాదయాల్ ఆజ్ఞాపించాడు. కనుక మార్చాను. ఓ మనిషీ! నీవు జనన మరణాలనుండి రక్షించబడాలనుకుంటే ఈ జీవనంలో ఏ స్థూల పదార్థంతోనూ మోహం కలిగి ఉండకూడదు. గురువు, గురువుగారి ఆశ్రమంపై కూడా మోహం ఏ మాత్రం ఉండకూడదు. నగలూ, స్త్రీ, పిల్లలు అన్నీ ఇందులోకే వస్తాయి. కేవలం ప్రకాశ, శబ్దాలనే నీ ఇష్టంగా, ఆదర్శంగా పెట్టుకో. దీనివలన నీ మృత్యు సమయంలో నీవు ప్రకాశ, శబ్దాల లోకి వెళ్ళిపోవాలి, జనన మరణాలు వదలిపోవాలి. ఇక మిగిలింది ప్రపంచం! ఇది ఊహ, ఆలోచనా విచారాల భావనల ప్రపంచం. కొందరు నా రూపం ఏర్పర్చుకుని పనులు నెరవేర్చుకుంటున్నారు కనుక నీ భావనలో, ఆలోచనా విచారంలో చాలా బలముందని ఋజువవుతున్నది. అందుకే నేను చెబుతున్నాను. ఇళ్ళల్లో శాంతిని పెంచండి. ఏ ఇళ్ళల్లో కలహాలు జరుగుతుంటాయో, భార్యా భర్తలకో, అన్నదమ్ములకో పడదో, అక్కడ సుఖ శాంతులు ఏనాటికీ ఉండవు. ఇది నా బోధనలసారం. నేనర్థం చేసుకున్న విషయం. శారీరిక, మానసిక బ్రహ్మచర్యం పాటించండి. మీకు పిల్లలున్నారు. వీరిని సంభాళించటం కష్టమైనపనే! తప్పు చెయ్యకుండా ఉండాలని, మీ పిల్లలకు స్పష్టంగా బోధించండి. ముందు మీరు స్వయంగా ఆచరించి చూపండి. పిల్లలదేం దోషం? చిన్నవయసులోనే పిల్లలు చెడిపోతుంటారు. దీనికి బాధ్యులు మీరే! ఎందుకు? ఎలా? పిల్లలు కడుపులో ఉండగా ఆరవ, ఏడవ నెలల్లో కూడా మీరు విషయభోగాలను భవిస్తుంటారు. అర్జునుడు సుభద్రకు చక్రవ్యూహాన్ని ఛేదించే విషయం చెబుతుండగా అభిమన్యుడు తల్లిగర్భంలో ఉంటూ చక్రవ్యూహం లోపలికి ప్రవేశించే మార్గం నేర్చుకునే సంస్కారం గ్రహించగలిగాడు. ఆమె మేల్కొని ఉన్నంతసేపూ కడుపులో ఉన్న అభిమన్యుని మేధస్సులో ఆ విషయాలు ముద్రితమయ్యాయి.

ప్రపంచంలో సాఫల్యం పొందాలంటే ఏ వస్తువు అవసరమవుతుంది? అదే

శివసంకల్పమస్తు. వేదమార్గం. నీ హృదయంలో ద్వేషం, ఏవగింపు ఏ మాత్రం ఉండకూడదు. నీవు వాటికి నీ మనసు లోపల చోటిస్తే నీ ఇంట్లో అశాంతి నెలకొంటుంది. అశాంతి కారణంగా రోగాలు, కష్టాలు వస్తాయి. చెప్పాలని లేకపోయినా చెబుతున్నాను. 1974 ఢిల్లీలో 'దసరా' సత్సంగం ఇచ్చాను. ఆ సత్సంగంలో అనేక అంశాలను వివరించాను. మహాత్మాగాంధీ తుపాకీ గుండుకు ఎందుకు బలయ్యాడో చెప్పాను. క్రీస్తు శిలువ పైకి ఎందుకు ఎక్కవలసి వచ్చిందో వివరించాను. జయప్రకాశ్‌నారాయణను గురించిన ప్రస్తావన రాగా ఆయన కూడా మున్ముందు బాధపడతాడని అన్నాను. ఇప్పుడు చూడండి. జయప్రకాశ్ నారాయణ్ రోగగ్రస్తుడై ఉన్నాడు. నా జ్ఞానం, నా అంచనా తప్పుకాదు. నాభార్య ఉండేది. మరిది గానీ, బావగారు గానీ ఏమైనా అంటే మనసులో పెట్టుకునేది. లోలోపలే విసుక్కుని ద్వేషించేది. కోపగించుకునేది. నేను నవ్వేసేవాణ్ణి. "భాగవతీ! నీకేదో కష్టం, ఆపద కలుగుతుంది సుమా!" అనేవాణ్ణి. చివరి రోజుల్లో ఏడున్నర సంవత్సరాలపాటు మంచంపై వ్యాధిగ్రస్థురాలై పడి ఉంది. నా సత్సంగానికి స్త్రీలు వచ్చారు. మీకు నిజం విప్పి చెప్పవలసిన బాధ్యత నాపై ఉంది. మీకు నా జీవితంలోని ఉదాహరణలు చెబుతాను. ఒక కొడుకును నేను కొడుకు కావాలనే ఆలోచనతో కన్నాను. మిగతా వారిలాగా నేనూ కొన్ని పొరపాట్లు చేశాను. ఆ నా పుత్రుడు ప్రస్తుతం 48 సంవత్సరాల వాడయ్యాడు. నేటి వరకు అతణ్ణి కోప్పడే, కొట్టే అవకాశమే రాలేదు. అతడు అంతటి విధేయుడు, వినమ్ర స్వభావుడు. 2,500 రూపాయల నెలజీతం సంపాదిస్తాడు. నేను నా విధిని సక్రమంగా, సంపూర్ణంగా నిర్వహిస్తున్నాను. దుర్గాదాస్‌కు కృతజ్ఞుడనై ఉంటాను. నాకు అతడు సహాయం చేశాడు. పని చేయడానికి నాకొక క్షేత్రం లభించింది. నేను కేవలం సేవకుడను. "ఫకీర్! దేహాన్ని వదిలివెళ్ళకముందు బోధనా పద్ధతిని మార్చు" అని నా గురువు దాతా దయాల్ మహారాజ్ ఆజ్ఞాపించారు. నేను వెల్లడిస్తున్న అంశాలు తప్పో ఒప్పో నాకు తెలియదు. నా నడవడి పవిత్రంగా ఉంది. నా అంతరంగం నిర్మలమై ఉంది. స్త్రీలు-మీరు మంచి సంతానానికి జన్మనివ్వండి. ఇళ్ళల్లో శాంతి నెలకొల్పండి. శాంతి ఉండేలా చేయటం, చేయకపోవటం మీ చేతులలో ఉంది. నే నిక్కడే విఫలమయ్యాను. నన్ను ఇక్కడికి ఆహుజాగారు పిలిచారు. ఆయనకు చెప్పాలనుకుంటున్నాను. ప్రియమిత్రుడా! కొడుకులు, కూతుళ్ళు ఎవరున్నా;

ఎందరున్నా తమ తమ కర్మలనుభవించడానికి ఈ లోకంలోకి వస్తారు. ప్రతి మనిషీ తన కర్మను తన వెంట బెట్టుకుని వస్తాడు. ఏ సేవ చేయవలసి ఉందో దానిని చేయటం నీ విధి, బాధ్యత. చింతించకూడదు. మీరు అనవసరంగా బాధపడుతుంటారు. బలహీన మనస్కులవుతుంటారు. ఫలితంగా డాక్టర్లైనా దోచుకుంటారు లేదా నా వంటి మహాత్ములైనా దోచుకుంటారు. మీకు స్మరణ, ధ్యానం చేయమని గురువు చెబుతాడు. ఎందుకు అలా చెబుతాడో మీకు తెలియదు. మీ మనసు ఏదైనా మురికి దుర్విచారాలను లేవదీసినప్పుడు వెంటనే గురుని ధ్యానం, ఆయన చెప్పిన స్మరణ చేయండి. ఒక వ్యక్తి అరగంటో, గంటో ప్రతి ఉదయం అభ్యాసం చేస్తాడు. ఇక రోజంతా తన మనసు ఎటు పోతున్నదో, ఎలాంటి ఆలోచనలు చేస్తున్నదో గమనించడు, పట్టించుకోడు. ఇలాంటి అభ్యాసం వలన ఫలితమేమీ ఉండదు. నీ మనసుపై సదా ఓ దృష్టి వేసి ఉంచు. అదేం ఆలోచిస్తుందో పరిశీలించు. మనసులో దుర్విచారాలు వస్తే, మురికి ఆలోచనలు వస్తే వెంటనే స్మరణ చేయి. ధ్యానంతో ఆ ఆలోచనలను దూరం తరిమెయ్యి. లేదా జ్ఞానంతోనైనా దూరం చేయి. నా గురించి నాకు తెలుసు. బాగ్దాద్‌లో ఉండగా రెండు తంబురాలను నా తలకు కొట్టుకుని వాటిని విరగ్గొట్టాను. భజన చేసే వాణ్ణి. మనసు మరేదో వైపు పోయేది. ఈ మనసు చాలా చంచలమైనది. ఈ విషయం మీకు తెలియదు. నేను కూడా ఎక్కువ మాటలు మాట్లాడతాను. అప్పుడప్పుడు ఇది నన్ను కూడా దెబ్బతీస్తుంది. నాకు మీ వలన తెలిసింది. నేనెవరి అంతరంలోకీ వెళ్ళనని తెలిశాక మనసు లోపల వచ్చే భావనలు, ఆలోచనలు అన్నీ మాయేనని, ఇంకేమీ కాదని బోధపడింది. ఈ మనసుతో యుద్ధం చేయటం తేలికైన పనేం కాదు. దీనికి వైద్యం, చికిత్స ఏమిటి? సత్సంగం. నీవు ఎవరిని ధ్యానం చేస్తావో, నీవు ఎలా ఆయన్ని భావిస్తావో, ఆయన ఎలా ఉన్నా ఆ ప్రభావం నీపై పడుతుంది. నేను ఒక వేళ మహాత్ముడనై సత్యమైన విషయం నీకు చెప్పకుంటే, మందిరం కోసం డబ్బు పోగుచేయడానికి, భయానక మాటలు చెబితే నన్ను మీరు ధ్యానిస్తే నేను మురికి - భావాలతో ఉన్నాను కాబట్టి మీరు కూడా మురికి స్వభావంగల వారవుతారు. మనిషి ఒక రేడియో స్టేషన్ వంటివాడు. ఇందులో నుండి నువ్వెలా ఉంటే అలాంటి ఆలోచనలు, భావనా విచారాలు వెలువడుతుంటాయి. ఇంట్లో ఒక స్త్రీ ఉంది. ఆమె గొణుగుతుంటుంది.

విసుక్కుంటూ కోపగించుకుంటూ ఉంటుంది. ఆమె ఉన్న గదిలోకి నీవు వెళ్తే భయపడతావు. ఇది ప్రకృతి సిద్ధమైన విషయం. ఊహల్లో, భావనలలో, ఆలోచనా విచారాలలో చాలా శక్తి ఉంటుంది. ఇది సంకల్పమయ ప్రపంచం. ఈ మనసును అదుపు చేయటం సులభమైన పని కాదు. దీని చికిత్స సత్సంగం. ఇది ఎవరో ఒక నిర్బంధ పురుషుని సత్సంగం కావాలి. తప్పుడు మనిషి సత్సంగం కాకూడదు. నువ్వాయన్ని గురువనే భావించాలని ఏమీ లేదు. అన్న, తమ్ముడు, మిత్రుడు, తండ్రి ఏమనైనా అనుకో. ఉదయం సాయంత్రం మీమీ మతాన్ని బట్టి మీకు ఎలాంటి సంస్కారాలు దొరికాయో వాటిని వివరిస్తూ పిల్లలను కూర్చొబెట్టుకుని సత్సంగం చేయండి.

సాధో యహ మన్ హై బడా జాలిమ్,
జా కో మన్ సే కామ్ పరో హై, తిస్ హీ హై హే మాలుమ్।
మన్ కారన్ జో ఛాయా, తేహీ ఛాయా మే అటకే,
నిరగున్ సరగున్ మన్ కీ బాజీ, ఖరే సయానే భటకే ॥
మన్ హీ చౌదహ లోక్ బనాయా, పాంచ్ తత్వ గున్ కీన్హే ।
తీన్ లోక్ జీవన్ బస్ కీన్హే, పరై న కాహూ ఛీన్హే ॥
జో కోవు కహే హమ్ మన్ కో మారా, జా కే రూప్ న రేఖా,
ఛిన్-ఛిన్ మే కితనౌ రంగ్ ల్యావే, జే సపనేహు నహి దేఖా ।
రసాతల్ ఇక్ఇస్ బ్రహ్మాండా, సబ్ పర్ అదల్ చలావే,
షట్ రస్ మే భోగా మన్ రాజా, సో కైసే కై పావై ।
సబ్ కే ఊపర్ నామ నిహచ్చర్, తఃహ లై మన్ కో రాఖై,
తబ్ మన్ కీ గతి జాన్ పరై యహ, సత్ కబీర్ ముఖ్ భాఖై ॥

మీ లోపల నేడు బాబా ఫకీర్ రూపం ప్రకటమైంది. నేనైతే వెళ్ళ లేదు.అట్లా వెళ్ళిందెవరు? నీ మనసే ! నీవు పొరపడుతున్నావు. ఈ స్థితిని చూసి ప్రకృతి-పరమేశ్వరుడు నా మేధస్సును కదిలించారు. నా గ్రహాలే అట్లా ఉన్నాయి. నేను ఇందుకే వచ్చాను. అనామీధామం నుండి అవతారం ధరించి సంత్ మతాన్ని శుద్ధిచేసి పోవటానికే వచ్చాను. నీ లోపల బాబాసావన్ సింగ్ ప్రకటమయ్యాడు. ఇది నీ మనసే. నీకు తెలియదు. నువ్వు అందులో చిక్కుపడతావు. సమస్త ప్రపంచం రూపాల చిక్కులో బిగిసి మరణించింది. జీవితమంతా స్వామీజీ

మహారాజ్‌ను ధ్యానం చేస్తూ చేస్తూ చనిపోయినా నీ రాకపోకలు వదలవు. నేను అన్ని ఋజువులూ చూపాను. ఏదీ వదల్లేదు. ఆచరించటం నీ వంతు. నాపైన ఒక బాధ్యత ఉంది.

తేరా రూప్ హై అద్భుత్ అచరజ్ తేరీ ఉత్తమ్ దేహీ ।
జగ్ కళ్యాణ్ జగత్ మే ఆయా పరమ దయాల్ సనేహీ ॥

చాలాసార్లు ఆలోచిస్తుంటాను. నీవేం చేయగలవని? నేను సత్యమైన జ్ఞానాన్నిస్తున్నాను. "ఓ మానవ జాతీ! బయటి నుండి ఏ రాముడూ, కృష్ణుడూ, మహమ్మదూ, గురువూ, క్రీస్తూ రారు. నీవు భ్రమపడుతున్నావు. "హిందూ వార్తాపత్రిక"లో నేనో వ్యాసం చదివాను. "నేను పై లోకపు చక్రవర్తిని" అని క్రీస్తు అనే వాడట. అది విని అతని శత్రువులతన్ని పట్టుకున్నారు. ఆయన కళ్ళకు గంతలు కట్టి ముఖంపై గట్టిగా కొట్టారు. తరువాత "నిన్నెవరు కొట్టారో చెప్పు" అన్నారు. ఆయన గుర్తించలేకపోయాడు. గుర్తిస్తే అతని స్థాయి పెరిగేది. మీరంతా భ్రమలలో ఉన్నారు. ఎవరూ మీ నావను తీరానికి చేర్చరు. గురువాణి, దాని జ్ఞానం, నీ ఆచరణ తీరం చేరుస్తాయి. రాముడు, బాబా ఫకీర్ లేక బాబా సావన్ సింగ్ తీరం చేర్చరు. నేనిది ఎందుకు చెబుతున్నాను? వేలాది మంది నన్ను గురువుగా భావిస్తున్నారు. స్పష్టంగా చెప్పటం వలన నా ఆత్మపై ఏ భారమూ ఉండదు. నీవు నీ అజ్ఞానంతో నన్ను గురువుగా భావిస్తే భావించు. నాకే పాపమూ అంటదు. ఫకీర్ చంద్‌ను పూజించటంవలన నీ నావ తీరం చేరదు. బాబా ఫకీర్ చంద్ మాటలను అర్థం చేసుకుని, వాటిని ఆచరిస్తే నావ తీరం చేరుతుంది. నా రూపం మీలో ప్రగటమైందని విన్నప్పటినుండీ, అదినేను కాదని బోధపడినప్పటి నుండీ మనస్సు రూపం నాకు అర్థమైంది. ఇప్పుడు నేను మనసులో చిక్కుపడను. బంధింపబడను. ఈ జ్ఞానాన్ని మరిచి పోతే నేను కూడా మనస్సు పరిభ్రమణంలోకి వస్తాను. అందుకే నా శిష్యులను సత్యమైన సద్గురువులుగా భావించి మొక్కుతాను. ఎందుకంటే మీ నుండే నాకీ జ్ఞానం లభించింది. విషయం మీకు అర్థమైందనుకుంటాను. గృహస్థులు చాలా ఘోరంగా దోచుకో బడ్డారు. మన కళ్ళలో ధూళి గొట్టి, ఈ అన్ని మతాల వాళ్ళూ తమను మెరుగు పరుచుకున్నారు. భౌతిక స్థాయి పెంచుకున్నారు. వీళ్ళు మనకు సత్యమైన విషయం చెప్పలేదు.

నేను తెరపెడితే మిమ్మల్ని దోచుకుని తింటాను. విషయమేమిటని ఆలోచిస్తుంటాను. నేనే మాటైనా అంటే అది నిజమవుతే నేనే ఏదో చేస్తాననీ దీనర్థంకాదు. నేను చేయను. నాలో ఆ శక్తి లేదు. నా లోపలా బయటా ఒకటే ఉంది. జరగవలసి ఉన్న మాటే నా నోటినుండి వెలువడుతుంది. నాకు గురుత్వం అక్కర్లేదు. నేను నావిధిని, బాధ్యతను నిర్వహిస్తున్నాను. మీకు మీ కర్మఫలమే లభిస్తుంది. మనస్సు యొక్క బంధన నుండి నన్ను మీరు విడిపించారు. ఇప్పుడు నేను మిమ్మల్ని దీనినుండి విడిపించదలచు కుంటున్నాను. కానీ నా సత్యమైన మాటలను వినడానికి మీరు సిద్ధంగా లేరు. ఇదంతా మీ మనసు యొక్క పరిభ్రమణమే! మనసు లీలే! నేనీ పనిని ఎంతో బాధననుభవించి చేశాను. గీతను చదవండి. భాగవతాన్ని చదవండి. అర్జున సమేతంగా పాండవులంతా నరకానికి వెళ్ళారు. కృష్ణుని ముఖంనుండి నేరుగా 18 అధ్యాయాలు విన్నా అర్జునుడు కూడా నరకానికి పోయాడు. “వచ్చెయ్! శరణంలోకి! రక్షిస్తాను” అన్నాడు దాతా దయాలుడు. రాధాస్వామి దయాలుడు అన్నాడు, “యహకర్నీ మై ఆప్ కరావూఁ, పహచావూఁ ధుర్ దర్బారు” ఇలాంటి లాంటి మాటలు విని మనిషి ఎక్కడికి వెళ్ళాలి? ఎవరిని అడగాలి? “ఓ మనిషీ! గురువు నీకు జ్ఞానం ఇవ్వాలి. నావ తీరం దాటడం అనేది నీ ఆచరణ వలన జరుగుతుంది” అని చెబుతుంటాను. నేను చెప్పిందే దాతా దయాల్ చెప్పాడు. నేను సంత్ మతం నుండి బయటికి వెళ్ళను. దాతా దయాల్ శబ్దం ఉంది.

గురు రూప్ న సమ్ఝే కోయీ, భరమ్ మే పడే అజ్ఞానీ ।

దీనిని నేను అర్థం చేసుకోనప్పుడు నన్ను దాతా దయాల్, “తేరే ఘట్ మే మాల్ ఖజానా హాయ్ ఫకీర్” అనేవాడు. నేను చెప్పేదేమిటంటే ఏ గురువు నుండి నీవు నామం తీసుకున్నావో ఆ గురువు బాబా ఫకీర్ అనో, బాబా సావన్ సింగ్ అనో అనుకోకు. ఆయన్ని పూర్ణుడని అనుకో, నీవాయన్ని ఎప్పుడైతే అలా భావిస్తావో నీ విశ్వాసం వల్లనే నీ పనులు నెరవేరుతాయి. ఒక స్త్రీ ఉంది. కొడుకు ఆమెను తన భావంతో చూస్తాడు. భర్త తన భావంతో చూస్తాడు. తమ్ముడు మరో భావంతో చూస్తాడు. ఇలాగే ఉన్న ఆట, లీలంతా నీ మనసుదే! మీ గురువులను వదిలిపెట్టమని నా అభిప్రాయం కాదు. గురువును మనిషిగా భావించకు. అతణ్ణి

పూర్ణుడని నమ్ముకో, నీ లోపల ఆయన్ని ధ్యానించు. నీ అన్ని పనులూ నెరవేరుతుంటాయి. గురువు ఎంతటి దుర్మార్గుడైనా నీ పనులు నెరవేరుతుంటాయి. అయితే నీకు జ్ఞానం దొరకదు. ఉన్న లీలంతా నీ విశ్వాసానిదే! రేపు అభ్యాసం గురించి చెబుతాను. అభ్యాసికులు రావచ్చు. అభ్యాసం సులభం. బోధించే వారికి తెలియదు. కొందరు పుస్తకాలను ఉదాహరిస్తారు. నేను నా అనుభవం చెబుతాను. ప్రతి వ్యక్తి ప్రకృతి వేర్వేరుగా ఉంటుంది. కానీ ధ్యేయం ఒక్కటే. దారులు వేర్వేరుగా ఉంటాయి. గురువు తన వలలోనుండి బయటపడనీయడు, ఫలితం లభించాలని ఇవాళ నీవు దానం చేస్తుంటావు. ఆ ఫలం స్వీకరించడానికి మరో జన్మ నెత్తవలసి ఉంటుంది. అందుకే ఏ పని చేసినా నిష్కామపూరితంగా చేయి. నిష్కామకర్మకు ఉదాహరణ చెబుతాను. నేనీ పని చేస్తూ 37 సంవత్సరాలు గడిచాయి. నాకు మానవతా మందిరం ఎప్పుడూ కలలో రాలేదు. దుర్గాదాస్, ప్రేమ్‌చంద్, నారాయణ్ దాస్, గోపాల్ దాస్‌లు ఎప్పుడూ స్వప్నంలో రాలేదు. వీరు నాకు ఎంతో సేవ చేస్తుంటారు. కానీ రైలు, నా తల్లిదండ్రులు, నా భార్య ఇప్పటికీ అప్పుడప్పుడూ స్వప్నాలలో కనిపిస్తుంటారు. ఎందుకలా? నేను చేసిన ఆనాటి పనులు నా స్వార్థం కోసం చేసినవి. నా మేధస్సులో నిలిచిపోయిన సంస్కారాలు ఇప్పటికీ ముగిసిపోలేదు. చివరి దశలో నా స్థితి ఏమవుతుందో నాకు తెలియదు. మరణ సమయంలో స్వప్నంలోకి వెళ్తే, "అంత్ మతా సో గతా" ననుసరించి ఎక్కడో స్టేషన్ మాస్టరు నవుతాను. నీవు చేసే పని నిష్కామకర్మే అయితే దాని ననుసరించి నీ మెదడుపై సంస్కారాలు పడవు. ఇది నా అనుభవంలోని మాటలు. నాకిలా స్వప్నాలు వస్తుంటాయి, మీకు కూడా వస్తుంటాయా అని బాబా సావన్ సింగ్‌జీ మహారాజ్ కి మూడు సార్లు ఉత్తరాలు రాసి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపాను. ఆయన నుండి సమాధానం రాలేదు. ఏ మహాత్ముడూ తన జీవన విధానాన్ని చెప్పడు. నేను చెబుతాను. చివరి దశలో 26 సంవత్సరాల పాటు నేను నా భార్యతో కలిసి ఉన్నా వేరుగా ఉన్నాను. ఆమె మరణించాక ఒకటిన్నర సంవత్సరాలకు నా కలలోకి ఆమె వచ్చి "నీవు నన్ను మోసగించావు" అంది. మనసుపై పడి ఉన్న సంస్కారాలను లేకుండా చేయటం తేలికైన పనికాదు. నేను నా స్వార్థంకోసం చేసిన పనుల సంస్కారాలు నా మేధస్సు పై నుండి పోలేదు. మనం ప్రపంచంలో ఎన్ని పనులు చేసినా ఇవన్నీ సకామ కర్మలు. ఇవే మళ్ళీ మన కర్మలవుతాయి.

ఫలితాలను మరో జన్మలో అనుభవించవలసి వస్తుంది. అందుకే నిష్కామ కర్మ చేయి, నా యీ పని కూడా నిష్కామ కర్మకాదు. నేను ఏడుస్తుంటాను. మందిరం నిర్మించకపోతే ఇవాళ మీ ఇంటింటికీ తిరిగేవాణ్ణి కాను. నేను నా బలహీనతను గుర్తిస్తాను. కర్మయొక్క లీల. కేంద్రం లేకుండా పని జరగదు. ప్రభుత్వ నియమం ప్రకారం సంవత్సరంలో మేం పోగుచేసిన రూపాయలను ఖర్చు చేయడానికి ఆసుపత్రి తెరవాల్సి వచ్చింది.

ఇక్కడికి చికిత్సకోసం నిరుపేదలు వస్తే నాకేం దుఃఖం కలిగేది కాదు. కానీ కార్లు, స్కూటర్లున్న శ్రీమంతులు ఉచితంగా వైద్యం చేయించుకోవటం కోసం వస్తుంటారు. నా జీవితం బాగుందని నేను భావించటం లేదు. కానీ నా పైన ఒక బాధ్యత ఉంది. "దాతా! మీరు ఆజ్ఞాపించారు. నేను పనిచేశాను. పొరపాటు చేస్తే క్షమించండి. నేను అర్థంచేసుకున్న తత్త్వవిచారాన్ని లోకానికి చెప్పాను". మీరు ధ్యానం చేస్తుంటారు. ప్రత్యక్షంగా నైతే పైపైకి భగవంతుణ్ణి పూజిస్తారు. కానీ లోలోపల ఏ స్వార్థం ఉంటుంది? నా ఈ పని పూర్తికావాలి! ఆ పని పూర్తికావాలి! అనుకుంటారు. సత్యమైన మాట చెప్పని గురువు విషం తింటున్నాడనవచ్చు. విషయం స్పష్టంగా చెబుతున్నాను. నేను పొరపాటు చేస్తున్నానని ఎవరైనా అనుకుంటే నా ఎదుటికి వచ్చి నా తప్పుని వేలెత్తి చూపి విమర్శించండి.

సాధో భజన భేద్ హై న్యారా

ఈ గురువులు శిష్యుల చెవులలో మంత్రం ఊది తమ తలలపై భారం వేసుకున్నారు. నేను భారం, బాధ్యత తీసుకోలేదు. నేను శిష్యుల్ని స్వీకరించలేదు. విషయం చెబుతాను. నా మాటను అంగీకరించి, ఆచరించిన వారిపనులు నెరవేరుతాయి. సత్యమైన జ్ఞానం లేని వారందరికందరూ కొట్టుకుపోయారు. ప్రవహించుకుని పోయారు. ఎందుకోసం? దేనికోసం? లోభంకోసం! మానవతా మందిరం కోసం! నేను నా ఆత్మను పరిశుద్ధంగా ఉంచాలనుకుంటున్నాను. వీరు సత్యమైన విషయాన్ని ఎందుకు చెప్పరు? ఎందుకంటే చెబితే డబ్బురాదని చెప్పరు. శిష్యులు పొగడరని చెప్పరు. నా దగ్గరకి ఎవరొస్తారు? కొంతమంది అర్థం చేసుకునే తెలివైన వారే నా వద్దకు వస్తారు. నాకు విలువనిస్తారు. చూడండి! నేనర్థం చేసుకున్నది, మనమంతా సర్వేశ్వరుణ్ణి ధ్యానిస్తాం, జ్ఞాపకం చేసుకుంటాం. అసలైన, ఈశ్వరుడు ఇక్కడుండడు. ఎవరిలో నుండి శబ్దం, ప్రకాశం వెలువడుతుందో

ఆయనే ఈశ్వరుడు, భగవంతుడు. ఆయన పైనున్నాడు. ఎలాగైతే సూర్యుడు ఈ భూమి మీద ఉండకుండా, ఆయనకిరణాలు ఉంటాయో అలాగే ఈశ్వరుడు కూడా ఎక్కడో ఉంటాడు. సూర్యుడు నేలపైకివస్తే మనమంతా దహించుకుపోతాం. ఇలాగే ఒకవేళ ఈశ్వరుడు ఇక్కడికి వస్తే ఇక్కడ అంతా ఏకత్వం అవుతుంది. ఈశ్వరుని అంశలు మాత్రమే ఇక్కడుంటాయి. ఏమిటవి? సురత్‌లు. ప్రతి జీవిలోపల ఈశ్వరుని అంశ ఉంది. అందుకే ఈశ్వరుని భక్తి చేయాలనుకునే వారేం చేయాలి? మనిషి తోటి మనిషికి సేవచేయలి. ఇదీ సత్యమైన ఈశ్వరుని అసలైనభక్తి. కానీ ఒక మనిషి మానవులందరి సేవ చేయజాలడు. భగవంతుడు లేదా ప్రకృతి ఎవరిని నీ పరిధిలో ఉంచిందో వారిని సేవించు. మీ తల్లిదండ్రులున్నారు. పిల్లలున్నారు. అన్నదమ్ములున్నారు. బంధువులున్నారు. వారి సేవ చేయండి. అప్పుడు నీవు సత్యమైన భగవంతుని సేవకునివవుతావు. ఇదీ అసలైన సేవ. ఈ వయసులో దీనినే భగవంతుని సేవ అనుకుంటాను. పరమతత్వం అంటే ఏ వస్తువో నాకు ఇప్పుడు అర్థమైంది. నేను కూడా చాలా సేవ చేశాను. అనుభవం, జ్ఞానాలే నామం.

సురత్ శబ్ద దోవు అనుభవ రూపా, తూ తో పడా భరమ్ కే కూపా ।

మనిషి లోపల వీణా నాదాలు మోగటం ప్రారంభిస్తే, ప్రకాశం కనిపిస్తే గురువును అన్వేషించు. ఇదే దాతాదయాల్ జీ మహారాజ్ రాశాడు. అన్వేషణ తరువాత ఏమవుతుంది? నీకు తెలియదు. నా విషయంలో ఏం జరిగింది?

మాలా ఫేరూఁ న హరి భజూఁ, ముఖ్ సే కహూఁ న రామ్ ।
మేరా రామ్ ముఝే జపే, తబ పావూఁ విశ్రామ్ ॥

జపమాల తిప్పను, హరిని భజించను, నోటితో రామా అనను
నా రాముడు నన్ను జపించును, అప్పుడే పొందెద శాంతిని నేను

తరువాత ఆ స్థితి కలుగుతుంది. ఇక అతడు భగవంతుడుగా ఏర్పడడు, బ్రహ్మగానూ ఏర్పడడు. సహజవృత్తి అనబడే స్థితి కలుగుతుంది. ఇక అతనికి ఏమీ చేసే అవసరం మిగిలి ఉండదు.

అందరికీ రాధాస్వామి

పరమసంత్ పరమదయాల్ పండిత్ ఫకీర్ చంద్ మహారాజ్

# సత్సంగం

## సేఠ్ దుర్గా దాస్ గారి ఇంటి నెం. 2, సెక్టర్ 19-ఎ, చండీగఢ్ - తేది. 29-5-1977

రాధాస్వామి! ఈ సంతుల మార్గంలో అన్నిటి ఖండన ఉందని నేను నిన్న మీకు చెప్పాను. నా అనుభవం చెప్పిపోతానని ప్రతిజ్ఞ చేశాను. నేను చేస్తున్నదంతా నా కర్మ వశాన చేస్తున్నాను. ఎవరిపైనా నా బాధ్యత లేదు. శరీరాన్ని వదలివెళ్ళే ముందు బోధనా సరళిని మార్చమని దాతా దయాల్ చెప్పారు. 1905లో ఓ దృశ్యం దర్శన మిచ్చినప్పుడు దాతాదయాలుని రూపాన్నే రాముడుగా విశ్వసించాను. వారానికో ఉత్తరం చొప్పున పదినెలలు పాటు ఉత్తరాలు రాశాను. పది నెలల తరువాత ఆయన జవాబిచ్చారు. "ఫకీర్! నాకు వాస్తవం, సారతత్వం, సత్యం, శాంతి హుజూర్ రాయ్ సాహబ్ సాలిగ్ రామ్ మహారాజ్ ద్వారా సంత్ మతం క్రమంలో పొందాను. ఈ మార్గంలో నడవడానికి నీకు అభ్యంతరం లేకుంటే లాహోర్‌కు వచ్చి నన్ను కలుసుకోవచ్చు" అని రాశారు. ఇవాళ నేను నా కర్మవశాన చెప్పదలచుకుంటున్నాను. ఏమని? నేను ఆ వాస్తవాన్ని, సత్యాన్ని, యథార్థాన్ని ఎలా అర్థం చేసుకున్నాను? నాకు శాంతి ఎలా లభించింది అనేది వివరిస్తాను. మీరు విని, అర్థం చేసుకుని, ఆచరించండి, ఆచరించకపోండి. దీనికి నేను బాధ్యుణ్ణి కాదు. మొదటి వాస్తవం, యథార్థం, సత్యం ఏమిటి? మనం ఎవరం? మనం ఈశ్వరుణ్ణి అన్వేషిస్తాం. కానీ మనమెవరమో మనకు తెలియదు. నేను తల్లి గర్భంలోనుండి వచ్చాను. మీరంతా మీమీ తల్లుల గర్భాల నుండే వచ్చారు. కంటికి కనిపించని చిన్న క్రిమి తండ్రి వీర్యం ద్వారా తల్లి గర్భంలోకి ప్రవేశించి ఆకృతి ధరించి ఇవాళ ఐదారు అడుగుల పొడుగున్న మనిషిలా రూపుదాల్చింది. ఆ క్రిమి మన ఆది. ఆ క్రిమి ఎలా ఏర్పడింది? తండ్రి భుజించిన భోజనం నుండి తయారైంది. అన్నం నుండి రక్తం ఏర్పడింది. తరువాత వీర్యం ఏర్పడింది. ఆ వీర్యంలో ఈ క్రిమి పుట్టింది. రక్తం ఎలా తయారైంది? తండ్రి తిన్న అన్నం వలన రక్తం ఏర్పడింది. అతడు భోజనం స్వీకరించకుంటే రక్తం తయారుకాదు. అన్నం

దేని వలన తయారవుతుంది? చేనులో పండిన పంట వలన! ఆ పంటపై సూర్యుని కిరణాలు, చంద్రుని కిరణాలు, నక్షత్రాల కిరణాలు పడకుంటే ఏ తినే పదార్థమూ తయారుకాదు. పైరు పెరగదు. ధాన్యం పండదు. ఈ వరుస క్రమం పరిశీలిస్తే మన శరీరం యొక్క పుట్టుక, ఆది-ప్రకాశమని తెలుస్తున్నది. ప్రకాశమే అంతిమ స్థితికూడా! ఈ శరీరం యొక్క ఆది ఆ ప్రకాశమే ! అయితే ఇక వాస్తవం ఏమిటి? శారీరిక రూపంలో మనం ఎవరం? మనం ప్రకాశ స్వరూపులం. ఆది గృహానికి వెళ్ళగోరిన మనిషి ఏం చేయాలి? తనను తాను తెలుసుకొనేందుకు మనసును ఏకాగ్రం చేసుకొని తన అంతరంలోకి, ఆ ప్రకాశంలోకి వెళ్ళిపోవాలి. ఎందుకంటే శరీరం ఏర్పడకపూర్వం ఏ ప్రకాశస్వరూపం ఉండెనో దానిలో సుఖం లేదు. దుఃఖం లేదు. అందులో 'నేను' లేదు. 'నీవు' లేదు. అందుకే సంతులు ఆదిగృహానికి చేరడానికి ఏం చెప్పారు? శాస్త్రాలు ఏం చెప్పాయి? గాయత్రి మంత్రం ద్వారా నీ అంతరంలో జ్యోతి స్వరూప దర్శనం చేసుకో! ప్రకాశాన్ని చూడు. సంతుల మార్గం ఇదే. మన శరీరపు ఆది ప్రకాశ స్వరూపమే. మనిషి ప్రకాశంలోకి వెళ్ళినప్పుడు ఆ సమయంలో మనకు ఏ దుఃఖమూ లేదు. మనం ప్రకాశ స్వరూపములమయ్యాక మనకు దుఃఖం కలుగ కూడదు. ప్రకాశ సాధన చేసే మనిషి తనను తాను శారీరిక మానసిక దుఃఖసుఖాల బారి నుండి తప్పించుకోగలుగుతాడు. రక్షించుకో గలుగుతాడు. ఎవరైనా వ్యక్తి ఈ ప్రపంచంలోకి వచ్చాక శారీరిక దుఃఖాలనుండి శాశ్వతంగా రక్షింపబడాలనుకుంటే దానికి చికిత్స ఏమిటి? అతడు తన అంతరంలో ప్రకాశ సాధన చేయాలి. కానీ మనం ఏం చేస్తాం? మనం లోపల గురువుతో మాట్లాడుతుంటాం. మన లోపల రాముడు మాట్లాడతాడు. మనలోపల దేవి సాక్షాత్కరిస్తుంది. ఈ సూక్ష్మదేశపు రంగు రూపులు నీలో ప్రకటమయ్యేవన్నీ మాయ. వీటిలో వాస్తవం లేదు. అభ్యాసం చేసే వారికి చెప్పాలనుకుంటున్నాను. నీవు నీ ఆదిగృహానికి వెళ్ళే ఆలోచనలో అభ్యాసం చేస్తే నీ లోపల ప్రకటమైన రూపంతో మాట్లాడకు. నీవు మాట్లాడే మాటలు తప్పుగానైనా కావచ్చు. సరైనవైనా కావొచ్చు. ఈ మాటలేమిటి? ఎలాంటి విచారాలు, సంస్కారాలు నీ మనోపటలంపై పడి ఉంటే ఆ సంస్కారాలననుసరించి నీ లోపల రూపాలు కనిపిస్తాయి. తన లోపల రాముడు కనిపించాడని కొందరు, కృష్ణుడొచ్చాడని మరికొందరు, మహమ్మద్ వచ్చాడని మరికొందరు, నానక్

సాహబ్ వచ్చాడని ఇంకొందరు, బాబాసావన్ సింగ్ వచ్చాడని ఇంకొందరు, బాబా ఫకీర్ వచ్చాడని మరి కొందరు అంటుంటారు. ఓ మనిషీ! బయటినుండి ఎవరూ రారు. మరి అలా వచ్చిందెవరు? ఏ సంస్కారాలు నీలో చదవటం వలన, వినటం వలన, చూడటం వలన, ప్రారబ్ధ కర్మలననుసరించిపడి ఉన్నాయో అని ఎదుటికి వస్తాయి. వాస్తవం తెలియనందున జనం ఈ భ్రమల వలయంలో చిక్కుబడి పిచ్చివారవుతారు. తప్పుడు మార్గం ఎన్నుకుంటారు. అందుకే పదే పదే చెబుతుంటాను. ఎవరైనా సమర్థుడైన పురుషుని సాన్నిహిత్యంలో ఉండండి. లేకుంటే నష్టపోతారు. వాస్తవం ఏమిటి? మన ఆది, మన శారీరిక, మానసిక ఆకృతి ఎప్పుడు ఏర్పడుతుంది? బాహ్య శక్తి స్థూల పదార్థంలోకి వచ్చినప్పుడు దానిలోపల మనసు, చిత్తం, బుద్ధి, అహంకారం ఉత్పన్న మవుతాయి. సూర్యుని కిరణం నేలను తాకినప్పుడు నేలపై ఉండే బీజాన్ని అంకురింప చేస్తుంది. దానిలోపలనుండి పూవులు, ఆకులు వెలువడుతాయి. ఇలాగే ఎప్పుడైతే ప్రకాశ రూప ఆత్మ మన లోపలికి వస్తే ఎవరెవరి ప్రకృతి ఎలా ఉందో అలాంటి భావ విచారాలు ఆ మనిషిలో పుడతాయి. ఇక సత్యం ఏమిటి? మన శరీరిక మానసిక ఆకృతి యొక్క ఆది ఏమిటి? అదే ప్రకాశం. దీనినే బ్రహ్మ అంటారు. నీ లోపల సూక్ష్మ ప్రకృతి ఉంటుంది. దానికి శక్తి, బలం ఉంటుంది. బయటి సూర్యుని కిరణాలు భూమిపైన పడినప్పుడు బీజంలో ఉన్నది పుష్పిస్తుంది, ఫలిస్తుంది. సరిగ్గా ఇలాగే ఏ ఏ గ్రహాల ప్రభావం, ఏ ఏ తారకల కిరణాల ద్వారా నీ శరీరం ఏర్పడిందో ఆ బలం నీలోపల వ్యాపిస్తుంది. అందులో శక్తి ఉంది, బలం ఉంది. ఆ శక్తిని పెంపొందించేటందుకు ఏం చేయాలి? మనసును ఏకాగ్రం చేయండి. మనసును ఏకాగ్రం చేయగలిగిన మనిషి మనోబలం పెరుగుతుంది. ఇక అతడు ఏది ఆలోచించినా, కోరినా అది అతని మనోబలాన్ననుసరించి పూర్తవుతుంది. ఇది నేనెందుకు చెబుతాను? కొందరు తమ విశ్వాసంతో నా రూపం ఏర్పరచుకుని తమ భావనలననుసరించి నా రూపంతో పనులు సాధించుకుంటారు. కొందరికి నా రూపం ఔషధాలు చెబుతుందట. ఒక వ్యక్తి కొన్నాళ్ళ క్రితం కలిశాడు, "బాబా, నేను ఔషధం వేసుకోను. ఎప్పుడైనా జబ్బుపడితే మిమ్మల్ని తలచుకుంటాను మీరొస్తారు. నాకు ఔషధం చెబుతారు. బజారు నుండి ఆ మందు కొనుక్కుని తీసుకుంటాను. బాగయిపోతుంది" అని చెప్పాడు. నాకా సంగతేమీ తెలియదు.

నేను ఇలా చికిత్స చేయగలిగిన వాడినే అయితే ఈ చండీగఢ్‌లో పి.జి.ఐ. లో చెకప్ చేయించుకోవడానికి ఎందుకు వెళ్తాను? ఈ రహస్యం ఏమిటి? మీరు గృహస్థులు, మీరు అటూ ఇటూ వెళ్ళి వ్యాకులపడకూడదని హృదయంలో మీ పట్ల సత్యమైన సానుభూతిని పెంచుకుని ఉపన్యసిస్తున్నాను. ఈ మతాలు, పంథలు మనకు సత్యాన్ని చెప్పక తమ వలలో చిక్కుబడేసి ఘోరంగా దోచుకున్నాయి. హైదరాబాద్‌లో మీరు నా దర్శనం చేసుకున్నామని రాశారు. నాకా సంగతి తెలియదు. మరి వెళ్ళింది ఎవరు? ఓ వెర్రి మనిషీ! మనను మూర్ఖులుగా చేశారు. హైదరాబాద్‌లో నా దర్శనం చేసుకున్నామని మీరు రాసినప్పుడు నేను సత్యప్రియుడనైనందున "ఏమయ్యా నీవు వెళ్ళావా?" అని ప్రశ్నించుకోవడానికి వివశుడనవుతాను. నేను వెళ్ళలేదు. ఎవరు ప్రకటమయ్యారు? అది నీ ఆత్మయే! మనిషి మేధస్సుపై ఎటువంటి సంస్కారాలు, ఊహలు, భావవిచారాలు పడి ఉంటే సమయం వచ్చినప్పుడు అవి వెలికివస్తాయి. ఈ అజ్ఞానం కారణంగా ఒక చోట మందిరం కట్టబడింది. మరో చోట గురుద్వారా నిర్మించబడింది. మరోచోట ఆశ్రమం, మసీదు, చర్చిలు నిర్మాణమయ్యాయి. ఇదంతా ఏమిటి?

జగ్ మే ఘోర్ అంధేరా భారీ, తన్ మే తమ్ కా భండారా ।
జాగ్రత స్వప్న దోనోఁ దేఖీ, భూల్ భులైయా ధర్ మారా ॥

వాస్తవం ఏమిటి? నీవాలోచించు! ఎప్పుడైనా స్వప్నంలో ఏ స్త్రీకైనా తనను పురుషునిగా అనుకుందా? తనో పురుషుడుగా ఆమెకు అనిపించిందా? ఏ పురుషునికైనా కలలో తను స్త్రీననీ, స్త్రీగా మారానని అనుకుంటాడా? పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కన్నట్లు అనిపించిందా? లేదు. ఎందుకని? ఎందుకంటే ఆ విషయాన్ని గురించిన సంస్కారాలు అతని మేధస్సుపై పడలేదు. నీవు స్వప్నంలో, అభ్యాసంలో నీలోన ముద్రింపబడిన సంస్కారాలనే చూస్తావు. ఏ ముస్లిం లోపలైనా రాముడు సాక్షాత్కరించాడా? ఏ హిందువు అంతరంలోనైనా మహమ్మద్ ప్రకటమయ్యాడా? లేదు! ఎందుకు ప్రకటం కాలేదు? ఎందుకంటే ఆ నమూనా సంస్కారాలు ఇతని మేధస్సుపై పడలేదు. నేనివాళ వాస్తవం, సత్యం, యధార్థం చెప్పిపోతాను. ఓ మానవ జాతీ! ఉన్నదంతా నీ మనసు సంస్కారమే! ఊహలు, భావవిచారాలన్నీ నీ మనసువే? నీ ఊహ భావనలున్నట్లే నీ స్థితి రూపొందింది. నీ

మతి ఎలా మారిందో నీ గతి అలాగే నిర్ధారించబడింది. ఎలా నీవు చేస్తావో అలాగే అనుభవిస్తావు. ఓ మనిషీ ! నీవు నీ భాగ్యానికి, అదృష్టానికి నీవే యజమానివి! నీవే భగవంతునివి. నీవేది ఆలోచించావో పూర్వ జన్మలోనైనా, ఈజన్మలోనైనా అది నీ ఎదుటికి వస్తుంది. మంచి చేస్తే మంచే వస్తుంది. చెడుచేస్తే చెడు వస్తుంది. నిజాయితీ చేస్తే నిజాయితే వస్తుంది. దుర్మార్గం చేస్తే దుర్మార్గమే వస్తుంది. చూడండి! గురువులేం చేశారు? మీలోపల ప్రకటమై మీ పనులు నెరవేరితే, "వినండి వినండి ఇతడేం చెబుతున్నాడో" అని లౌడ్ స్పీకర్ పెట్టి మరీ తమ గొప్పదనం ప్రచారం చేస్తారు. మీ పనులు నెరవేరకుంటే మీ లోపల కాలుని రూపం ప్రకటమైందనీ, అది దయాలుని రూపం కాదనీ చెబుతారు. ఇలాంటి భయానకమైనవీ, జుగుప్సాకరమైనవీ మాటలు చెప్పి ఈ మతాల వారు మన గృహస్థులను దోచుకున్నారు. నా మాటలు ఎవరికైనా తప్పనిపిస్తే ప్రస్తుత మహాత్ములను నా ఎదుటికి వచ్చి ఆ మాటే చెప్పమనండి. సమాధానం చెబుతాను.

తాము ఎవరి అంతరంలోకి వెళ్ళ లేదని, ఎలాంటి సహాయమూ చేయలేదని నా ఎదుట చాలా మంది అంగీకరించారు. సంత్ చరణ్ సింగ్ అంగీకరించాడు. సంత్ కృపాల్ సింగ్ అంగీకరించాడు. నందూభాయీ అంగీకరించాడు. కానీ ప్రజలకెవరూ యిలా విడమరిచి చెప్పలేదు. ఎందుకంటే ప్రజలకు చెబితే అబద్ధపు గౌరవాలు, డబ్బులు రావు. నేను అనామీధామం నుండి ఇది స్పష్టం చేయడానికే అవతరించాను. "ఓ మనిషీ ! వాస్తవం, సత్యం ఇది. నీవు ప్రపంచంలో సుఖంగా ఉండగోరితే నీ ఊహ, భావన, ఆలోచనా విచారాలను సరైన రీతిలో ఉంచుకో. నీ ఊహలో, భావనలో శక్తి ఉంది. ఒక్క చోట విశ్వాసం పెట్టుకో. నన్ను గురువుగా భావించమని నేను చెప్పను. జ్ఞానంపేరే గురునామం. నేను జ్ఞానమిస్తున్నాను. ఏ రూపంలో నీవు విశ్వాసం పెట్టుకుంటే ఆ రూపాన్ని పూర్ణంగా నమ్ముకో. ఆయన సదా నీ దగ్గరే ఉన్నాడనుకో. తన గురువు హోషియార్‌పూర్‌లో ఉంటాడని భావించేవారు తప్పుడు ఊహలో ఉన్నారు. గురువు ఎల్లవేళలా నీ దగ్గరే ఉంటాడు. నీలోనే ఉన్నాడు. నీవు పొరపాటు భ్రమలో ఉన్నావు. ఎదురు దెబ్బలు తింటున్నావు. గురువు నా దగ్గరే ఉన్నాడని దాతా దయాల్ శలవిచ్చేవారు. కానీ నాకు అర్థమయ్యేది కాదు. నేను దాతా దయాల్‌ను రాముడని నమ్మి పూజించేవాణ్ణి. ఆయనకు బంగారు కిరీటం చేయించాను. వెండి హుక్కా చేయించాను. జరీబట్టలు

తయారు చేయించాను. నా విశ్వాసం అలా ఉండేది.' నీవు పొరపడుతున్నావు' అనేవారు ఆయన. ఆయన నాకిలా ఉత్తరం రాశారోసారి!

కాహే బౌరానా హోయ్ ఫకీరువా,
తేరే ఘట్ మే మాల్ ఖజానా, ఖయా దివానా హోయ్ ఫకీర్వా !
జాకో చాహ మే ఖోజత్ డోలే, మన్ మే సమానా హోయ్ ఫకీర్వా ।
తీరథ్ బరత్ సభీ తేరే భీతర్, నహీం కహీం జానా హోయ్ ఫకీర్వా ।
రాధాస్వామీ చరణ్ శరణ్ బలిహారీ, నిత్ గున్ గానా హోయ్ ఫకీర్వా ॥

ఎవరైనా చనిపోతేనో లేక చాలా గొప్ప నష్టం సంభవిస్తేనో "హోయ్" అంటారు. నేనాయన్ని రాముడనుకుని పూజించేవాడిని. ఆయన ఎంతో బాధతో నాకిలా చెప్పేవారు. ఆ ప్రేమను, ఆ అజ్ఞానాన్ని 'హోయ్' అనే శబ్దంలో వ్యక్తం చేశారు. కానీ నా మెదడులోకి వచ్చేది కాదు. తోచేదికాదు. నాకు ఆ జ్ఞానాన్నిచ్చేందుకు ఈ పనిచ్చి, "ఫకీర్! నీకు సత్యమైన సద్గురువు సత్సంగీయుల రూపంలో దొరుకుతాడని" చెప్పారు. ఎవరి లోపల నా రూపం ప్రకటమయిందో, వారికి సాయపడిందో వాళ్ళు నాకు చెప్పినప్పుడు నాకు జ్ఞానోదయమైంది. అప్పుడు నా కళ్ళు తెరుచుకున్నాయి. నేను మీ కళ్ళు తెరిపించాలనుకొంటున్నాను. నేను చేసిందంతా తప్పు చేశాననిపించింది. మీరొచ్చారు. నేను ఏదో ఉద్దేశంతో ఇక్కడికొచ్చాను. ఏ ప్రయోజనము లేకుండా నేనిక్కడికొచ్చానని మీరు అనుకోవద్దు. మందిరానికి ఏమైనా తీసుకువెళ్తాను. ఇది కూడా ఒక ప్రయోజనం.

రెండవది చాలామంది పాత వాళ్ళు నన్ను ప్రేమిస్తుంటారు. ఒకవేళ మీకు సత్యం చెప్పకుంటే నేను దోషినవుతాను. నేను స్పష్టంగా చెబుతున్నాను. మనం మూర్ఖులుగా ఎందుకు చేయబడ్డాం? కొందరు గురువులు వారి ఆశ్రమాలు, ధామాలు నిర్మించుకోవడానికి, తమ గౌరవ ప్రతిష్ఠలను, సిరిసంపదలను కాపాడుకోవడానికి సత్యం చెప్పలేదు. హైదరాబాద్‌లో తను నా దర్శనం చేసుకున్నానని ఎస్.పి. గారు చెప్పారు. కానీ అలా దర్శన మిచ్చింది నేను కాదు. మరెవరి దర్శనాన్ని ఆయన చేసుకున్నారు? తనలోని తనే అయిన తన ఆత్మ దర్శనాన్నే ఎస్.పి. గారు చేసుకున్నారు. ఓ మనిషీ! నీవు భ్రమలలో ఉన్నావు. నీ మనసే శిష్యుడు. నీకు ఈ సంగతి తెలియదు. నాకు కూడా ఒకప్పుడు ఈ సంగతి

తెలిసేది కాదు. గురుచరణాలంటే ఈ బాహ్య పాదాలని భావించే వారిని మూర్ఖులు అనవచ్చు. గురుచరణాలు అంటే ప్రకాశం. నీ లోపలి ప్రకాశం. ఇదే విషయాన్ని హుజూర్ రాయ్ సాలిగ్రామ్ మహారాజ్ స్పష్టంగా 'గురువు శబ్ద స్వరూపం, ఆయన చరణాలే ప్రకాశం' అని రాశారు. మీరు జీవితమంతా ఈ బాహ్య పాదాలను కడుక్కుని తాగుతారు. ఇలా చేసినందున మీకు ఏం లభిస్తుంది? ఇదొక ఆవేశం అంతే! గురువు చరణాలే ప్రకాశం. ప్రకాశమే సనాతన ధర్మ మతం. ప్రపంచం అర్థం చేసుకోదు. నా చరణాలను ఏం చేసుకుంటారు? నేను గురువు అన్వేషణలో బయల్దేరాను. నా లోపల మొదట్లో గురు రూపం కనిపించేది. దాతాదయాల్ నా లోపలికి వచ్చాడనుకునే వాణ్ణి. నేను మీలో ప్రకటమవుతానని - సాక్షాత్కరిస్తానని తెలిశాక, అలా వచ్చింది నేను కాదని నాకు తెలిసిపోయింది గనుక నా లోపల దర్శన మిచ్చిన వారు దాతా దయాల్ కాదని నిర్ధారణ అయింది. మరి నా లోపల సాక్షాత్కరించిన, ప్రకటమైన ఆ గురువు ఎవరు? నా ఆత్మ. భ్రమలలో పడిన ఓ మనిషీ! నేను నీ కోసమే వచ్చాను. నిన్ను ఈ మత సంప్రదాయాలవారు మూర్ఖుణ్ణి చేసి దోచుకున్నారు. నేను నీకు సత్యం చెబుతాను. ఏ గురువును వెదుక్కుంటూ హోషియార్ పూర్, బ్యాస్, ఆగ్రా, హరిద్వార్‌లకు వెళ్తావో అది నీ మనసే! నీవు మరుపులో, భ్రమలలో ఉన్నావు. పారబడుతున్నావు. ఎందుకు పారబడుతున్నావు? నీకు ప్రాపంచిక ఆశలున్నాయి. నీకు ప్రపంచం కావాలి. ప్రపంచంలో నీకు లభిస్తున్నదంతా నీవు చేసుకున్న కర్మ ఫలమే. నేను గురువునైనందున నాపై ఏ పాపం ఉండకూడదు గనుక ఇక్కడికి వస్తుంటాను. నేను మీకు సత్యం చెప్పక, చీకటిలోనే ఉంచితే నేను దోషినవుతాను. ప్రస్తుత గురువులు సత్యం చెప్పరు. వీరు దోషులు. కానీ వాళ్ళు చేస్తున్నది కూడా ఒకందుకు మంచికే అనిపిస్తుంటుంది. మీరు సత్యం కోసం రారు. కొడుకు కోసమో, సోదరుని కోసమో, మనవడి కోసమో, మీ ఆరోగ్యం కోరుకుంటూనో వస్తారు. ప్రపంచంలో మీకు దొరుకుతున్నదంతా కర్మ ఫలితమే అని చెప్పాను. దీని కోసం ధ్యానం చేయమని చెబుతాను. నన్ను ధ్యానించమని అనను. నీ విశ్వాసం ఎవరిపై ఉంటే వారిని ధ్యానించు. ధ్యానం వలన నీ మనోబలం పెరుగుతుంది. ఫలితంగా నీ మనసులోని కోరిక నెరవేరుతుంది. నాకు తెలియని వారు సైతం నన్ను ధ్యానిస్తారు. వారి అంతరంలో నా రూపం ప్రకటమవుతుంది. వారి కోరికలు

నెరవేరుతాయి. కానీ అలా సఫలమైనందున కీర్తిని మాత్రం హిజ్ హోలినెస్ పండిత్ ఫకీర్ చంద్‌కు ఇస్తారు. నా మాటలను ఆలోచించండి! నేను మీ ఇంటి రొట్టెలు తిన్నాను. ప్రకృతి నన్నిలా రూపొందించింది. కానీ నేను సత్య పరుడను. మీరు ఇళ్ళల్లో కుక్కల్ని పెంచుతారు. ఏదైనా ఆపద ఎదురైతే అది మొరుగుతుంది. నీకు సంకేతమిస్తుంది. నిద్రపోనివ్వదు. నాకు కూడా ఇదే పరిస్థితి ఎదురవుతుంది. నేను పని చేస్తాను. ఏదో ఒక ప్రయోజనం కోసం నేనీ పని చేస్తాను. మందిరం నిర్మించాను. మంచిదే! నా హృదయంలో ఒక బాధ, వేదన ఉంది. ఆ బాధ ప్రభావం వలన పని చేస్తాను.

'హమ్ ఆయే ఆయే ఆయే'।

ఎందుకొచ్చాం? మానవ వంశం దుఃఖపూరితమై ఉంది. మీరు మీ మనసు వలయంలోకి వచ్చారు. అజ్ఞానంలో ఉన్నారు. మీకు సత్యం చిరునామా తెలియదు. అందరూ మిమ్మల్ని తమ వెంట తిప్పుకుంటున్నారు. మీకు సత్యాన్ని, వాస్తవాన్ని ఎవరు చెబుతారు? నాలో స్వార్థముంటే అసలు విషయాన్ని తెరచాటున మరుగు పరిచేవాణ్ణి, ఫలితంగా ఇవాళ లక్షల, కోట్ల రూపాయలకు యజమానినై ఉండేవాణ్ణి. నోట్ల కట్టలతో సంచులు నింపుకునే వాణ్ణి. ఇన్నేళ్ళూ మనం అజ్ఞానంలో ఉంచబడ్డాం. మన సంపదలు దోచుకోబడ్డాయి. మన ముక్కులు నేలకేసి రాయించారు. అందుకనే నేనొచ్చాను. దాతా దయాల్ నన్ను పొగిడినంతగా బహుశా లోకంలో ఏ గురువూ తన శిష్యుణ్ణి పొగిడి ఉండడు.

"తూతో ఆయా నర దేహీ మే ధర్ ఫకీర్ కా భేషా
దుఃఖీ జీవ కో అంగ్ లగాకర్ లేజా గురు కే దేశా"

నోటితో నేను చెబుతున్న ఈ మాటలే నేనిచ్చే నామదానం. ప్రత్యేకించి నేను నామదానం ఎందుకివ్వను? నేను రెండు వైపుల నుండీ డిగ్రీ హోల్డర్‌ను. ఒకవైపు నుండి దాతా దయాల్, మరోవైపునుండి బాబా సావన్ సింగ్ జీ మహారాజ్‌ల ఇద్దరి ఆశీర్వాదం ఉంది. ఇతర గురువులవలె ఆరువేల మందికి నామదానమిస్తే నెలకు ఆరు వేల రూపాయలు వస్తాయి. కనీసం ఒక్కొక్క శిష్యుడు నెలకు ఒక రూపాయి నాకు పంపినా అంత మొత్తం వస్తుంది. కానీ నా లక్ష్యం, అభిమతం అది కాదు. నేనసలు నామ దానమే ఇవ్వను. ఎందుకివ్వను? అభ్యాసం చేసేటప్పుడు నీ

మేధస్సులో ఉన్న ఆలోచన సఫలమవుతోంది. ప్రస్తుత కాలంలో ప్రజలు మేధస్సులో మంచి కోరికలు పెంచుకోరు. అందుకే ఎవరికిపడితే వారికి, అడిగిన వారికందరికీ నామదానమివ్వటం నేరం. నామం ఎవరికి ఇవ్వాలి?

విషయోన్ సే జో హోయ్ ఉదాసా పరమారథ్‌కా జామన్ ఆసా
ధన్ సంతాన్ ప్రీతి నహీఁ జాకే భోజత్ ఫిరే సాధు గురు జాగే

ఇలాంటి ఆచరణ కల వారికి నామం ఇవ్వాలి. కబీర్ ననుసరించి "కామ క్రోధ మద, లోభ, విసారో, శీల్, సంతోష్, క్షమా, సత్‌ధారో, చోరీ, యారీ నిందా త్యాగో"॥

ఇవి ఆచరిస్తేనే నీవు నామానికి అర్హుడవవుతావు. ప్రపంచానికి పరమార్థం నామం పొందే అర్హత లేదు. ఈ గురువులు మీకు అసలైన నామం ఇవ్వలేదు. తమ పేరు ప్రతిష్ఠలకోసం తనకు పదివేలమంది శిష్యులో, ఇరవైవేలమంది శిష్యులో ఉన్నారని గొప్పలు చెప్పుకోవడానికి నామమిస్తారు. నీ నడవడి, ప్రవర్తన అపవిత్రంగా, చెడు ఆలోచనలతో నిండి ఉంటే అటువంటి సమయంలో నీవు నామం జపిస్తే అదే నీకు హానికరమవుతుంది. నీ ప్రవర్తన మంచిదై ఉండి, నీకు శుభం జరగాలనే కోరికతో నామం జపిస్తే అది మేలునుకలిగిస్తుంది. కానీ గురువు బోధనలను ఎంతమంది ఆచరిస్తున్నారు? నామం తీసుకోకముందు ఎలాంటి చెడుకర్మలు చేశాడో తరువాత కూడా కుకర్మలు చేస్తుంటాడు. ఇదెంత బాధాకరం? ఆ బాధతో నేను చెబుతున్నాను. "ఓ మహాత్ములారా! నా మాటలు తప్పయితే నన్ను విమర్శించండి లేదా నేను సరైన అంశాలే చెప్పాననుకుంటే ప్రతివారికీ నామదానం ఇవ్వకండి. జీవన రహస్యాన్ని చెప్పండి". మనిషి ఏం ఆలోచిస్తాడు? ఇంట్లో నీవు ఎలా గడపాలి? అందుకే నేను బోధనా సరళిని మార్చాను. మీ మీ ఇళ్ళల్లో శాంతిని నెలకొల్పండి. నీ ఆలోచనలో, ఊహలో, భావనలో చాలా బలముంది. ప్రాపంచికులు నా రూపాన్ని ధ్యానించి తమ తమ పనులు నెరవేర్చుకుంటారు. దీని వలన వారి మనసులో బలం ఉందని రుజువవుతున్నది. నేనైతే వారి అంతరంలోకి వెళ్ళలేదు. అంటే నీ మనసులో శక్తి ఉంది. నీవు నీ మిత్రులతో అన్నదమ్ములతో, బంధువులతో శత్రుత్వం పెంచుకుంటావు. నీ ఊహ, ఆలోచనా విచారాలు తప్పక ప్రభావం చూపుతాయి. వాటి నుండి నీవు

తప్పించుకోలేవు. మీ ఇళ్ళలో పోట్లాటలు జరగటం చూస్తుంటాం. పేర్లు చెబితే మీకు కోపంవస్తుంది. ఇళ్ళల్లో నష్టాలు సంభవిస్తుంటాయి. నేను నా స్వవిషయాలు చెబుతుంటాను. మీ విషయం చెబితే మీకు కోపం వస్తుంది. నా భార్యను చూసి ఎగతాళిగా నవ్వేవాణ్ణి. "భాగవతీ! నీ మనసు పవిత్రంగా లేదు. నీకు ఏదో ఒక కష్టం కలుగుతుంది" అని చెప్పేవాణ్ణి. అవసానదశలో ఆరేడు సంవత్సరాలు మంచంపై పడి ఉంది. మీరు గృహస్థులు. నేను గాయపడ్డ హృదయంతో చెబుతున్నాను. ఏ గురువూ నీ నావను తీరానికి చేర్చడు. నీ ఆలోచన, భావం, ఊహయే నీ నావను తీరానికి చేరుస్తుంది. నా మాటలను విని అర్థంచేసుకుని వల్లెవేయండి. ఆచరించండి. అప్పుడు మీ నావ తీరం చేరుతుంది. మానవతా మందిరంలో రెండుగదులు కట్టించినంత మాత్రాన తరించిపోతామనుకుంటే భ్రమలో ఉన్నట్లే! పొరబడుతున్నట్లే! రూపాయ లివ్వటం వలన తరించిపోయేలా అయితే ఈ పెద్ద పెద్ద షావుకార్లు రూపాయలిచ్చి తరించేవారు. తీరానికి దాటేవారు. ఇది ఆచరణ మార్గం. నేను వచ్చిందే ఇందుకు! నాపైన దాతా దయాల్ చెప్పిన పనిచేయవలసిన బాధ్యత ఉంది. ఆయనన్నారు.

తూ తో ఆయా నర దేహీ మే ధర్ ఫకీర్ కా వేషా ।
దుఃఖీ జీవ కో అంగ్ లగాకర్ లేజా గురు కే దేశా ॥

ఇప్పుడు నేనేం చేయాలి? గురుదేశం అంటే ఏమిటి? గురువుయొక్క దేశమంటే శాంతి. దీని గురించి తరువాత చెబుతాను. వాస్తవం, యథార్థం, సత్యం వెల్లడిస్తున్నాను. ఓ మనిషీ! నీకు నీ ఆలోచనా విచారాల ఫలం లభిస్తుంది. వేరేదీ దొరకదు. గొప్ప గొప్ప మహాత్ముల అవసాన జీవితం అత్యంత ఘోరంగా, దయనీయంగా ఉంది. పల్టూ సాహబ్ ఉండేవారు.

హమ్ వహాఁకే బాసీ, జహాఁ పహుంచే నహి అవినాశి

అనేవారాయన. ఆయన పరిస్థితి ఎలా మారింది? అవతారాలుగానీ, సంతులుకానీ, పీర్ పైగంబరులు కానీ ప్రతి ఒక్కరూ తమ తమ కర్మలు అనుభవించవలసి వస్తుంది. ఎవరూ తప్పించుకోలేరు. నేను బాధాతప్త హృదయంతో సత్సంగమిస్తున్నాను. మీరు సత్యాన్ని వినరు. మోసపు మాటలు చెప్పే వారి దగ్గరికి

వెళ్ళి నెత్తిగొరికింప చేసుకుంటారు. నామం తీసుకోండి. అంత్య సమయంలో గురువు నిన్ను సత్‌లోకానికి తీసుకువెళ్తాడని నమ్మబలికే వారి మాటల ప్రలోభానికి మీరు లొంగి పోయి మోసపోతుంటారు. సత్యమైన విషయం చెబితే వ్యతిరేకిస్తారు. శ్రద్ధచూపరు. గురువు మీకు సత్యమైన జ్ఞానమివ్వాలి. తెలివినివ్వాలి. వివేకమివ్వాలి. ఇక ఇతరత్రా నీకు లభించేదంతా నీ ఆచరణ ఫలితమే! దాతా దయాల్ మహారాజ్ ధామ్ ధ్వంసమైంది. ఆయనలో ఏదైనా శక్తి ఉంటే తన ధామ్‌ను నాశనం కానిచ్చేవాడా? బాబా సావన్‌సింగ్ రోగగ్రస్థుడయ్యాడు. స్వామీ రామకృష్ణ పరమహంస స్థితి ఏమైంది? వారందరిలో ఏదైనా శక్తి ఉంటే తమ తమ వ్యాధుల్ని నయం చేసుకునే వారే కదా!

కర్మ ప్రధాన్ విశ్వకర్ రాఖా - జోజసు కీన్హా సు తస్ ఫల్ చాఖా ।

నీ గురువు ఎంత గొప్పవాడైనా నీవు నీ కర్మ ఫలితం అనుభవించవలసిందే! తప్పించుకోగలుగుతాననుకోవటం మరిచిపో. ప్రతి మనిషి కర్మకూ శిక్ష లభిస్తుంది. కర్మ నుండి తప్పించుకునేందుకు ఓ పద్ధతి ఉంది. దానిని తరువాత చెబుతాను. అయితే సత్యం ఏమిటి? నీవు ఎలాంటి కర్మ చేస్తే అలాంటి ఫలితం లభిస్తుంది. వేద మార్గముంది. శుభసంకల్పమస్తు. మంచి భావాలు, మంచి ఆలోచనా విచారాలు పెట్టుకో. హిందూ ధర్మానికి అతీతంగా వెళ్ళకు. పదాలు-శబ్దాలు నీవి. ఒక మంత్రంలోని అర్థం ఇలా ఉంది. "ఓ ప్రభూ! నేనెవరితోనైనా శత్రుత్వం చేసినా లేదా నాతో ఎవరైనా శత్రుత్వం చేసినా ఆ శత్రు భావనలను దగ్ధం చేసెయ్" అని దాని భావం. కానీ ఈ మంత్రాల్ని చదువుతున్న హిందువులు ఇతరులను ద్వేషించటం లేదా? ఆర్యసమాజం వారికి సనాతనులతో ద్వేషం; రాధాస్వామి మతం వారికి ఇతరులతో ద్వేషం. ఇలా ఇతరులను ద్వేషిస్తూ నీకు శుభం జరగాలని ఆశించటం నేరం. ఈ నేరం నుండి ఎవరూ తప్పించుకోలేరు.

కర్మ గతి టారే నాహిఁ టరే

ఇప్పటి వరకు మీకు సత్యం, వాస్తవం చెప్పాను. ఇప్పుడిక ఈ ప్రపంచాన్ని దాటిపోవడానికి సంతులు ఏం చెబుతున్నారో చూద్దాం. స్మరణ, ధ్యానం, భజనలు చేయమని చెబుతారు. ఇదేమిటి? మన జీవితం శక్తి. బ్యాటరీలో కరెంటు

ఉంటుంది. ఇ.ఎం.ఎఫ్. ఉంటుంది. కరెంట్ చలనంలో ఉంటుంది. ఇ.ఎం.ఎఫ్. తను ఉన్నచోట నిలకడగా ఉంటుంది. మనమందరం ఆ కరెంట్‌లో ఉన్నాం. ఇప్పుడు కరెంట్‌నే జీవితం అంటాన్నేను. ఇ.ఎం.ఎఫ్.ను నీ ఉనికి అంటాను. నీ అస్తిత్వమే సత్ లోకం. అస్తిత్వం. ఈ జీవితంలో నుండి బయటపడి అస్తిత్వం లోనికి వెళ్ళనంత వరకు మనిషి జీవితంలో ఉన్న వైమనస్యము, పెనుగులాట, జంజాటం సదా ఉంటుంది. ఎవరూ తప్పించజాలరు. జీవనం ఉన్నంత వరకు సుఖం ఉంది, దుఃఖం ఉంది. నీవు మంచి ఆలోచనా విచారాలను చేయాలి. ఈ కర్మ చక్రం నుండి బయట పడటం చాలా కష్టం. సంతులు దీని ఉపాయమే వెదికారు. జీవితం నుండి బయటపడి అస్తిత్వంలోకి వెళ్ళిపో! అస్తిత్వంలో ఎప్పుడుంటావు? నీ శరీరం, మనసుల ఆలోచనా విచారాలు రెండింటినీ నీవు విడిచి పెట్టినప్పుడు నీలో నీవుంటావు. అర్థం చేసుకోగల వారే సత్సంగం నుండి లాభాన్ని పొందుతారు. ఇతరులు పొందలేరు. నా సత్సంగం వలన పిల్లలకేం లాభం? మన జీవితాన్ని విడిచి మన అస్తిత్వం, లోనికి వెళ్ళటం అవసరం. అలా వెళ్ళకుంటే ఏమీ లాభం లేదు. ఇవాళ కాకుంటే రేపు వెళ్తావు. కరెంట్‌లోనుండి వెలువడిన ప్రవాహం తిరిగి బ్యాటరీలోకి వెళ్ళినట్లే మనం మన మూల ఉనికిలోకి వెళ్ళాలి. మనం ఎక్కడి నుండి వచ్చామో అక్కడికే తిరిగి వెళ్ళవలసి ఉంటుంది. రెండు జన్మలైనా కానీ, పది జన్మలైనా కానీ ఎవరూ ఆపలేరు. ఇది ప్రకృతి నియమం. మనం ముక్తులం కావలసి ఉంది. ముక్తి మనకు లభిస్తుంది. మనకు జన్మసిద్ధంగా వచ్చిన హక్కు అది. ఎవరి సమయం వస్తే వారు వస్తారు. సమయం తీరగానే వెళ్ళిపోతారు. సంతులదర్బారులోకి వెళ్తే వాళ్ళేం చెబుతారు? స్మరణ చేయండి, ధ్యానం చేయండి, భజన చేయండి అని చెబుతారు. ధ్యానం వలన నీ జీవితం బాగవుతుంది. ఏ రకమైన భావాలతో నీవు ధ్యానం చేస్తే అది నెరవేరుతుంది. నీవు జపిస్తున్న నామం యొక్క అర్థం నీవు తెలుసుకుంటే నీవక్కడికి చేరుకుంటావు. అదెలా? నేను నిమ్మకాయ పేరు చెబుతాను. నీ నోట్లో నీళ్ళొస్తాయి. వస్తాయికదా! కానీ ఏ ఆంగ్లేయుడో నిమ్మకాయ పేరు విన్నా అతని నోట నీరూరదు. ఎందుకంటే ఆ పదం అతనికి అర్థం కాలేదు గనుక. నామం ఇచ్చిన గురువుకు తన శిష్యునికి నామ రహస్యాలను వివరించవలసిన బాధ్యత ఉంది. నామాన్ని ఎవరు జపిస్తారు? ఆ నామం యొక్క స్థితి ఏమిటి? అనే వాస్తవాల్ని గురించి తెలియకపోతే నీవు

లక్షసార్లు నామం జపించినా వృధాయే! ఏమీ దొరకదు. ఎలాగైతే నిమ్మకాయ పదానికి అర్థంబోధపడని ఆంగ్లేయునికి నోరూరనట్లే ఇతని స్థితి కూడా ఉంటుంది. నామం జపించేవారికి దాని అర్థం తెలిసి ఉండాలి. అంతేకాదు. ఈ నామం గురువు ద్వారా దొరకాలి. మీరేం అనుకుంటారు? గురువు నుండి నామం తీసుకుంటే చాలని భావిస్తారు. గురువు దగ్గరకి వెళ్ళి కొన్ని రోజులు సత్సంగం చేయి. వాస్తవాన్ని అర్థం చేసుకో. నీకు లభించిన జ్ఞానం, తెలివితో నామం జపిస్తే పని జరుగుతుంది. ప్రపంచం అజాగ్రత్తగా, నిర్లక్ష్యంతో ఉంది.

**సున్‌తే నహీం హై దునియా గాఫిల్ మేరా కలాం**
**బేదార్ హీ కే కహతా హూం తాబీర్ ఖవాబ్ కీ**

స్మరణ ధ్యానం నీ జీవితాన్ని రూపొందిస్తాయి. ఇందుకు యోగ్యుడైన, సమర్థుడైన, పరిపూర్ణత గల గురువు సత్సంగంలోకి వెళ్ళు. ఎలాంటి ఆలోచనా విచారాలను కలిగి ఉండాలో నీకు ఒక అవగాహన వస్తుంది. నీ జీవితం సఫలమవుతుంది. జీవితంలో అస్తిత్వంలోకి, మూలవస్తువులోకి నీవు వెళ్ళదలచుకుంటే భజన ఉంది. భజన ఏమిటి? నీ లోపల శబ్దాన్ని వినటం, ప్రకాశాన్ని చూడటం. ప్రపంచమంతా ఇదే చెబుతుంది. కానీ అసలైన భజన ఇది కూడా కాదు. ఒక మనిషి జీవితమంతా శబ్దం వింటున్నాడు. అతనికి ఆనందం లభిస్తుంది. కానీ భవసాగరం నుండి దాటిపోజాలడు. నేను మీకు సత్సంగం ఇస్తున్నాను. ఎందుకిస్తున్నాను?

హమ్ ఆయే ఆయే ఆయే హైం ।
తుమ్ కో దుఃఖీ దేఖ్ ఆంఖోంసే, మన్ మే దయా సమాయీ ।
దయా రూప ధర్ ప్రగటే జగ మే, దయా యహాం లే ఆయీ ॥

సూరజ్ దయా కా గగన్ ప్రకాశా, కిరనేం దయా కీ ధారా ।
దయా సింధ్ ఉమగా అవుర్ బాడా, ఉమా భావ బిస్తారా ॥

సుర నర ముని కీ యహ హై రీతీ, లగ్ స్వారథ్ కరే ప్రీతీ ।
హమ్ మే నహీం హై స్వారథ్ కించిత్, లఖ్ లఖ్ కరో ప్రతీతీ ॥

ఉదర్ నిమిత్త్ కరేం సబ్ భేసా, యోగీ జతీ ఉదాసీ ।

మాంగే భీక్ జ్ఞాన్ కీ గమ్ నహీం, తుమ్ ఉన్‌కే విశ్వాసీ ॥

భూల్ భరమ్ తజ్ కర్ సత్ సంగత్, హియే కీ ఆంఖ్ ఖులావో
రాధాస్వామి రూప్ నిరఖ్ కర్ దయా సే కాజ్ బనావో ॥

ఉఫ్‌మంటూ మంత్రమ్మైతే వెయ్యలేను. అలాంటి గారడీ విద్యలు ప్రదర్శించను. అంత్య సమయంలో వచ్చి మిమ్మల్ని తీసుకుపోతానని అబద్ధపు వాగ్దానాలు చేయను. ఆ నామం ఎవరైనా గురువు ఆధీనంలో ఉండాలి. గురువు నామమిచ్చాడని నీవనుకుంటావు. కానీ ఇది సరైనది కాదు. నీకు నామం గురించిన వాస్తవం, సత్యం, యథార్థం చెప్పటం గురువు బాధ్యత. అతడలా చెబితే నీవు నామాన్ని జపిస్తున్నప్పుడు నీ లోపల ఆ స్థితి రావాలి. నీకు నామం గురించిన వాస్తవం తెలియదు. రెండేసి గంటలు నామస్మరణ చేసినా నీకే లాభమూ ఉండదు. అర్థం బోధపడకుంటే ఆ నామమే హానికలిగిస్తుంది. అర్థాన్ని, భావాన్ని అర్థం చేసుకుని నామం జపిస్తే అప్పుడు నీ మేధస్సులో ఏ స్థితిలో ఆ నామం ఉన్నా దాని వికాసం జరుగుతుంది. నామం అర్థం తెలుసుకుని, వాస్తవాన్ని తెలుసుకుని, జపిస్తే ఆ నామం స్థితి నీలో ఉద్భవిస్తుంది. అప్పుడు నీవు తరిస్తావు. ఇది పూర్తిగా నిజం. నేను సత్యాన్ని వెల్లడించాను.

సాధో భజన్ భేద్ హై న్యారా ।

ఎస్పీగారూ! మీరు ఎస్పీ గనుక నా శిష్యుడు కావాలని, అయ్యారని నాకేం సంతోషం లేదు. నాకు శిష్యులు కావాలనే కోరిక లేదు. గురువు కావాలనే ఇచ్ఛా లేదు. నేను గురువును కాను. దాతాదయాల్ వేసిన ఇనుప సంకెల నా మెడలో పడి ఉంది. నేను ఈడ్చబడుతున్నాను. పని సరైన రీతిలో చేస్తున్నానో లేదో తెలియదు. సత్యాన్ని చెప్పి పోతున్నాను. తత్వాన్ని గురించిన భావన, ఆలోచనావిచారం నీలో రానంతవరకు ఆ భవసాగరం నుండి తప్పించుకోలేవు. నాకు తత్వవిచారం కలిగేది కాదు. రాధాస్వామి విశ్వాసపరులారా! పరమాత్ముడు మీకు మేలు చేయుగాక! నా రూపం మీలో ప్రగటమవుతుందని తెలిసినప్పటి నుండి అది నేను కాదు గనుక సత్యాన్ని తెలుసుకోక తప్పలేదు. ప్రగటమవుతున్న రూపాన్ని మనసు తయారు చేస్తుంది. నేను మనసును విడిచి పోతాను. ఇక ఏం మిగిలి ఉంటుంది? ప్రకాశం, శబ్దం. ఇప్పుడు నేనెందుకు తత్వాన్ని గురించి ఆలోచించాను? నేను నా ఆత్మను ప్రశ్నిస్తాను. నా అనుభవం చెప్పిపోతానని

ప్రతిజ్ఞచేశాను. శబ్దంలో ఉండి ప్రకాశాన్ని చూస్తాను. అప్పుడు శబ్దాన్ని విని ప్రకాశాన్ని చూస్తున్న వస్తువేదో దానిని అన్వేషిస్తాను. దాని అంతుదొరకదు.నాలో ప్రకటమైన రూపాలు కల్పితాలేనని రుజువైంది. ఆ కల్పితాన్ని సత్యమని నేను అంగీకరిస్తే నా ప్రాపంచిక పనులు సఫలమవుతాయి. ఒకవేళ ప్రాపంచిక కార్యాలకు అతీతంగా వెళ్ళగోరితే నేను కల్పనల నుండి బయటికి వెళ్ళవలసి వస్తుంది. ఈ మాటే బాబా సావన్ సింగ్ జీ మహారాజ్ చెప్పేవారు. పది తలుపులు దాటండి. ముందర గురువు నిలబడి ఉన్నాడని అనేవారాయన. ఆ తరువాత ప్రకాశం, శబ్దం వున్నాయి. ఇంత ఉన్నత స్థాయిలోకి పైకి వెళ్ళాక నేనేమైనా చేయగలనా అని ఆలోచిస్తుంటాను. నేను కాకపోయినా లోగడ వచ్చిన గురువులు ఏమైనా చేయగలిగారా? ఎలా నమ్మగలను? వారు తమ వ్యాధులను నయం చేసుకోలేకపోయారు. నీ వ్యాధులను బాగుచేయగలరా? వారి ఆశ్రమాల కోసం, గద్దెల కోసం జగడాలవుతున్నాయి. తత్వాన్ని గురించి నేనేం ఆలోచించాను? ఎలాంటి విచారం చేశాను? ఓ దాతా! నేనేం చేస్తున్నానో నాకు తెలియదు. నేనే చేస్తున్నది తప్పయినా నేను దోషిని కాను. మీకు, బాబా సావన్‌సింగ్‌లకే తెలుసు! మీరే అందుకు భాధ్యులు. మీరు నాకీ పనెందుకిచ్చారు? నా జీవనంలో నా అనుభవంలోకి వచ్చిన అంశాలనే చెబుతాను. అక్కడికి చేరాక ఏం కోరినా చేయగలిగేలా నాలో కొంత బలం ఉండాలి. నేను చేయలేను. ఇతర గురువు లెవరైనా చేయగలిగారా? వారూ చేయలేకపోయారు. ఇక మరి నేనెవరిని? నేనొక చైతన్యపు బిందువును. ఒక పరమ తత్వం ఉంది. దీనిని నేటి వరకు ఎవరూ తెలుసుకోలేదు. అదేమిటో తెలియదు. "It is what it is" !

ఏక్ కహూం తో హై నహీం, దో కహూం తో గార్ । జైసా హై తైసా రహే, కహే కబీర్ విచార్ ॥

అన్నారు కబీర్. అదొక పరమతత్వం. అదేమిటి? ఏదికాదు? నాకైతే తెలియదు. పరిణామ క్రమంలో ఎప్పుడాయనకు ఇష్టమైతే అప్పుడు సమాప్తమవుతాను. దీనివలన నాకేం లభించింది? శాంతి! ఇప్పుడిక నాకు అభ్యాసం చేసే కోరిక లేదు. స్వాభావికంగా ఏ పనులు జరుగుతాయో జరుగుతుంటాయి. నేనెవరినో నాకు తెలిసిపోయింది. నేను ఏ తత్వ విచారాన్ని చేశాను? ఓ నా చెల్లెళ్ళారా! తమ్ముళ్లారా! నేను అర్థం చేసుకున్నదంతా తప్పే కావొచ్చు. నాకు దీనిని గురించిన బాధలేదు. దాతా దయాల్ అక్కడికి చేరి ఏమైనా

అయి ఉంటే, ఏదైనా ప్రత్యేకత వచ్చి ఉంటే తన ధామాన్ని నాశనం కానిచ్చేవాడు కాదు గదా! అందుకే నేనే నిర్ధారణ పైకొచ్చాను? బోధనా సరళిని మార్చమన్నాడు దాతా దయాల్. నేను సత్యాన్ని ఇష్టపడే మనిషిని. నేను పొరబడుతున్నాననుకుంటే ఇతర మహాత్ములు నన్ను విమర్శించవచ్చు. నాకే బాధాలేదు. ఏ తత్వాన్ని విచారించాను? ఒక మూల పదార్థం ఉంది. దానితో ప్రపంచం ఏర్పడుతుంది. ఒక సూర్యుడున్నాడు చంద్రుడున్నాడు. ఎన్నో లోకాలున్నాయి. ఆయన లీల ఆయనకే తెలుసు. మనం ఉన్నాం. మనలో ఒక 'నేను' వచ్చేస్తుంది. అదే 'నేను' మనల్ని ఒకసారి తండ్రిని చేస్తుంది. ఒకసారి కొడుకుని చేస్తుంది. ఒకసారి శిష్యుణ్ణి చేస్తుంది. ఒకసారి స్త్రీని చేస్తుంది. ఒకసారి భక్తుణ్ణి చేస్తుంది. నేనేమీ కాలేదు. అయితే నాకిక్కడేం దొరికింది? శాంతి! వాస్తవం, సత్యం, సారతత్వం ఏమిటని సత్సంగం ప్రారంభించాను. నా కర్మవశాన చెబుతున్నాను. నేనేది చెప్పానో, అర్థం చేసుకున్నానో ఇదే సరైనదని వాదించను. వాజ్యం లేదు. దావాలేదు. నాపైన ఒక బాధ్యత, డ్యూటీ ఉండేది. దాతా ఋణం ఉంది. మందిరం నిర్మించి, తద్వారా నాకెంతో సహాయం చేసిన దుర్గాదాస్‌కు మేలు జరగనీ! నేను నా పని చేశాను. సరిగ్గా చేశానో లేదో తెలియదు. నా నడవడి, మనసు పవిత్రంగా ఉంది. దీనిని తత్వవిచారమని అర్థం చేసుకున్నాను.

సాధో భజన్ భేద్ హై న్యారా ।

సమస్త ఆయువు శబ్దం వింటే చాలు తరించి పోతామని లోకులనుకుంటారు. ఒక స్థితి, అనుభవం ఎదురవుతుంది. నేను శబ్దం వింటాను. నా మేధస్సులో రాత్రీ, పగలూ శబ్దం ప్రతిధ్వనిస్తుంటుంది. నేనేమైనా అయ్యానా అని ఆలోచిస్తుంటాను. నా వ్యాధిని నేనే నయం చేసుకోజాలను. ఇక్కడ డాక్టర్ గారి దగ్గర ఔషధాలు తీసుకుంటున్నాను. ఏమయ్యాను నేను? కొందరు సంతులు మోసం చేసి గౌరవ ప్రతిష్ఠలు సంపాదించారు. ఇది వేరే విషయం. నేను గురువునై చూశాను. ఎవరూ వాస్తవాన్ని చెప్పరు.

అందరికీ రాధాస్వామి

# సత్సంగం

## శ్రీ త్రిలోక్ చంద్ గారి

### ఇంటి నంబరు - 4 సెక్టర్ 19-ఎ,

### తేది. 30-5-1977

జీవితం ఏమిటి? మనం ఏం చేస్తుంటాం? ఏ మతం వారి దగ్గరికి వెళ్ళినా వాళ్ళు తమ మతం గొప్పదని, తమ ఇష్టుడు అందరి కంటే అధికుడని చెబుతారు. శివపురాణాన్ని చదవండి. శివుడే సర్వమని అది చెబుతుంది. విష్ణువే సర్వస్వం అని విష్ణుపురాణం చెబుతుంది. గురుమతం వారి దగ్గరికి వెళ్తే గురువే సమస్తం అంటారు. నేను అన్వేషకుణ్ణి. నా అనుభవం చెప్పిపోతానని ప్రతిజ్ఞ చేశాను. నేనేం అర్థం చేసుకున్నాను? శివుడు గొప్పవాడు కాదు. విష్ణువు గొప్ప వాడుకాదు. గురువు గొప్పవాడు కాదు. నీలోని నీవే గొప్పవాడివి. నీవు నీ విశ్వాసంతో, బుద్ధితో దైవంగా ఊహించుకుని, భావించుకుని విష్ణువును పూజిస్తావు. నీవే నీ తెలివితో, బుద్ధితో శివుణ్ణి నమ్ముతావు ఆరాధిస్తావు. నీవే నీ తెలివితో బాబా ఫకీర్‌ను గొప్పవాడని భావిస్తావు. ఇంతకీ వాస్తవం ఏమిటి? పూర్ణ గురువును వెదకుమని రాధాస్వామి మతం చెబుతోంది. పూర్ణగురువును అన్వేషించమని గ్రంథసాహెబ్‌లో రాశారు. మా గురువు గొప్ప అని బ్యాస్ వాళ్ళంటారు. మా గురువే పూర్ణుడని ఆగ్రావాళ్ళంటారు. బాబా ఫకీరే గొప్ప అని నా శిష్యులంటారు. ఇక ఇప్పుడు మనిషి తను ఎటు వెళ్ళాలో నిర్ణయించుకోవటం కష్టం. అతడు ఎవరో ఒకరిని పరిపూర్ణుడని విశ్వసించాక ఇతర గురువుల పట్ల, దేవుళ్ళ పట్ల ఏవగింపు, అయిష్టం పెరుగుతుంది. సంత్ కృపాల్‌సింగ్‌కు, బ్యాస్ వాళ్ళకు పరస్పరం పడేది కాదు. ఇప్పుడు సంత్ కృపాల్ సింగ్ శరీరం త్యజించారు. అతని ఇద్దరు ముగ్గురు వారసులున్నారు. నిజం చెప్పిపోతానని ప్రమాణం చేశాను. గనుక వర్తమాన పరిస్థితులను చెబుతున్నాను. ఎందుకు చెప్పాలనుకుంటున్నాను? నన్ను అందరి కంటే ఉన్నతుడని విశ్వసించేవారు బాబాఫకీర్ తమ పనులను ఫలింపచేశాడనుకుని అందరికంటే నేనే గొప్పవాణ్ణనుకుంటారు. నేనేమీ చేయను గనుక ఈ నిర్ధారణ కొచ్చాను. "ఓ

మనిషీ అందరికంటే గొప్పవాడివీ, అధికుడవూ, నీవే! అందుకే ఏంచేయాలి? ఎవరిపట్ల నీకు విశ్వాసం కుదిరితే వారివలన నీకు లాభం కలుగుతుంది. నేను నిర్భయుడినై చెప్పాలనుకుంటున్నాను. ఏ మహాత్ముడూ, ఏ గురువూ ఎవరికీ ఏమీ ఇవ్వడు. నీకు విశ్వాసం ఉంటే అన్నీ దొరుకుతాయి. లేకుంటే ఏమీ దొరకదు. కొందరికి పూర్వ జన్మల ఫలితాలు లభిస్తాయి. నా కర్మల వలన ఇప్పుడు నాకు కీర్తి లభిస్తోంది. నా గ్రహాలే అలా ఉన్నాయి. నేనెవరికీ మంచి చేయను అయినా అయాచిత కీర్తి లభిస్తున్నది. చాలామంది మంచిపనులు చేసి చేసి అలసిపోతారు. అయినా వారికి చెడ్డపేరు వస్తుంది. నేనేం చేయకపోయినా నాకు మంచి పేరొస్తుంది. నేనే చాలాసార్లు ఆలోచిస్తుంటాను. "ఫకీర్ చంద్! నీవు గురు మతాన్ని నాశనం చేశావు" అని అనుకుంటాను. పూర్ణగురువును ఎందుకు అన్వేషిస్తారు? పూర్ణగురువు దొరికిన వారికి వారి మేధస్సులో గురు, శిష్యుల ఊహ, భావన ఎగిరిపోతుంది. తన శిష్యుని మెదడులో నుండి గురు, శిష్యుల భావాన్ని తొలగించే బాహ్యగురువే పూర్ణగురువు. నేను ఉన్నత స్థాయిలో చెబుతున్నాననీ, మీకు అర్థం కాదనీ నాకు తెలుసు. సామాన్య గృహస్థులైన మీకు ఏం కావాలి? ఏ వస్తువు అవసరమవుతుంది? వాస్తవాన్ని తెలుసుకోవాలనుకుంటే నేనెవరిని? ఎక్కడినుండి వచ్చాను? నా ఆది ఏమిటి? అని తెలుసుకోగోరే వారికే సంత్ మతం. మీరు ప్రపంచాన్నే కోరుకుంటే మీకు సంత్ మతం అనవసరం. అప్పుడు మీకు వేదమార్గం శుభసంకల్పమస్తు అవసరమవుతుంది. మంచి ఆలోచనా విచారాలు పెట్టుకోండి. ఊహపైన, భావనపైనే జీవితం ఆధారపడి ఉంది. ఈ జన్మకంటే ముందు నేనెవరిని అని చాలాసార్లు ఆలోచిస్తుంటాను. "ఫకీర్ చంద్! పూర్వజన్మలో నేను గౌతమ బుద్ధుణ్ణి. నీవు భిక్షువువి" అనేవారు దాతాదయాల్. కానీ దీనికి ఋజువేదీ లేదు. ఆయన అనుభవం బలవత్తరమైనదై ఉండొచ్చు. ఆయన పూర్వజన్మలో గౌతమ బుద్ధుడు కావచ్చు. నాకీ సంగతి తెలియదు. ఇవాళ మీకు ఏంచెప్పాలి? మీకు ఎవరిపట్ల విశ్వాసం ఉంటే వారిని పూర్ణుడని నమ్ముకోండి. నన్ను విశ్వసించుమని నేను చెప్పటం లేదు. ఏ రూపంపై నీకు విశ్వాసం కలిగితే, ఆ రూపాన్ని పరిపూర్ణంగా విశ్వసించు. ఆయనే నీకు అన్నీ ఇచ్చేవాడు. నీ విశ్వాసం దృఢంగా ఉంటే నీ కోరికలన్నీ తీరుతాయి. ఎవరినైనా నమ్మటం వలన జనన మరణాలు ఆగిపోతాయనుకుంటే మాత్రం అది నెరవేరదు. అసాధ్యం. ఎవరి

ఉపాసకులూ జనన మరణాలనుండి తప్పించుకోలేరు. 'నేనెవరిని' అనే జ్ఞానం ఎవరికి లభిస్తే వారే రాకపోకల నుండి తప్పించుకోగలుగుతారు. ఈ జ్ఞానాన్నిచ్చేది మాత్రం బాహ్యం గురువే! మీరు మీమీ గురువులను, కల్పనలను, ఊహలను విడిచి నన్ను పూజించాలని నేననుకోవటం లేదు. అది నా కోరిక కాదు. ఏ రూపమును నీవు నమ్ముతావో దానిని పరిపూర్ణంగా నమ్ముకో. నీ పని జరుగుతుంది. ఒక స్త్రీ ఉంది. ఆమెను ఆమె కొడుకు తల్లి అని భావిస్తాడు. అతని భావం మరొకలా ఉంది. అదే స్త్రీని ఒక వ్యక్తి చెల్లెలనుకుంటాడు. ఆమెతో మాట్లాడేటప్పుడు అతని మనసు స్థితి ఒకలా ఉంటుంది. మరోవ్యక్తి ఆమెను భార్యగా భావిస్తున్నాడు. ఆమెతో మాట్లాడేటప్పుడు అతని మానసిక స్థితి ఇంకోలా ఉంటుంది. ఇంతకీ నేను చెప్పేదేమిటంటే ఓ మనిషీ ! ఉన్నదంతా నీ విశ్వాసమే! నీ నమ్మకమే, నీ శ్రద్ధే! ఇది నా అనుభవం. జనం నన్ను విశ్వసిస్తారు. నా స్వంత పనులు నెరవేరవు, కానీ వారివి నెరవేరుతాయి. లోకులంటారు - "బాబా! నీవు వస్తావు కాని రానని అబద్ధాలు చెబుతావు" అంటారు. నేను నా గురువుపైనా, నా శరీరంపైనా ఒట్టుపెట్టుకుని చెబుతున్నాను. తమ్ములారా! నేను వెళ్ళను. ఇదొక అనుభవమేననేది నిజం. తెలివైన వ్యక్తి పొగనుచూసి తప్పక నిప్పు ఉందని చెప్పినట్లే అలాంటి అనుభవంతో ఏదైనా అంటే అది నిజమవుతుంది. అనుభవమైనంత మాత్రాన నేను భగవంతుణ్ణి కాలేదు కదా! అందుకే ఫకీర్ చంద్ వెంట పడటం అనే దానికి నేను వ్యతిరేకిని. నేను చెప్పేదానిని విశ్వసించండి. నన్ను నేనే ప్రశ్నించుకుంటాను. ఎవరినైనా నమ్మటం వలన ఏమైనా జరుగుతుందా? ఏర్పడుతుందా? అని అవును-కాదు. ఒకవేళ మనిషికి విశ్వాసం ఉంటే అప్పుడు సిద్ధిస్తుంది. కానీ అప్పుడప్పుడు అసఫలత ఎదురవుతుంది. చాలామందిలో నా రూపం ప్రగటమైంది. వాళ్ళు అంతకు ముందు నన్నెరుగరు. 4, 5 సంవత్సరాల తరువాత వాళ్లు నన్ను ప్రత్యక్షంగా చూసినప్పుడు గుర్తించారు. నాతో చెప్పారు. ఉదాహరణకు డాక్టర్ ఐ.సి. శర్మ అమెరికాలో పని చేస్తాడు. నేను అక్కడికి వెళ్లాను. ఆంగ్లంలో, ఫిలాసఫీలో అతనికి పిహెచ్.డి లభించింది. అతనికి పరమార్థం పట్ల ఆసక్తి ఉండేది. వేదాలు, పురాణాలు, సంస్కృతం అతనికి తెలుసు. ప్రార్థన చేసేవాడు. అతని అంతరంలో నా రూపం ప్రకటించింది. నీ పని ఈ జన్మలోనే పూర్తవుతుందని నా రూపం అతనికి చెప్పింది. 1965లో నేను ఢిల్లీలోని బిర్లా మందిరంలో సత్సంగం

ఇస్తున్నాను. అప్పుడు అతడు నా దగ్గరికి వచ్చి చెప్పసాగాడు. "నేను ఫలానా వ్యక్తిని, అమెరికాకు వెళ్తున్నాను. మీరు 1959లో నా అంతరంలో సాక్షాత్కరించారు' ' అని. ఇప్పుడు నేను మళ్ళీచెబుతున్నాను. నేనతని అంతరంలోకి పోలేదు. నాకీ సంగతే తెలియదు. ఈ లీల ఏమిటి? నాకు తెలియదని మాత్రమే చెప్పగలను. గ్వాలియర్‌లో రామస్వరూప్ అనే స్కూలు మాస్టరున్నాడు. అతడు వైద్య వృత్తిని కూడా ప్రాక్టిస్ చేస్తుంటాడు. ఔషధాలిస్తాడు. కాని అతని వద్ద లైసెన్సు లేదు. ఎవరో శ్రీమంతునికి అతను మందులిచ్చాడు. రియాక్షనై రోగి మృత్యువుకు చేరువయ్యాడు. అప్పుడు రామస్వరూప్ చాలా బాధపడ్డాడు. "ఇప్పుడీ శ్రీమంతుడు చనిపోతే నేను ఇరుక్కు పోతాను. నా వద్ద లైసెన్స్‌లేదు" అనుకున్నాడట. మళ్ళీ అతడే చెప్పాడు, "నేను రాముణ్ణి ప్రార్థించాను నన్ను రక్షించమని. ఒక మనిషి నా లోపల సాక్షాత్కరించాడు. ఫలానా మందివ్వు. ఫలానా ఇంజక్షన్ ఇవ్వు, అతను రక్షింపబడతాడు అని చెప్పాడు. నేను వెంటనే 12 గంటల రాత్రి అక్కడికి వెళ్ళాను. రోగికి మందు, ఇంజెక్షన్ ఇచ్చాను. రోగి రక్షింపబడ్డాడు" అన్నాడు. తనకు ఔషధం చెప్పినవారు ఎవరో రామస్వరూప్‌కు తెలియదు. 4, 5 నెలల తరువాత హీరాసింహ అనే వ్యక్తి అతని దగ్గరకి వెళ్ళాడు. ఆయన నా దేదో పుస్తకం అతనికిచ్చాడు. ఆ పుస్తకంలో నా ఫోటో ఉండటం రామస్వరూప్ చూసి "నాకు ఫలానా మందివ్వమని, ఇంజెక్షన్ ఇవ్వమని సూచించింది ఈయనే" అని హీరాసింహతో చెప్పాడు. తరువాత అతడు నేరుగా హూషియార్‌పూర్‌కు వచ్చాడు. నేను నా ఆత్మను ప్రశ్నిస్తాను, "ఫకీర్ చంద్ నువ్వు వెళ్ళావా?" అని "లేదు" ఇంత స్పష్టంగా నేనెందుకు చెబుతున్నాను? ఈ అజ్ఞానంలోనే ఉంచి ఈ వాస్తవాన్ని చెప్పక మన గృహస్థులను ఈ మతాల వారు మూర్ఖుల్ని చేసి దోచుకున్నారు. ప్రాపంచిక ఆశలలో పడిన గృహస్తులకు కొన్ని మంచి మాటలు చెప్పి ధనం దోచుకున్నారు. ముక్కు నేలకేసి రాయించినంత పనిచేశారు. దాతా నన్ను ఆజ్ఞాపిస్తూ "ఫకీర్ చంద్! కాలం మారి పోతుంది. నా వర్ణన శైలి ప్రపంచానికి రుచించదు. నీవు శరీరాన్ని విడవడానికి ముందు బోధనా శైలిని మార్చు" అన్నాడు. "నేను బోధనా పద్ధతిని మార్చాలా?" అని నా ఆత్మను ప్రశ్నిస్తాను. " ఓ మనిషీ! నీవు నీ ఆత్మలో సత్యపరుడివి కా! సత్యపరుడివై ఆర్తిగా పిలువు. రామస్వరూప్ ఆర్తిగా పరమాత్ముణ్ణి ప్రార్థిస్తే ఈశ్వరుడు నా రూపం ధరించి మందులు సూచించాడు. అతడి పని

నెరవేరింది. నీవొక వేళ సర్వాధారుని ఎదుట ఆర్తిగా అర్తనాదం చేస్తే నువ్వు కోరేది లభిస్తుంది. నీ సమస్యను పరిష్కరించే ఏదో ఒక సహాయం లభిస్తుంది. నేను రాముణ్ణి కలుసుకోవడానికి వెళ్ళాను. 24 గంటల పాటు ఏడ్చాను. డాక్టర్లు పిచ్చివాడయ్యాడన్నారు. నా పని నెరవేరే చోటికి సర్వాధారుడు నన్ను చేర్చాడు. నేటి సత్సంగంలో ఉదాహరణలిచ్చి సత్యవంతుడివి, నిజాయితీ గలవాడవి కావాలనే విషయం చెప్పాలనుకుంటున్నాను. ఫకీర్ చంద్ ఎదుట చేయి చాచే బదులు, ఏ మందిరానికో వెళ్ళి ప్రార్థించేబదులు నీ అంతరంలో కూర్చో. నీ విశ్వాసానుసారం ఆ సర్వేశ్వరుని ధ్యానం చేయి. ఆయనకే రూపమూ లేదు. అన్ని రూపాలూ ఆయనవే! నీవు సత్యపరుడవై ప్రార్థిస్తే, పిలిస్తే ఆయనకృపా దృష్టి నీపై ప్రసరిస్తుంది. నీ పనికి ఏదో ఒక మార్గం, ఉపాయం లభిస్తుంది. మీరు నన్ను పొగడుతారు. నన్నెవరైనా పొగడి సత్య జ్ఞాన దాతనని, సత్యాన్నే చెబుతానని అంటే దానిని నేను ఖండిస్తాను. ఇతరులలోపల సాక్షాత్కరిస్తానని, ఔషధాలు చెబుతానని, అమెరికాలో ప్రకటమవుతానని అంటే అదీ తప్పే. నేను అబద్ధాల కీర్తిని పొందడానికి సిద్ధంగా లేను. నేనెందుకు తప్పుడు మార్గంలో గౌరవాలు పొందాలి? మీరొచ్చారు. నేను ఆచరించిన జీవిత పాఠం మీకు నేర్పుతాను: అదేమిటి? ఉదయమే లేవండి. ఒకచోట కూర్చోండి. మీకు ఎవరిపై విశ్వాసం ఉంటే వారిని ధ్యానించండి. నీవు హిందువువైనా, ముసల్మానువైనా సత్యమైన కోరిక కోరుకో. అడుగు లభిస్తుంది. ప్రకృతి ఏదో ఒక ఏర్పాటు చేస్తుంది. నీ కోరిక సాఫల్యమవుతుంది. మరో విషయం! మన జీవితం ఉంది. ఎందరో మనుషులున్నారు. కొందరు కీర్తనను, మరి కొందరు స్మరణను, ఇంకొందరు తమ లోపల ప్రకాశాన్ని సందర్శించే ప్రయత్నం చేస్తారు. ఎందుకిలా? మనిషి జీవితం ఎక్కడినుండో ప్రారంభమై మరెక్కడికో చేరుకుంటుంది. మనం ఎక్కడి నుండి వచ్చాం? మన లోపల మొదట అభిప్రాయాలు పుడతాయి. మనం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు కథలు చదువుతాం. వాటి ప్రభావం మెదడుపై పడుతుంది. మనం అలా చేయాలని ప్రయత్నిస్తాం. నాయనమ్మలు, అమ్మమ్మలు కథలు చెబుతుంటే పిల్లలు ఆసక్తిగా వింటారు. చాలామంది ఆవేశంతో పాడతారు. దీనికి మూలమేది? కథ! కథ వలన మనకొక అంచనా లభిస్తుంది. బయటినుంచి కొంత పనిచేయడానికి ఊహ లభిస్తుంది. ఇక మనం ఆ కోరికతో పాడతాం. అది కీర్తన. స్మరణ చేస్తాం. స్మరణ అంటే తలచుకోవటం. స్త్రీలున్నారు. భర్తపేరు పదే

పదే ఉచ్చరిస్తారా? లేదు. ఎల్లవేళలా అతని ఫోటోను ఎదుట పెట్టుకుంటారా? లేదు. కానీ ఆమె మనసులో అతని పేరు, రూపం జ్ఞాపకం ఉంటుంది. ఆ జ్ఞాపకమే స్మరణ. అదే విధంగా ప్రకాశం ఉంది. శబ్దం ఉంది. స్మరణ ఉంది. ధ్యానం ఉంది. భజన ఉంది. ఈ భజన తరువాత శబ్దం, ప్రకాశం విన్న తరువాత మరొక స్థితి ఉంది. మన ఆత్మకు శబ్దం వినాలనే కోరిక, ప్రకాశాన్ని చూడాలనే కోరిక ఉండదు. కర్మచేయాలనే కోరిక ఉండదు. వారి జీవిత స్థితి ఎలా అవుతుందంటే -

జల్ మే కమల్ నరాలమ్, ముర్గావీ నిశానీయే ।
సురత్ శబ్ద భవసాగర్, తరియే, నానక్ నామ బఖానీయే ॥

ప్రతి మనిషి సోపానాలు వేరు వేరుగా ఉంటాయి. నేను చాలా పైకి వెళ్ళి పోయాను. చిన్న తరగతుల వారికి పాఠం చెప్పలేను. ప్రొఫెసర్లుంటారు. ఎం.ఏ. విద్యార్థులకైతే సులభంగా పాఠాలు చెప్పగలరు. ఇంట్లో తమ పిల్లలు 1, 2 తరగతులవారికి ట్యూషన్లు పెడతారు. నా స్థితి సరిగ్గా అలాగే ఉంది. నాకు ఈ సంత్ మతం పెద్ద సమస్యగా ఉండేది.

"కృష్ణ కో కర్తా కైసే కహియే వహ తో కామ్ కా కీడా" ।

అనే పంక్తిని చదివి ఓ బ్రాహ్మణుడు సహించగలడా? వశిష్ఠుడు మరిచాడు. పరాశరుడు మరిచాడు అనే సంత్ వాణిని చదివాను. మిత్రులారా నేను అర్థం చేసుకున్నది తప్పేకావచ్చు. ఆ విషయాన్ని గురించి దావాలేదు. నేను సేవకుణ్ణి.

"అన్ ఘడియా దేవా, కోన్ కరే తేరీ సేవా"

నేను బ్రాహ్మణుల ఇంట్లో జన్మించాను. ఈశ్వరుడు ప్రకృతి నన్నెక్కడికి తీసుకువెళ్ళారు? నేనేద్చేవాణ్ణి. నేను రాముణ్ణి కలిసేందుకు బయల్దేరాను. ఎక్కడ చిక్కుకున్నాను? ఏ బ్రాహ్మణుడైనా ఇలాంటి వాక్కుల్ని విని తనను తాను అదుపు చేసుకోగలడా? కబీర్‌నూ, సంతులనూ తిట్టకుండా ఊరుకుంటాడా? కానీ కబీర్, సంతులు నిజమే చెప్పారు. ఇదినా అనుభవంతో చెబుతున్నాను, ఈ నిజం నాకు ఎలా తెలిసింది? దాతా దయాలుని వలన జ్ఞానం లభించలేదు. ఆయన నుండి ప్రేమ లభించింది. ఉత్సాహం లభించింది. కానీ రహస్యం లభించలేదు. నా

రూపం మీలో సాక్షాత్కరించింది. అది నేను కాదు. దీనిని బట్టి వాస్తవం అంతుపట్టింది. గురువును పూజించేవారు తమ మనసును పూజిస్తారు. శివుణ్ణి పూజించేవారు తమ మనసును పూజిస్తారు. గొప్పదనం ఎవరిది? నీ మనసుది! నా కళ్ళు తెరుచుకున్నాయి. వేలాది మంది ధ్యానం చేస్తున్నారు. నన్నెవరు ధ్యానం చేస్తున్నారో నాకు తెలియదు. నా రూపాన్ని ఏర్పర్చుకుని పనులు నెరవేర్చుకుంటారు. ఈ సత్యాన్ని మొట్టమొదట ఢంకా వాయించి మరీ చెప్పింది నేనే!

ఎందుకు? నాపై బాధ్యత ఉంది. "తేరా రూప్ హై అద్భుత్ అచరజ్ తేరీ ఉత్తమ దేహీ జగ్ కళ్యాణ జగత్ మే ఆయా పరమ దయాల సనేహీ " నా గురువు ఈ శబ్దం రాశాడు. పాకిస్తాన్‌లో ఏం జరిగింది? ముస్లింలు "యా అలీ" అంటూ హిందువుల తలలు నరికారు. జైబజరంగబలీ అంటూ హిందువులు, సిక్కులు సత్ శ్రీ అకాల్ అంటూ ముస్లిముల తలలు నరికారు. ఈ స్థితిని దూరం చేయడానికే సంత్ మతం ప్రపంచంలోకి వచ్చింది. కానీ ఈ గురువులు సత్యాన్ని లోకానికి చెప్పకుండా సంత్‌మత రహస్యాన్ని దాచారు. ఒకరు బ్యాస్ వారు, ఒకరు ఆగ్రా వారు, కొందరు హోషియార్‌పూర్ వారు అయ్యారు. వీళ్ళేం చేశారు? సంత్ మతం అసలైన శిక్షణ, బోధ వీళ్ళివ్వలేదు. మనను మూర్ఖుల్ని చేసి మన ఆస్తులు తీసుకున్నారు. తమ పుత్రులకు, పౌత్రులకు ఆశ్రమాలు, గద్దెలు అప్పగించిపోయారు. అందుకే నేనీ ప్రపంచంలోకి అనామీ ధామం నుండి వచ్చాను. నేనేకాదు మీరంతా అనామీ ధామం నుండే వచ్చారు. నాకు తెలిసింది. మీకు తెలియలేదు. నేను మీకు చిరునామా ఇస్తాను. ఎలా వచ్చారో చెబుతాను. నాకీ చిరునామా మీ నుండే తెలిసింది. నేనెవరిలోకీ వెళ్ళలేదనే ఒకే ఒక్క నిజం నా జీవిత దశనే మార్చింది. చివరి సోపానం ఏమిటి? నా లోపల ప్రగటమైనదంతా కల్పితం, మాయ కల్పన. నేను అంతరంలో ఎక్కడికి వెళ్తాను? రంగురూపులు వదిలిపోతాను. పదవ ద్వారం దాటండి సద్గురువు అందుకుంటాడని బాబాసావన్ సింగ్ అనేవారు. ఆయన్ని ఎవరు అర్థం చేసుకున్నారు? పదవ ద్వారం దాటగానే గడ్డం ఉన్న సావన్ సింగ్ లేక ఫకీర్ చంద్ అక్కడ నీ కోసం నిల్చుని ఉంటారని నీ వనుకుంటే పొరపాటు. బయటి నుండి ఎవరూ రారు. సార జ్ఞానం యొక్క పేరు సద్గురువు. నేను చెబుతున్న స్థాయికి మీరు చేరుకోలేరు. మీ మనసులో చాలా శక్తి ఉంది. మీరు ఎలాంటి జీవనం ఏర్పర్చుకోవాలనుకుంటారో అలాంటి కాంక్ష పెంచుకోండి.

అందరూ పరమార్థానికి అర్హులు కారు. విషయాన్ని అర్థం చేసుకొనండి. రాముణ్ణి పూజించేవారికి అదే దొరుకుతుంది. కృష్ణుణ్ణి పూజించే వారికీ అదే దొరుకుతుంది. నన్ను పూజించేవారికీ అదే దొరుకుతుంది. అంతా విశ్వాసపు లీల! ఆట తప్ప ఇంకేం కాదు. చివరి సోపానం నుండి చెప్పాలని పిస్తుంటుంది. కానీ వినేవారెవరు? చివరి సోపానంలో ఏం ఉంది? నేను అంతరంలోకి వెళ్తాను. అక్కడ ప్రకాశం ఉంది. శబ్దం ఉంది. ప్రకాశాన్ని చూసే, శబ్దాన్ని వినే వస్తువును అన్వేషిస్తాను. ఆ స్థితిలోకి వెళ్ళినప్పుడు నా మేధస్సులో ఏమీ ఉండదు. సృష్టి ఉండదు. సృష్టి కర్త ఉండడు. రాముడు లేడు. రహీం లేడు. ఈ మాటే స్వామీజీ తన వాణిలో చెప్పాడు.

"జేర్ మహీనా జేతా భారీ, జీవన్ హిరదే తపన్ కరారీ ।
సంత్ దయాల్ జీవ హితకారీ, భేద్ కహే అబ నిజకర్ భారీ ॥
నహిఁ ఖాలిక్ మఖలూక్ న ఖిల్‌కత్, కర్తా కారన్ కాజ్ న దిక్కత్ ।
దృష్టా దృష్టి నహిఁ కుచ్ దరసత్, వాచ లక్ష్ నహిఁ పద్ న పదారథ్ ॥
జాత్ సిఫాత్ న అవ్వల్ ఆఖిర్, గుప్త న పరగట్ బాతిన్ జాహిర్ ।
రామ రహీమ్ కరీమ్ న కేశవ్, కుఛ్ నహి కుఛ్ నహి కుఛ్ నహి థా సో ॥

సంత్ ఏం చెబుతాడు? సంత్ ఉఫ్ మని మంత్రం ఊది పిల్లల్నిస్తాడను కుంటున్నావా? రోగాలు దూరం చేస్తాడనుకుంటున్నావా? సంత్‌కు ఆ శక్తి ఉంటే తన రోగాన్ని నయం చేసుకోడా? ఇవాళ నాకు ఆరోగ్యం బాగా లేదు. డాక్టర్ను పిలిపించి మందు తీసుకున్నాను. నాలో శక్తి ఉంటే నా అనారోగ్యాన్ని సరిచేసుకోనా? ఆటంతా నీ విశ్వాసానిదే! ఈ గురువుల దోపిడీకి నీవు గురికావద్దు. నీవు నీ పిల్లల కడుపుగొట్టి గురువులకు గదులు కట్టిస్తావు! నీ తెలివి దెబ్బతిన్నది. మిమ్మల్ని పరదాలో పెట్టి గురువులు దోచుకుంటారు. అందుకే నేను పనిచేస్తున్నాను. నా వంటి పిచ్చివారికి సత్యాన్ని చెప్పటమే నా లక్ష్యం. నేను దోచుకోబడ్డాను. 1905లో ఒక దృశ్యం ద్వారా దాతా దగ్గరకి వెళ్ళాను. ఎంగిలి తిన్నాను. ఆరతులు చేశాను. పన్నెండు సంవత్సరాలు సంపాదించింది అక్కడికి పంపాను. కానీ శాంతి దొరకలేదు. సత్యమైన సద్గురువు నాకు సత్సంగి రూపంలో దర్శన మిస్తాడని దాతా చెప్పాడు. మీ కారణంగా నా కళ్ళు తెరుచుకున్నాయి. రహస్యం అర్థమైంది. సంత్ మతాన్ని

నేను అర్థం చేసుకున్నది వాస్తవం. గురువు రహస్యం ఇస్తాడు. ఇంకేదైనా ఇస్తాడనుకుంటే పొరపాటే. సత్యం చెప్పకుంటే ఆ గురువు దోషి. వారి పిల్లలు దుష్టులు, నీచులు అయ్యారు. ఇలాంటి స్థితిలో వారు మీకేం చెప్పగలరు? మిమ్మల్నేం సరిచేయగలరు? నేను స్పష్టంగా చెబుతున్నాను. ఇష్టమైన వారు రండి. లేకుంటే లేదు. ఇష్టమైన వారు నా పుస్తకాలు చదవండి. లేకుంటే లేదు. నేను గుత్తేదారునై రాలేదు. నాపై ఒక బాధ్యత ఉంది. శరీరాన్ని త్యజించే ముందు బోధనాశైలి మార్చమని దాతా దయాల్ చెప్పారు. నా అనుభవాలు చెబుతాను. సిద్ధిశక్తులున్నాయి. లేవని నేననను. భావంలో, ఆలోచనలో చాలా శక్తి ఉంది. మీరు ఆలోచన, భావంతో ఉండి ఏదైనా అంటే అది నెరవేరుతుంది. ఇది స్వాభావిక విషయం. కానీ ఈ సిద్ధి శక్తి చేసే వారు తీరం చేర్చజాలరు. సాయిబాబా స్వయంగా అంగీకరించాడు. నేనాలోకానికి వెళ్ళే సమయం ఇంకా రాలేదన్నాడాయన. నేను సిద్ధిశక్తి ప్రదర్శించడానికి ఈ లోకంలోకి రాలేదు. నా దగ్గర సిద్ధి శక్తులు వాటికవే పనిచేస్తాయి. నాకేమీ తెలియదు. నేను వేటినీ లక్ష్య పెట్టను. నేనిక్కడికి వచ్చినప్పుడు నేను కొంచెం చెప్పాలను కుంటున్నానని మాస్టర్ మోహన్ లాల్ తో అన్నాను. మీరు ఇల్లువదిలి ఈ సాధువుల వెంట తిరుగుతారు. ఈ సాధువుల దగ్గరేం ఉంది? అందుకే స్త్రీలకు గురువులుగా స్త్రీలనే నియమిస్తాను. ఆమె దోచుకోదలిస్తే నీ డబ్బును దోచుకుంటుంది గానీ నీ శీలాన్ని కాదుగదా! ఇవాళ రేపటి గురుయిజం మోసం. నా పరిశీలన తప్పుకాదు. ఒక సారి నేను హోషియార్‌పూర్‌లో ఉన్నప్పుడు ఒక వ్యక్తి, అతని భార్య నా దగ్గరికి వచ్చారు.

"ఏం సంగతి" అని అడిగాను.

"నా భార్యను ఒక భూతం వేధిస్తున్నది. బ్యాస్‌కు వెళ్తే మీ దగ్గరికి వెళ్ళమని ఎవరో చెప్పారు. అందుకే వచ్చాం" అన్నాడు ఆ వ్యక్తి.

"మీరు నా గురించి ఏం అనుకుని వచ్చారు?" అని అడిగాడు.

"సంత్ అని వచ్చాం మహారాజ్" అన్నాడతడు.

"నా ఎదుట అబద్ధం చెప్పవుగదా" అన్నాను.

"చెప్పను మహారాజ్" అన్నాడు.

"నీవు నపుంసకుడివి కావా? అన్నాను.

"అవును" అన్నాడతడు.

"పెళ్ళి చేసుకుని ఎన్నేళ్ళయింది?"

"ఏడేళ్ళు"

"అక్కడొకసాధువు వస్తుంటాడు గదూ! అతడు ఈ స్త్రీలకు సత్సంగం వినిపిస్తుంటాడు. గదిలో "చెవులలో వేళ్ళు పెట్టుకుని కూర్చోండి" అని వీరిని కూర్చోబెడతాడు గదూ అన్నాను".

"వస్తుంటాడు మహారాజ్" అన్నాడు.

"అతడు నీ శీలం దోచాడు గదమ్మా! నిజం చెప్పు" అని అతని భార్యనడిగాను. వణికి పోయిందామె. నేనిలాంటి సంఘటనలను విన్నాను. అందుకే నేను బోధనా పద్ధతిని మారుస్తున్నాను. ఏ స్త్రీ కూడా పురుషుడైన గురువు కాళ్ళను తాకరాదు. నేను మీకు చెప్పాను. సత్యం గురువులో లేదు. నీలో ఉంది. నీలో శ్రద్ధ ఉంటే, విశ్వాసం ఉంటే, నీలో నమ్మకం ఉంటే, నీలో ప్రేమ ఉంటే నీ పని నెరవేరుతుంది. ఒకవేళ నీలో అవి లేకుంటే ఫలితం కూడా ఏమీ ఉండదు. మీకు విశ్వాసం కలగాలి. మరొక విషయం చెబుతాను. నా దగ్గరకు మేజర్ జనరల్ జయసింహ వచ్చాడు. సత్సంగం విన్నాడు. చాలా ప్రభావితుడయ్యాడు. నన్ను గురువును చేసుకోవాలని పదిరూపాయలు, మిఠాయి, పువ్వులు తీసుకుని మందిరంలోకి వచ్చాడు. నేను మంచంపైన కూర్చుని ఉన్నాను. ఎంతో ప్రేమ, శ్రద్ధతో నా ఎదుటకు వచ్చాడు. నేను లేచి అతన్ని కౌగలించుకున్నాను. "నేనెవరికీ గురువును కాలేను. నేను నీ సోదరుణ్ణి. సోదర సంబంధంతో నాకు చేతనైన సహాయం మీకు చేస్తాను" అన్నాను. అతడేం చేశాడు? నా ఇంటికి వెళ్ళి ఇల్లు శుభ్రం చేయించాడు. ఇంటికి సున్నం వేయించాడు. రెండు కంబళ్ళు తెచ్చాడు. నేను ఆశ్చర్యపోయాను. మర్నాడు ప్రతివారం జరిగే సాప్తాహిక సత్సంగం జరిగింది. "ఇంతపెద్దమనిషి నా ఇల్లు శుభ్రం చేశాడు. ఇతనికి ఏం లభించింది? ఎందుకు నా సేవ చేస్తున్నాడు?" అన్నాను. అతడు ఎదుటికి వచ్చి యిలా చెప్పసాగాడు. "నేను వచ్చినప్పుడు బాబాజీ నన్ను కౌగిలించుకున్నాడు. ఏడురోజుల వరకు నాలోపల ప్రకాశం, శబ్దం

ప్రతిధ్వనించ సాగాయి. ఈయన చాలా గొప్ప మహాత్ముడు. అందుకే ఈయనను సేవిస్తున్నాను" అన్నాడు. నేను నవ్వేశాను. "తమ్ముడూ! జయసింహా! నేను నాభార్యను ఎన్నో సార్లు కౌగిలించుకున్నాను. ఆమె సురత్ పైకి వెళ్ళలేదు. నీది ఎలా పైకి వెళ్ళింది?" అన్నాను. ఇదేమిటి? ఇదతని విశ్వాసం. మీ లాగా ఆయన నా సత్సంగాన్ని నమ్మాడు. అంగీకరించాడు. అతడు నమ్మిన కారణంగా అన్నీ లభించాయి. నేనెవరిని ఇవ్వడానికి? నేనిచ్చే దాన్ని తీసుకోవడానికి ప్రపంచం సిద్ధంగా లేదు. నేనేం ఇస్తాను? జ్ఞానం! రహస్యమిస్తాను.

జేఠ్ మహీనా, జేఠా భారీ, జీవన్ హృదయ తపన్ కరారీ ॥

జీవుల లోపల ఏదో వస్తువు యొక్క కోరిక ఉంటుంది. వాళ్ళు కోరతారు. కానీ వారికి తెలియదు తామేంకోరుతున్నారో. మనసు ఏదో కోరుతుంది. దానికి జవాబిస్తారు. ఏమిటి?

జేఠ్ మహీనా జేఠా భారీ, జీవన్ హృదయ తపన్ కరారీ॥

మీ వలన నాకీ విషయం బోధపడింది. మీరు నా సత్యమైన సద్గురువులు. నేను ఫకీర్‌ను. సత్యం చెబుతాను. నా మాటలను అర్థం చేసుకుని సాధన చేస్తే తరించిపోతావు లేకుంటే మునిగిపోతావు. ఈ విషయం నాకు ఎలా అర్థమైంది? నాకెవరు చెప్పారు? నేనెవరి అంతరంలోకీ వెళ్ళననే ఒక్క నిజం! ఏ వస్తువు ప్రకాశాన్ని చూస్తుందో, శబ్దాన్నివింటుందో దానిని అన్వేషిస్తుంటాను. ఆ స్థితి ఇలా ఉంది. సృష్టిని గురించిన ఊహలేదు, సృష్టికర్తను గురించిన ఆలోచన, జ్ఞాపకం లేదు. గురువు లేడు. అక్కడ శిష్యుడు లేడు. నన్ను మీరు తరింప చేశారు. నేను హోషియార్‌పూర్‌లో సత్సంగమిస్తున్నాను. ఒక వ్యక్తి వచ్చి నన్ను కౌగిలించుకుని ఏడవసాగాడు.

"ఏమిటి విషయం" అని అడిగాను.

"బాబాజీ! నేను నామదానం తీసుకున్నాను. అభ్యాసం చేసేవాణ్ణి. నా అంతరంలోకి వెళ్ళాను. చాలా పెద్ద చెరువు చూశాను. అక్కడ చంద్రుడు మెరుస్తున్నాడు. పెద్దపెద్ద పువ్వులున్నాయి. అక్కడొక మహాత్ముడు నిల్చుని ఉన్నాడు. నేనాయన పాదాలకు మొక్కాను. "రక్షింపబడాలనుకుంటే నా దగ్గరకి

రా" అన్నాడా మహాత్ముడు. ఆ మహాత్ముణ్ణి వెదుక్కుంటూ చాలా చోట్లకు వెళ్ళాను. ఇక్కడ మీ సత్సంగం జరుగుతుందని ఎవరో చెబితే వచ్చాను. నా అంతరాన సాక్షాత్కరించిన మహాత్ముడు మీరే!" అన్నాడు. నేను బ్రాహ్మణుణ్ణి. ఇప్పుడు జన్మ వచ్చింది. తర్వాతేం జరుగుతుందో తెలియదు. ప్రపంచానికి అబద్ధం ఎందుకు చెప్పాలి? నేనైతే ఆ వ్యక్తి అంతరంలోకి వెళ్ళలేదు. ఇలాంటి సంఘటనలే నా కళ్ళు తెరిపించాయి. ఇప్పుడు నేను ఆ గమ్యస్థానానికి చేరాను. నా ఆది ఏమిటి? నేను చెప్పేదే నా ఆది. శబ్దాన్ని వినేది, ప్రకాశాన్ని చూసేది ఎవరు? అది నా ఆది. నాదే కాదు. మీ అందరి మూలం, ప్రారంభం అదే! మనం అక్కడి నుండి వచ్చాం. మనం అక్కడికే వెళ్ళవలసి ఉంది. ఇదే రహస్యం. మన ఆది గృహం అదే! ఈ ఇల్లు మనది కాదు. కొందరు పది సంవత్సరాలకోసం, మరికొందరు యాభై సంవత్సరాలకోసం వచ్చారు. కానీ జనం ఏం చేస్తారు? మనం ఈ ప్రపంచాన్ని సత్యమని భావించాం. మా అమ్మాయి వివాహం కాలేదు, ఇది కాలేదు, అది కాలేదు అని వ్యాకుల పడుతుంటాం. ఇది నాలుగు రోజుల ఆట. ఎలా ఎలా నీవు కర్మలు చేశావో అలా అలా ఫలితాన్ని పొందుతావు. కానీ మనకు వీటినుండి విముక్తి లభించదు. నా దగ్గరికి పరమార్థం కోసం వచ్చే వారెందరు? అందరూ ప్రపంచం కోసం వస్తారు. నాకు పూర్వజన్మల లోనిది యశస్సు లభించవలసి ఉంది. నా యీ జన్మల కర్మల ఫలంవలన ఈ యశస్సు లభించటంలేదు. ఇది పూర్వజన్మల కర్మల ఫలితమే! దాని యశస్సు తీసుకుంటున్నాను. మన ఆది అదే! మనం ఈ ప్రపంచపు వలయంలోకి వచ్చాం. ఈ వలయంలోనుండి, సుడిగుండంలో నుండి బయట పడాలని కోరే వారి కోసమే సంతుల మార్గం. ఇక్కడ కూర్చున్న మీరంతా ఆ వలయంలో నుండి, సుడిగుండంలో నుండి బయట పడడానికే వచ్చారా? లేదు. అందుకే బయటపడమని ఎక్కువ లెక్చరివ్వటం వ్యర్థం. మీకు ప్రపంచం విషయం చెబుతాను. ఈ లోకాన్ని ఉద్భవింప చేసేవారు ఎవరు? నేను సమస్త ఆయువు ఈ అన్వేషణలోనే గడిపాను. ఈ ప్రపంచాన్ని సృష్టించేవారెవరు? ఈ ప్రశ్నను నేను మీ కోసం నా ఆత్మను అడుగుతుంటాను. నీవు ఈ సృష్టిని వివరించే వారిని చూశావా? తెలుసుకున్నావా? చూడలేదు. కానీ గుర్తించాను. ఎలా గుర్తించాను? సత్సంగి తన ఊహతో ఏర్పర్చుకున్న నా రూపం - ఫకీర్ చంద్‌ను ఎవరు తయారు చేశారు?

నన్ను విశ్వసించిన మనిషి తయారుచేశాడు. కాని నేను వెళ్ళలేదు. ఈ విధంగానే ఈ ప్రపంచాన్ని రూపొందించే ఆతడు చాలా పెద్ద మనిషి. ఈ స్థూల ప్రపంచమంతా అతని శరీరం. అతణ్ణి విరాట్పురుషుడంటారు. పర్వతాలు అతని ఎముకలు. నదులు అతని నాడులు. గడ్డి అతని వెంట్రుకలు. ఆయనకూ మనసుంది. సంస్కృతంలో అవ్యక్తం అంటారు. అతని ఆత్మను హిరణ్యగర్భం అంటారు. ఆయన తన సంకల్పంతో, తన ఊహాకల్పనతో ముందుగా ఒక మనిషిని చేశాడు. ఆ మనిషి కోరిక కోరాడు. తరువాత సృష్టి రచింపబడింది. అంతా ఈ విధంగానే పుట్టింది. ఈ ప్రపంచాన్ని రూపొందించేవారిని సంత్‌లు కాల్ అంటారు. ఈ ఈశ్వరుణ్ణి దేవుణ్ణి నమ్మరు. అతడు మమ్మల్ని దెబ్బతీశాడు. చిక్కుబడేశాడని అంటారు వాళ్ళు సత్ పదంలోకి వెళ్ళాలనుకుంటారు. బేటరీలో ఒక ఇ.ఎం.ఎఫ్ ఉంటుంది. ఒక కరెంటు ఉంటుంది. కరెంటు మన జీవితం. ఇ.ఎం.ఎఫ్ ఆ సత్ పదం. మనం సత్ పదం దాటి వెళ్ళవలసిన వాళ్ళం. మనం సత్ పదం నుండి వచ్చాం. ఇది పైస్థాయి మాట. ప్రతి మనిషీ దీనిని అర్థం చేసుకోలేడు. అర్థం చేసుకునే వారికి సైగచేస్తాను. ఆ స్థితి ఇలా ఉంది అని చెబుతాను. ఓ మనిషీ ! నిన్ను నీవు గౌరవించుకోవటం నేర్చుకో. నిన్ను నీవు తెలుసుకో. నిన్ను నీవు గుర్తించు. నీవెవరివి? నీవు ఆ పరమ తత్వ ఆధారుని అంశపు క్రమంలో ఇక్కడికి వచ్చావు. ఇప్పుడు నిన్ను నీవు గుర్తించు. ఈ ప్రపంచంలో చిక్కుబడి దుఃఖపడుతున్నావు. ఇదే స్వామీజీ అంటారు. 'ఆది' రహస్యం ఏమిటి?

జేర్ మహీనా జేతా భారీ, జీవన్ హృదయ తపన్ కరారీ ।

రహస్యం ఏమిటి? ఓ మనిషీ! నీవు ఆ అనామీ ధామం నుండి వచ్చావు. అక్కడ సృష్టిలేదు. సృష్టించేవాడు లేడు. సృష్టింపబడేవారు లేడు. అక్కడ నా అంతరం లోపల ఏ వస్తువు స్పృహా ఉండదు. నీవు జీవన క్రమంలో ఇక్కడికి వచ్చావు. నీ ఆది గృహం అదే! నీవు ఇక్కడ మనసు పరిభ్రమణంలోకి వచ్చి చిక్కుబడ్డావు. ఇదే రహస్యం. ఈ విషయం బోధపడితే నీవు శరీరాన్ని విడిచేటప్పుడు ఈ ప్రపంచం పట్ల నీ ఆసక్తి ఉండదు. ఈ ప్రపంచంలోకి మళ్ళీ రావు. రాకపోకల నుండి తప్పించుకోవాలనుకునే వారి కోసం చెబుతున్నాను. మీరు ఎంతగా బాబాఫకీర్‌ను గురువుగా నమ్ముకున్నా, చెవులలో వేళ్ళుపెట్టుకుని అభ్యాసం

చేస్తున్నా మరణించడానికి ముందు మీ మనసు లోపల స్థూల శరీరం పట్ల ఏ మాత్రం ప్రేమ ఉన్నా, ఆ ప్రేమ ఉన్నంతవరకు నీకు రాకపోకలు వదలిపోవు. ప్రస్తుత విజ్ఞాన శాస్త్రం సైన్స్ దీనిని ఋజువు చేసింది. మృత్యుముఖంలో ఉన్నవారిని సున్నితపుత్రాసుపై డాక్టర్లు తూచారు. ప్రాణాలు వెళ్లిపోయాక ఒకరు 10 గ్రాములు, మరొకరు 20 గ్రాములు, ఇంకొకరు 15 గ్రాములూ బరువు తగ్గారు. ఆ తగ్గుదల ఎందుకు జరిగింది? ఎందుకంటే అతనిలో నుంచి వెలువడిన వస్తువు భారంగా ఉంది గనుక. బరువుగా ఉంది గనుక భూ గురుత్వాకర్షణ శక్తి తన పరిధిలో నుండి బయటికి వెళ్ళనీయదు. నీవు ఎంత బాబా ఫకీర్ను, దేవిని, మహమ్మద్‌ను, గురువును పూజించినా సరే! అది తప్పదు. నీవు వారిని ప్రేమిస్తూ మరణిస్తే నీ జనన మరణ చక్రం వదలదు. ఈ విషయాన్నే హుజూర్ రాయ్ సాలిగ్ రామ్ సాహిబ్ చెప్పారు. అంత్య సమయంలో ఫిలిం నడుస్తుంది. ఏ గురువు దగ్గర నామం పొందావో అతడు కూడా వస్తాడు. ఈ గురువులు మనను ఎంతో మోసం చేశారు. "నామం తీసుకో! ఇష్టం వచ్చినట్లు చేసుకో"! చివరి సమయంలో సతగురువు నిన్ను సత్ లోకానికి తీసుకుపోతాడని చెప్పారు. పరమాత్ముని ఇంటిగురించి ఈ గురువులను అడిగే వారే లేరు. ఒక మాట వినండి. హోషియార్ పూర్‌లో కార్ఖానా దగ్గరికి ఒక మిస్త్రీ రెండు వస్తువులు తెచ్చాడు. "నువ్వు పేదవాడివి ఎందుకు తెచ్చావు" అన్నాను. "బాబాజీ నా దగ్గర ఏం లేదుగానే ఉంటే మొత్తం అర్పించేవాణ్ణి" అన్నాడు. విషయం ఏమిటి? బాబా సావన్‌సింగ్ శరీరాన్ని విడిచినప్పుడు ఒకవైపు బాబా జగత్ సింగ్ గురు పీఠం పైకి వచ్చారు. ఒకవైపు సంత్ కృపాల్ సింగ్ తనను తాను గురువుగా ప్రకటించుకున్నాడు. నేను సత్యమైన వాణ్ణి. వీరిద్దరిలో ఏ గురువును అంగీకరించాలనే సందేహంతో నేను వ్యాకులం చెందాను. ఈ మాట సత్సంగీయులకు చెప్పాను. ఒక నవయువకుడైన సత్సంగి తను దీనిని రేపు పరిష్కరిస్తానని చెప్పాడు. మేం 12 మందిమి బ్యాస్‌కు వెళ్ళాం, బాబా జగత్ సింగ్‌ను కలిశాం. ఆ నవయువకుడు లేని దుఃఖాన్ని తెచ్చుకుని ఏడుస్తూ ఆయనతో "మహారాజ్! నిన్న మా నాన్న చనిపోయాడు. ఆయన చనిపోయే సమయంలో ఏమీ అన్లేదు. మరణించే సమయంలో మీరు ఆయన ఆత్మను తీసుకున్నారా? మీరు ఆయన ఆత్మను జాగ్రత్తపరిచారా?" అన్నాడు. "ఆయన ఆత్మను సత్‌గురువు సంభాళించాడు" అన్నాడు బాబా జగత్‌సింగ్. ఇంతకీ ఆ

యువకుని తండ్రి బతికే ఉన్నాడు. పరీక్షించడానికి యువకుడు అబద్ధం చేప్పాడు. అదీ అసలు సంగతి. అతడు సరదాగా మాట్లాడి వెళ్లిపోయాడు. ఇదీ జరుగుతున్న చరిత్ర!! ఆ తరువాత ఆ సత్యమైన మనిషి ఏడవసాగాడు, "నాదగ్గర 500 రూపాయలు ఉండేవి. సావన్ ఆశ్రమానికి వెళ్ళాను, ఆగ్రాకు వెళ్ళాను ఎక్కడా నాకు సత్యమేమిటో తెలియలేదు. ఎవరూ చెప్పలేదు. రెండు సంవత్సరాలనుండి మీ సత్సంగం వింటున్నాను. నా భ్రమలు తొలిగి పోయాయి. నా సంశయాలు పోయాయి" అన్నాడు. నేనివ్వగలిగినది, నా దగ్గరున్నది ఇదే! ప్రతి మతం వారు, పీఠాలవారు తమవైపు ఆకర్షించడానికి తమను తాము ఉన్నతంగానే చెబుతుంటారు. కానీ వాస్తవం ఇది కాదు. ఈ రహస్యాన్ని దాచటం వల్లనే నావంటి ఈ మతాలవారి, పంథాలు వారి వలలలో అమాయక వ్యక్తులు ఘోరంగా చిక్కుబడ్డారు.

బంధే కో బంధా మిలే, ఛూటే కౌన్ ఉపాయ్ ।
కర్ సంగత్ నిర్బంధ్ కీ జో పల్ మే దేహ ఛుడాయ్ ॥

నేను నిర్బంధ పురుషుణ్ణి. నన్నెవరు నిర్బంధుణ్ణి చేశారు? మీరే! దాతా దయాల్ నన్ను నిర్బంధుణ్ణి చేయలేక పోయారు. దాతా దయాల్ నాకు ప్రేమనిచ్చాడు. మార్గం చూపాడు. నమ్మకం కలిగేలా చేశాడు. సిద్ధి శక్తినిచ్చాడు. నిర్బంధనం కోసం ఆయన మీ సేవనిచ్చాడు. నన్ను గురువుగా భావించిన సత్సంగీయులనే నిజమైన సత్యమైన సద్గురువులుగా విశ్వసించి నమస్కారమర్పిస్తున్నాను. నేను పొందిన జ్ఞానమంతా మీ నుండే పొందాను. వాస్తవం ఏమిటో నాకు తెలిసిపోయింది. స్వామీజీ ఆ రహస్యాన్ని, వాస్తవాన్ని సైగ చేసి చెప్పాడు. నేను దండోరా వాయించి మరీ వ్యక్తం చేశాను. ఇదే విషయం బాబాసావన్ సింగ్ చెప్పేవాడు. "మీరు నామాట వినరు. కర్రతో కొట్టిమరీ చెప్పేవాడొస్తాడు" అనేవాడు. ఆ కర్రతో కొట్టేవాణ్ణి నేనే! ఎవరికోసం? సత్యాన్ని అభిలషించేవారి కోసం. పక్షపాతపరులు నా దగ్గరికి రావద్దు. వారిని పిలవడానికి నేను వెళ్ళను. ఓ మనిషీ! సంత్ మతం శిక్షణ ఇదీ అనే సత్యాన్ని చెబుతాను. నాకే సత్యం తెలియకపోతే స్వామీజీ నా పూర్వీకుల ఖండన చేసినట్లే నేను జ్ఞాపకం ఉండేలా ఖండన చేసి పోయేవాణ్ణి. ఈ అన్వేషణలో నేను ఆయువంతా గడిపాను. జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు. నేనెవరి సొమ్మునూ అనుచితంగా తీసుకోలేదు. సత్యం పైనే నడిచాను. ఈ సంతుల దగ్గర

ఏముందోనని చూశాను. నేను అర్థంచేసుకున్నదే వీరి వద్ద వున్నది. ఓ మనిషీ! నీ ఆది ఆ పరమ తత్వమే! దానిలో మనం ఇక్కడికి వచ్చాం. నాలుగురోజుల జీవితం. దీన్నే దాతా దయాల్ మహారాజ్ నాతో అనేవారు.

యహ తో నహిఁ తేరా దేశ్, దేశ్ హై బిగానా ।
యహాఁ సబ్ బిగానే బసే, కోయీ నహీఁ యుగానా ॥

ఇలాంటి శబ్దాలు నాకు రాసేవారు. నాకు బోధపడేవికాదు. నాపై ఒక విధి నిర్వహించే బాధ్యత ఉంది. శరీరాన్ని విడిచేముందు బోధనా పద్ధతిని మార్చమని దాతా దయాల్ మహారాజ్ చెప్పారు. నేను అర్థం చేసుకున్నదంతా తప్పుకావొచ్చు. నాకు దీని గురించి చింతలేదు. నేను తప్పు చెబితే ఇతర మహాత్ములు నన్ను విమర్శించనీ! నాకేం అభ్యంతరం లేదు. నేను దావా వేయను. సత్యాన్వేషణలోనే జీవితం గడిపాను. నేను సేవకుడను. 1942లో బాబా సావన్ సింగ్ జీ దగ్గరికి వెళ్ళాను. "మహారాజ్! నాపై ఒక విధి నిర్వహించే బాధ్యత ఉంది. కానీ నేను నిర్వహించదలచుకోవటం లేదు" అన్నాను. "ఎందుకు?" అన్నారాయన. "నేను సత్యం చెబుతాను" అన్నాను. "అ సత్యం చెప్పటం నావల్ల కాలేదు. ఎందుకంటే ప్రపంచం సత్యం వినేందుకు సిద్ధంగా లేదు. రెండవది నా ఆశ్రమం. కనుక నీవు నిర్భయుడివై పని చెయ్యి. నేను నిన్ను సంరక్షిస్తాను" అన్నారు. నాకు బాబా సావన్ సింగ్ జీ శబ్దాలే రక్షణనిచ్చాయి.

జేఠ్ మహీనా, జేరా భారీ జీవన్ హృదయ తపన్ కరారీ ।

ఇది నిజమేనా అని ఆలోచిస్తాను. ఈ సంతులకు తెలిసిందా? సంతులు ఆ అన్వేషణలో వెళ్ళి తమను తాము మరిచారు. గనుక అక్కడేం లేదని చెప్పారు. వాస్తవమేమిటనేది సంతులకూ తెలియలేదు, నాకూ తెలియలేదు. ఆయన మహిమ అంతం లేనిది. ప్రకృతి ఈశ్వరుని విషయంలో ఎవరూ నిర్ధారణ నివ్వజాలరు. బుద్ధి, తెలివి పనిచేసినంతవరకు చెప్పారు. నేనన్నీ వదిలి శరణాగతమ్ వద్ద కొచ్చాను. అది ఉందో లేదో ఏం తెలుసు? ఎవరికీ ఆ ఈశ్వరుని రహస్యం అంతుపట్టలేదు. సంత్ దేవుడా? ఆయన దగ్గర ఏదైనా బలం ఉంటే వీళ్ళు తమ తమ వ్యాధులను తగ్గించుకోరా? తమ పిల్లలను సరిగ్గా ఉండేలా చేసుకోరా?

దాతా దయాల్ తన ధామాన్ని పాడుబడకుండా కాపాడుకునేవాడు కాదా? కనుక నేను శరణాగతమ్ అనే ఫలితం పైకి వచ్చాను. ఒక శక్తి ఉంది మిత్రులారా! దానిని ఏ రూపంలోనైనా విశ్వసించండి. గురువుల వెనుక ఎందుకు తిరుగుతారు? మేమంతా మోసగాళ్ళం. మేం ప్రపంచాన్ని మోసం చేస్తాం. మేం కోరింది చేసుకోవాలనుకుంటాం. మిమ్మల్ని జంతువులుగా చేయాలనుకుంటాం. ఈశ్వరునికి రూపంలేదు. అన్ని రూపాలూ ఆయనవే! నీ భ్రమలను దూరం చేసి నీకు శాంతి నిప్పించగలిగే వారే గురువు.

**తేరీ లీలా కౌన్ జానే తూతో అపరమ్ పార్ హై**

నన్ను పూజించటం వలన ఏం లభిస్తుంది? నేను మీకు సత్యమైన మార్గం చూపుతున్నాను. ఆ భగవంతుడు మీ లోపల ఎల్లవేళలా ఉంటాడు. ఓ సర్వేశ్వరా! జీవితం నిన్ను అన్వేషించటంలో గడిచింది. ఈశ్వరేచ్ఛ దాతా దయాలుని చరణాలలోకి తీసుకువెళ్ళింది. సంత్ మతాన్నిచ్చింది. అనుభవం చెప్పిపోతానని శపథం చేశాను. నేను అర్థం చేసుకున్నది తప్పో ఒప్పో తెలియదు. జీవితమంతా పరుగెత్తాను. చివరికి ఇక్కడికి చేరాను. దాని అంతం దొరకదు. ఆ పరమ తత్వం ఏమిటో ఎవరికీ తెలియదు. దాతా! నీవు పని ఇచ్చావు. వీళ్ళు నా దగ్గర కొస్తారు. ఇక నా సంరక్షణ నీ చేతిలో ఉంది. భగవంతుడు మీమీ మనోకామనలను పూర్తి చేయనీ! నేను శుభభావనలిస్తాను. నా వద్ద ఏమీలేదు. ఇతర గురువుల దగ్గరేమైనా ఉందేమో తెలియదు. నమ్మండి నమ్మకపోండి. శుభ భావనలు తప్ప నావద్ద ఇంకేం లేవు.

**అందరికీ రాధాస్వామి**

పరమసంత్ పరమదయాల్ పండిత్ ఫకీర్ చంద్ మహారాజ్

# సత్సంగం

**ఇంటి నెం. 3024 సెక్టర్ 28-డి,**

**చండీగఢ్**

**తేది. 5-6-1977**

రాధాస్వామి !

మిత్రులారా! సోదరులారా! చెల్లెళ్ళారా! వీరులారా! తల్లులారా! నేనెందుకు వచ్చాను? ఈ సాలెగూటిని ఎందుకు ఏర్పర్చుకున్నావని నాఆత్మను సదా ప్రశ్న అడుగుతుంటాను. ఈశ్వరుణ్ణి, పరమాత్ముణ్ణి, రాముణ్ణి కలుసుకోవాలని బయల్దేరాను. నా కర్మ లేదా దైవేచ్ఛ నన్ను దాతా దయాల్ చరణాలలోకి తీసుకు వెళ్ళింది. నాకాయన ఈ సంత్ మతమిచ్చాడు. అయన వాణిలను చదివాను. సకల ప్రపంచం ఏ దేవుణ్ణి పూజిస్తుందో ఆయన్ని ఈ రాధాస్వామీ మతం లేదా సంత్ మతం అంగీకరించదు. ప్రపంచాన్ని ఉద్భవింపచేసిన అతణ్ణి సంతులు 'కాలం' అనీ 'కాలుడనీ', నిర్దయుడనీ అంటారు. నేను రామ, కృష్ణ, దేవీ దేవతలను అంగీకరించిన వాణ్ణి. ప్రపంచాన్ని సృష్టించిన వాడు నిర్దయుడని, కాలుడని బోధిస్తే దేవుణ్ణి విశ్వసించేవారు వారిని వ్యతిరేకించనైనా వ్యతిరేకిస్తారు లేదా ఆ సంత్ మతం వారు చెప్పిన అంశాలను గురించి అన్వేషిస్తారు. రాధాస్వామి మతాను యాయులు సర్వేశ్వరుడు - సర్వాధారుడని అంటారు. దాతా దయాల్ జీ నాకు ఇదే రాశారు.

మై నహిఁ రామ కృష్ణ కా సేవక్, ఈశ బ్రహ్మ నహిఁ జానూఁ ।
మై ఫకీర్ కా నామ దివానా, సబ్ సే బఢ్ కర్ మానూఁ ॥

కబీర్ ఏమంటున్నారు? 'సంతోఁ ఆవే జావే సో మాయా'! ఈ రహస్యాన్ని అర్థం చేసుకోవడానికి నేను నా జీవనం వెచ్చించాను. మనం మన రుచి కోసం, సంతోషం కోసం, కామం కోసం పిల్లల్నికంటాం. గర్భంలోకి ప్రవేశించిన పిల్లవాడు పుడతాడు. పెరిగి రోగగ్రస్థుడవుతాడు. ఒకడు టి.బి. తో మరణిస్తాడు. మరొకడు

మూర్ఖుడవుతాడు. ఈ లెక్కన ప్రపంచాన్ని సృష్టించిన దేవుడు ఎలా నిర్దయుడో మనం కూడా నిర్దయులమే!

ఆ అసలైన సర్వాధారుడు ఈ లోకంలోకి రాడు, వెళ్ళిపోడు అని సంతులు అంటారు. నేను ఆ సర్వాధారుని అన్వేషణలోనే జీవితమంతా గడిపాను. నా అనుభవాలను చెప్పి పోతానని ప్రతిజ్ఞ చేశాను. ఇది నా కర్మఫలం. నేనెవరిపైనా దయ చూపను. దాతా దయాల్ జీ మహారాజ్ ప్రస్తుతం ఉన్న బోధనా పద్ధతిని మార్చమని అజ్ఞాపించాడు. మనం ఉంటున్న ఈ ప్రపంచంలో ఏ సుఖమూ లేదు. ఒకరికి ధనం లేదు. మరొకరికి సంతానం లేదు. ఇంకొకరిని వ్యాధులు బాధిస్తున్నాయి. వేరొకరికి తమ్మునితో సరిపడదు. భర్తతో సరిపడదు. భార్యతో సరిపడదు. తల్లిదండ్రులంటే గిట్టదు. ఇలాంటివే ఇంకా మరికొన్ని. . .! ఈ ప్రపంచమంతా దుఃఖాలకు నెలవు. సంతుల బోధనలను, సిద్ధాంతాలను అంగీకరించడానికి నేను వివశుణ్ణయ్యాను. ఈ ప్రపంచాన్ని సృష్టించిన వాడు నిర్దయుడు. మనలను తన రూపంగా మార్చాడు. మనం లోకంలోకి వచ్చాం. ఆయన గుణాలు వచ్చాయి. ఆయన తన సంకల్పంతో ప్రపంచాన్ని రూపొందించాడు. మనం కూడా మన సంకల్పంతో మన ప్రపంచాన్ని ఏర్పర్చుకుంటాం. ఆయన సంకల్ప ఫలితం చూడు. వరదలొస్తాయి. జంతువులు చనిపోతాయి. మనుషులు చనిపోతారు. ఇళ్ళు కొట్టుకుపోతాయి. ఎంతో నష్టం సంభవిస్తుంది. ఏం జరుగుతోందో మీ జీవితాలను చదవండి. ఇవాళ యౌవనం ఉంది. తరువాత వార్ధక్యం వస్తుంది. ఇవాళ సుఖం ఉంది. రేపు దుఃఖం కలుగుతుంది. దుఃఖం వెంటలేకుండా సుఖం లేనే లేదు. ఈ రోజు ధనం ఉంది. రేపు పేదరికంవస్తుంది. ఇదీ ప్రపంచం తీరు! సంతులు సర్వాధారుణ్ణి ఇష్టునిగా ఇచ్చారు. ఆయన్ని ఇష్టునిగా అంగీకరించినందు వలన సమస్త దుఃఖాలు దూరమవుతాయా అనే ప్రశ్నకలుగుతుంటుంది. ఆఁ ! దూరమవుతాయి. సత్యమైన, అసలైన నామం లభిస్తే దూరమవుతాయి. నామమే సంతుల మార్గం. ఆ నామం నాకు మీ వల్ల దొరికింది. దాతా దయాల్ రాధాస్వామి నామం, గురుస్వరూప ధ్యానాలను 1905లో నాకు ఉపదేశించారు. శబ్దయోగం బోధించారు. కానీ నాకా నామం ప్రాప్తించలేదు. ఒకవేళ అప్పుడే ప్రాప్తిస్తే నేను ఇంత కష్టపడేవాణ్ణి కాదు. నామం లభించిన వారికి కష్టపడే అవసరం,

ప్రయత్నించే అవసరం ఉండదు. ఇదీ నామ మహిమ! ప్రస్తుతం ఎన్ని గురుమతాలున్నాయి? "రామ రామ" అని కొందరంటారు. "అల్లా అల్లా" అని కొందరు జపిస్తారు. కొందరు "పాంచనామాన్ని", మరికొందరు "రాధాస్వామి" నామాన్ని స్మరిస్తారు. నామం వీటన్నిటిలో ఏదీ కాదని నా అనుభవం చెబుతోంది. ఈ నామం జపించటం వలన ఆ వస్తువు లభించేటట్లయితే నేను కూడా నోటితో చాలాకాలం రాధాస్వామి నామాన్ని వల్లె వేశాను. మీలో పంచనామాల స్మరణ చేసేవారున్నారు. అల్లాహ నామస్మరణ చేసేవారున్నారు. మీకు ప్రపంచంలో దుఃఖం వ్యాపించదా? నా ఆత్మనే ప్రశ్నిస్తాను. నామాన్ని నేనెలా అర్థంచేసుకున్నాను? మన అంతరంలో చైతన్య శక్తి ఉంది. దీనికి సుఖదుఃఖాలు, బాధలు, చింతలు ఉండవు. అనుభవంలోకి రావు. ఈ స్థితిపేరే నామం. నోటిలో పలికేదే నామం అయితే, శబ్దం వినటమే నామం అయితే నేను బస్రాబగ్దాద్‌లో ఉన్నప్పుడు అంతరంలో అనేకసార్లు పెద్దపెద్ద శబ్దాలు విన్నాను. వీణాధ్వని, రారంగ సారంగ ధ్వనులు విన్నాను. ప్రకాశాన్ని చూశాను. ఇంత జరిగినా నేను నామం గురించి చింతించాను. కాముకుణ్ణి అయ్యాను. లాలూచీలోకి వచ్చాను. నేను కామం భోగించానంటే బయటకాదనేది పరాయివారితో కాదనేదీ నిజం. నా భార్యకే, ఇంటికే పరిమితం. లాలూచీకి తలవంచినా సముచితరీతిలోనే, మితమైన పద్ధతిలోనే. ఇప్పుడీ వయసులో నా ఆత్మను ప్రశ్నిస్తాను. నీకా రహస్యం తెలిసిందా? దేనిని కలుసుకుంటే సుఖదుఃఖాలు వ్యాపించవో అది లభించిందా అని ప్రశ్నించుకుంటాను. ఆ నామ ప్రాప్తి నాకు మీ వలన కలిగింది. దాతా దయాలుణ్ణి వేధించేవాణ్ణి. 1918లో ఆయన నన్ను ఆజ్ఞాపిస్తూ, "ఫకీర్! నా ఆజ్ఞ పాటించు. నీకు సత్యమైన సద్గురువు సత్సంగీయుల రూపంలో లభిస్తాడు. నీ నావ తీరం చేరుస్తాడు. నీలో 99 అవగుణాలున్నా సత్యప్రియత్వమనే ఒక మంచిగుణం నీలో ఉంది. ఆ ఒక్క సత్య గుణం నిన్ను తీరం చేరుస్తుంది. ఇతరులను కూడా తీరం చేరుస్తుంది. నీ ద్వారా నా రూపం కొందరిలో సాక్షాత్కరిస్తుంది. నేనెవరి అంతరంలోకీ వెళ్ళననే విషయం నాకు తెలిశాక నాలో ప్రకటమైన ఊహలు ఆకారాలు శబ్ద ప్రకాశాలు వంటివన్నీ అసలైనవి కావు, మాయ అని నాకు అర్థమైంది. ఊహ, భావం, ఆలోచన వస్తుంటుంది. పోతుంటుంది. శబ్దం వస్తుంది. పోతుంది, అయితే ఇదంతా ఏమిటి? మాయ. అంతా మాయ. ఎప్పుడూ రానిదీ, పోనిదీ

అయిన వస్తువు ఒకటుంది. అదేమిటి? ఎలాంటిది? దానిని నేను అన్వేషించాను. అందులో నిల్చిపోవటం నా వల్ల కాదు. ఆ వస్తువు నాలోపల శబ్దాన్ని వింటుంది. ప్రకాశాన్ని చూస్తుంది. రూపాల్ని చూస్తుంది. దానికి సాక్షి- అది నీవే! మనం ఈ రూపాన్ని విస్తారం చేసి మన లోపలున్న, మనలో పుట్టిన ఊహాలు, విచారాలు సత్యమైనవని, విశ్వసిస్తాం. ఎప్పటివరకు మనలో అవి ప్రగటమవుతాయో, సాక్షాత్కరిస్తాయో వాటిని సత్యమని నమ్ముతుంటాం. మనకు నామం ప్రాప్తించదు. స్వామీజీ అంటారు. "నీవు జగతినే సత్యమని నమ్మి కూర్చున్నావు. ఎలా నామం గుర్తులను పొందగలవు" అంటారాయన. ఈ బాహ్య జగత్తు నీది కాదు. ఇది నిర్దయుడైన కర్తా పురుషుని జగత్తు. ఈశ్వరుని జగత్తు లోపల అన్ని ఆలోచనా విచారాల భావాలున్నాయి. నీవు నీ ఆలోచనకారణంగానే దుఃఖిడవవుతావు లేదా సుఖవంతుడవవుతావు. తన అంతరంలో ప్రకటమయ్యే సమస్త ఆలోచనలు మాయ అనే విశ్వాసం కలగనంతవరకు మనిషికి శాంతి లభించజాలదు. ఆ గమ్యస్థానానికి, పైకి చేరుకోజాలవు. ఏ మనిషైనా ఎవరినైనా అందరికంటే గొప్ప అయిన గురువుగా భావించనీ, దేవునిగా నమ్ముకోనీ, అతనిలో ప్రకటమైన దంతా మాయ అనీ, కల అనీ విశ్వాసం కలగాలి. జనుల లోపల నేను ప్రకటమవుతాను. కానీ నేను కాను. మరి మీలో ప్రకటమైన రూపాలు ఎవరివి? జగత్తు మిథ్య అంటారు కానీ - ఈ జగత్తు మిథ్య కాదు. ఈ జగత్తును చూస్తున్నావు. ఇది చండీఘడ్ నేల! ఆకాశం, చంద్రుణ్ణి చూస్తున్నావు. ఇవన్నీ మిథ్యకావు. ఇవి మిథ్యలే అయితే ఈ లోకాన్ని సృష్టించిన భగవంతునికి మిథ్య కాబోలు. మనికివి మిథ్యకాదు. మనకు మిథ్య ఏదీ? మన ఊహలు, ఆలోచనా విచారాలు. ఇవి మిథ్య. ఈ ఊహనే తీసుకుని సంతులు వేదాంతాన్ని కాల మతంలో పెట్టారు. ఈ ప్రపంచం లేదని వేదాంతులంటారు. వాళ్ళు పొరబడుతున్నారు. ఈ ప్రపంచం ఎందుకు లేదు? ఉంది. లోకం ఉంది. సూర్యుడు, చంద్రుడు, తారలున్నాయి. ఎన్ని యుగాలొచ్చాయి? సత్ యుగం, త్రేతా, ద్వాపర యుగాలు వచ్చాయి. సత్ యుగం ఉంది, త్రేతాయుగం, ద్వాపరాలున్నాయి. ప్రపంచంలేదని ఎలా అంటావు? ఇది వారి వారి అజ్ఞానం. ప్రపంచం లేకుంటే నీవు నీ ప్రపంచంగా చేసుకునే నీ ప్రపంచము లేదు. ఈ మాటలనే కబీర్ ధర్మదాస్‌కు చెప్పాడు.

చల్ హంసా సత్ లోక్ హమారే, ఛోడో యహ సంసారా హో ।
యహి సంసార్ కాల్ హై రాజా, కరమ్ కో జాల్ పసారా హో ॥
చౌదహ ఖండ్ బసే జాకే ముఖ్, సబ కో కరత్ అహారా హో ।
జారి బారి కోయిల్లా కరి డారత్, ఫిర్ ఫిర్ దే అవతారా హో ॥
బ్రహ్మ విష్ణు శివ్ తన్ ధరి ఆయే, అవుర్ కో కౌన్ బిచారా హో ।
సుర్ నర్ ముని సబ ఛల్ ఛల్ మారిన్, చౌరాసీ మే డారా హో ।
ముద్ధ్ అకాస్ ఆప్ జహాం బైఠే, జోతి సబద్ ఉజియారా హో ।
సేత సరూప సబద్ జహాం ఫూలే హంసా కరత్ బిహారా హో ।
కోటిన్ సూర్ చంద్ ఛిపి జై హై ఏక్ రోమ్ ఉజియారా హో ।
వహీ పార్ ఇక్ నగర్ బసతు హే , బర్సత్ అమృత్ ధారా హో ।
కహే కబీర్ సునో ధర్మదాసా, లఖో పురుష్ దర్బారా హో ।

ఇది చివరి సత్సంగం. ఇక్కడ నేను చెప్పిన విషయాలకు, సత్సంగాలకు పుస్తక రూపమివ్వాలని కోరుతున్నాను. దీని పేరు నేను 'చండీగఢ్‌లో అమృత వర్షం' అని పెడుతున్నాను. తన సమస్త ఆస్తిపాస్తుల్ని సాధువులకు పంచిపెట్టి కంబళి తీసుకుని గురువు ద్వారం దగ్గరకి వచ్చాడు ధర్మదాసు. ప్రపంచాన్ని వదలడానికి అర్థం ధన సంపదలే అయితే ధర్మదాసుకు కబీర్ ఇలా ఎందుకు చెబుతాడు? బయటి ధనం వదిలేయటం వలన, బయటి కంబళి వేసుకోవటం వలన, సాధువు కావటం వలన నామం లభించదు. గురువు ద్వారా నీలో స్ఫురించే స్ఫురణలన్నీ ప్రపంచం అని నీకు నమ్మకం కలిగినప్పుడే నామం లభిస్తుంది. ప్రపంచం - సంసారం అని దేనినంటారు. సమ-సారం. సమమని రెండూ సమానంగా ఉంటే అంటారు. వాస్తవాన్ని సారం అంటారు. నీ లోపల ఉన్నదేమిటి? అదేమిటో నాకు మీ వల్లనే తెలిసింది. నేను మీలో సాక్షాత్కరించానని మీరు చెబుతారు. అలా నేను వెళ్ళలేదు. కనుక నాలోపల కన్పించేవన్నీ కల్పితాలే. వీటిని చూసే వస్తువే "సారవస్తువు". దాని ఎదుటికి ఏది వచ్చినా రూపం రంగులు వస్తాయి. నాలుకతో స్మరణ వస్తుంది. ధ్యానం వస్తుంది. స్వప్నాలు వస్తాయి. ఆనందం వస్తుంది. అది నీ సంసారం, ప్రపంచం.

నేనీ పనిని ఏదో ఒక ధ్యేయం కోసం చేశాను. ఎవరికోసం చేశాను? ఎవరైతే

నిజంగా సంతు మతంలో కలుస్తారో, రాకపోకలు సమాప్తం కావాలని కోరుకుంటున్నారో, తమ అసలు ఇంటికి వెళ్ళి పోవాలని కోరుకుంటున్నారో వారి కోసం చేశాను. ఈ రోజు ఓ వ్యక్తి నన్ను కలిశాడు. చాలా సంతోషపడుతూ కన్పించాడు. "మహారాజ్ ! నాకు మనమడు పుట్టాడు" అని చెప్పాడు. నేను నవ్వాను. చాలా సేపు నవ్వాను. "ఏమయ్యా! నీవు 70 సంవత్సరాల వాడివయ్యావు. నీ బిడ్డకు కొడుకు పుట్టాడని సంతోషిస్తే నీ రాక పోకలు సమాప్తమవుతాయా? జనన మరణ చక్రం నుండి నీవు రక్షింప బడతావా? నీవు పొరబడుతున్నావు. నీకు మనవడు పుట్టాడని సంతోష పడుతున్నావు. నీ రాకపోకలు సమాప్తమవుతాయనే నమ్మకం పెట్టుకోకు. ఆశపడకు"అన్నాను. పిల్లలకు ఇవ్వగల శిక్షణవేరు. స్త్రీలకు మరో రకం శిక్షణ, యువతకు ఇంకోరకం బోధన. నాపై ఒక బాధ్యత ఉంది. వాస్తవమేమిటనే సత్యాన్ని ప్రపంచానికి చెప్పిపోవాలని కోరతాను. నేను అర్థం చేసుకున్నదే సరైనదని వాదించను. ఎందుకంటే నేనర్థంచేసుకున్నదే సరైనదని సంతులవాణి నిరూపిస్తోంది. అందుకే నా అనుభవం తప్పుకాదని నాకు ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఉన్న గురువులు మనకు వాస్తవాన్ని స్పష్టంగా చెప్పలేదు. ఇందులో వాళ్ళ దోషం కూడా ఏమీలేదు. మనం ప్రపంచం నుండి విముక్తి పొందడానికి సంతుల దగ్గరికి వెళ్ళం. మనం పిల్లల కోసం, రోగాల నుండి విముక్తి పొందటం కోసం సంతుల దగ్గరికి వెళ్తాం. ఓ పిచ్చి జనమా! పిల్లలు కలగటం, కలగకపోవటం, రోగాలు రావటం, రాకపోవటం వంటివన్నీ నీకర్మల ఫలితాలు. ఇతడు ఫకీర్ చంద్. జబ్బు పడ్డాడు. రాత్రి 3 గంటలకు తన తమ్ముడికి హోషియార్‌పూర్‌కు ఫోన్ చేశాడు. ఆ తమ్ముడు నా దగ్గరికి వచ్చి చెప్పగా నేను ప్రసాదం చేసిచ్చాను. పది రోజులలో నయమవుతుందని ఉత్తరం రాశాను. పదిరోజుల్లో అతనికి స్వస్థత చేకూరింది. నేను ప్రసాదం ఇచ్చినందుకే తను వ్యాధినుండి విముక్తుడనయ్యానని నా వెనకెనకే తిరుగుతాడు. "ఫకీర్ చంద్! పదిరోజుల్లో బాగవుతాడని" నీవలా ఎందుకన్నావు? అని నా ఆత్మను ప్రశ్నిస్తాను. ఇలాంటిదే మరో ఉదంతం. ఒక వ్యక్తి కొడుకు జబ్బు పడ్డాడు. ఆ పిల్లవాణ్ణి చూసి చెప్పాను. ఇతడు "పదిరోజులలో బాగవుతాడు. లేదా మరణిస్తాడు" అన్నాను. ఆ వ్యక్తి కంగారు పడి ఓ జ్యోతిష్యుణ్ణి కలిశాడు. "బాబా ఫకీర్ ఇలా అన్నాడు" అని కూడా చెప్పాడట. జ్యోతిష్యుడు కుర్రవాడి జన్మకుండలి పరిశీలించి ఇతనికి వ్యాధి

అని చెప్పాడు. అయితే అది ఇంకా ప్రారంభదశలోనే ఉంది కనుక కుర్రవాడు బాగవుతాడని చెప్పాడు. కుర్రవాడు వ్యాధి నుండి విముక్తు డయ్యాడు. "ఫకీర్ చంద్! నీవొక మాటంటే అది ఎందుకు నెరవేరుతుంది?" అని ఆలోచిస్తుంటాను. ఇదొక ప్రశ్న. దీనికి మొదట్లో జవాబు నాదగ్గరుండేది కాదు. కానీ ఇప్పుడు దొరికింది. కబీర్ శబ్ద్ ఒకటుంది.

సాంచ్ బరాబర్ తప్ నహీం, ఝూట్ బరాబర్ పాప్ ।
జాకే హృదయ సాంచ్ హైం, తాకే హృదయ ఆప్ ॥

నేను సత్య ప్రియుడను. సత్యం చెప్పే మనిషే యథార్థవాది అని మీరనుకుంటారు. సదా సత్యమే పలికే వాడు సత్యవాది, యథార్థవాదికాదు. తన అంతరంలో తన నిజస్వరూప జ్ఞానాన్ని కలిగి ఉన్నవాడు, తన రూపంలో ఉండేవాడు, తన లోపలి స్ఫురణలను మాయ అని అనుకొని వాటిలో లంపటుడు కాని వ్యక్తే సత్యవాది అనవచ్చు. అతడే సత్పురుషుడు. సత్యం చెప్పేవాడు సత్పురుషుడుకాదు. ఇది నేటి వరకు ఏ మహాత్ముడూ చెప్పని రహస్యం. ఇలాంటి మనిషి నోటి నుండి జరగబోయేదే స్వాభావికంగా వెలువడుతుంది. ఆ వాక్కే చేస్తుందని దీని అర్థం కాదు. మీరు పొరబడుతున్నారు. ఏ గురువైనా ఇలా చేయగలిగితే అతడు తన వ్యాధిని నయం చేసుకుంటాడు. తన పుత్రులను సరిచేసుకుంటాడు. ఈ వలయంలో ఆజ్ఞానంలో ప్రపంచం దోచుకోబడింది. మనకు వాస్తవం గురించి తెలియదు. మనం గురు రూపాన్ని అర్థంచేసుకోం. గురువుల వెనకెనక తిరుగుతుంటాం. తెలివి, జ్ఞానం వివేకాలపేరే గురు నామం. ఈ సారి ఇది నా చివరి సత్సంగం. సత్యమైన జ్ఞానం ఇచ్చి పోతాను. ముఖ్యంగా నన్ను ఇక్కడికి పిలిచిన వారికి చెబుతున్నాను. నేనేది అర్థం చేసుకున్నానో అదే చెబుతాను. దీనినే కబీర్ చెప్పాడు.

చల్ హంసా సత్ లోక్ హమారే ఛోడో యహ సంసారా హో ।

ప్రపంచాన్ని సృజించినవాడు నిర్దయుడని సంతులన్న మాట సరైనదేనా అని ఆలోచిస్తుంటాను. సరైనదేనని నా బుద్ధి అంగీకరించింది. మనం కూడా నిర్ధయులమే! వర్షం కురుస్తుంది. పొలం ఉంటుంది. కోట్లాది క్రిములు పుడతాయి. డి.డి.టి వేస్తామా వేయమా? నీలో మలేరియాకు సంబంధించిన క్రిములు

ప్రవేశించాయి. ఔషధం తీసుకుని వాటిని చంపుతామా లేదా? మహావీర్ జయంతి రోజు ఇదే ఉపన్యాసమిచ్చాను. అహింసా పరమోధర్మః అనేది ప్రాకృతికధర్మం కాదు. ఇక్కడ అహింస, హింస రెండూ ఉన్నాయి. ఇది కాలుని సృష్టి, దీని నిర్మాణమే అలా ఉంది. సంతులు దీనిని అన్వేషించారు. దీని నుండి రక్షింపబడాలనుకునేవారి కోసం, శాశ్వతంగా దుఃఖాలను తప్పించుకోవాలనుకునే వారి కోసమే ఈ సంత్ మతం. గురువులు నీకు నామమిచ్చారు. వాళ్ళేం చేశారో నాకు అర్థంకాలేదు. వాళ్ళు తమ ఆశ్రమాలు, గౌరవప్రతిష్టలు, గద్దెలు, మందిరాల కోసం నీకు నామమిచ్చారు. నామమిచ్చి మీరు ప్రతి నెలా వస్తుండాలి. మీ ఆదాయం నుండి పదవభాగం ఇస్తుండాలంటారు. ప్రపంచం నామంపొందే అర్హత కలిగి లేదు. ప్రపంచంలో రెండు మార్గాలున్నాయి. ప్రవృత్తి మార్గం. నివృత్తి మార్గం. సంతులది నివృత్తి మార్గం. ఇది ఎప్పుడువస్తుంది. ఎవరి కోసం? నిజమడుగుతావా?

రాధాస్వామీ నామ్ జో గావే సోయీ తరే,
కలి కలేశ్ సబ్ నాశ్ సుఖ్ పావే సబ్ దుఃఖ్ హరే ।

ఈ నామం ఇలాంటి వారికోసం. కలియుగపు క్లేశాలు దూరం చేయడానికి! సత్ యుగంలో మరణాలు జరిగేవి కాదా? రోగాలు వ్యాధులు వచ్చేవి కావా? కలియుగంలో తెలివి ఎక్కువ పెరుగుతుంది. కానీ మనిషి తన తెలివివలన అశాంతుడువుతాడు. అతనికి శాంతి నివ్వడానికి కలియుగంలో 'నామం' ఉంది. సుఖంగా ఉన్న మనిషికి ఈ నామం అవసరమేం లేదు. ప్రపంచానికి నామం ఇచ్చేవారు పొరపాటు చేస్తున్నారు. నేను నామం ఇవ్వను. ఎందుకివ్వను? ప్రపంచానికి ఈ నామాన్ని తీసుకునే అర్హతలేదు. ఎవరే వస్తువుకు అర్హులో వారికది చెబుతాను. మీరు నివృత్తి మార్గంలోకి రమ్మని పిల్లలకు ఎప్పుడూ చెప్పలేదు. ప్రపంచంలో అభివృద్ధి సాధించండి. అనుభవం లోకి తెచ్చుకొనండి. ఫలించండి. ప్రపంచం అనుభవంలోకి వచ్చాకే అప్పుడు నామం వైపు రండి అని పిల్లలకు చెబుతాను. దాతా నన్ను బోధనా పద్ధతిని మార్చుమని ఆదేశించారు. నేను నిర్భయుడినై చెబుతాను నేను తప్పుచెబుతున్నానను కుంటే ఇతర మహాత్ములు ఖండన చేయవచ్చు. నాకే దుఃఖమూ లేదు. మనకు తప్పుడు శిక్షణ నిచ్చారు.

రాధాస్వామి మతం వాణిని చదవండి. ఎంత వైరాగ్యం ఉంది? తండ్రి, తల్లి, అన్నదమ్ములు, కొడుకు ఎవరూ ఏమీకారు. అంత్యసమయంలో స్వామీజీ మహారాజ్ తన శిష్యుడైన రాయ్ సాలిగ్ రామ్ మహారాజ్‌ను పిలిచి, "నేను సత్ లోకానికి వెళ్తున్నాను. నేను పోయాక ఇప్పుడు నాకెలా సేవ చేస్తున్నారో నా భార్యకూ సేవచేయండి" అన్నాడు. ఇది పుస్తకాల్లో రాసి ఉంది. ఎవరూ కాదనలేరు. తన జీవితంలో, ప్రవచనాలలో, పుస్తకాలలో ఆయన చూపిన, రాసిన వైరాగ్యం ఏమైనట్లు? భార్య, ధనం, పుత్రులు ఎవరికి ఎవరూ ఏమీ కారన్నారు. మరి ఆయన భార్యపై ప్రేమచూపటం, ఆమెను సుఖంగా ఉంచాలను కోవటం సామాన్యుల వలెనే ఉంది. ఆయన అందరికంటే అతీతుడుగా ఏమీ లేనట్లేకదా! ఎవరైనా నాకు జవాబివ్వండి. గురువులు ఆస్తులు సంపాదిస్తారు. తన పిల్లలకు, మనవలకు, బంధువులకు ఇచ్చి పోతారు. వాళ్ళు అతీతులా? నేను దాతా దయాలుని వద్దకు వెళ్ళి అన్నాను. "దాతా! మీరు మీ ధామాన్ని ఏదైనా నగరంలో కట్టిస్తే చాలా బాగుండేది. ఏ వాహనాలు రాని ప్రదేశంలో కట్టారు" అన్నాను. "ఫకీర్! నా ఊరివారు, బంధువులు పేదవారు. ఇక్కడికి వచ్చే సత్సంగీయుల వలన డబ్బు అందితే వీరికి కొంత జరుగు బాటవుతుంది" అన్నారాయన. ఎంతో స్పష్టంగా చెప్పారు! నీ భార్యను వదలి రమ్మని నేను చెప్పటంలేదు. నీవు భార్యా, పిల్లలు, ఇంటి రూపాలను అర్థం చేసుకో, జీవనం ఉన్నంతవరకు నీవు వివశుడవే! మీ సమస్త ఆస్తి పాస్తులు మీ పిల్లలకు ఇప్పుడే ఇవ్వకండి అని వృద్ధులకు చాలాసార్లు చెబుతుంటాను. వారికి అవి ఇచ్చేస్తే నీవు చాలా కష్టపడాల్సివస్తుంది. ప్రస్తుత ప్రపంచంలో ఎవరూ ఎవరికీ ఏమీ కారు. అసలైన నామం ఏమిటి? అంతరంలో చెలరేగే ఆలోచనలు, ఊహలు మాయేనని మీకు జ్ఞానం కలగాలి, అనుభవం కలగాలి. అదే అసలైన నామం. సూక్ష్మ ప్రకృతి ఉంది. కారణ ప్రకృతి ఉంది మనం దానితో పాటు ఉన్నాం. మనం ఎవరి ఆధీనంలోనూ లేము. మనం స్వతంత్రులం. ఎందుకంటే మనం ఇందులో చిక్కుబడి ఉన్నాం. అందుకే గురువు అవసరం ఉంది. ఉంటుంది. గురువు సమర్థుడైన పురుషుడై ఉండాలి. మీరొచ్చారు. ఈ సమావేశాలలో ఇది చివరి సత్సంగం. వృద్ధావస్థలో ఉన్న పాత సత్సంగీయులకు చెబుతున్నాను. ఇప్పుడిక కింది స్థానాలను వదిలేయండి. మీరు సహస్రదళంలో ధ్యానం చేస్తూ చనిపోతే లేదా త్రికుటిలో ధ్యానం చేస్తూ చనిపోతే సున్న్‌లో

చనిపోతేనో జనన మరణాలు సమాప్తం కావు. 'ఎందుకంటే ఎదుట వచ్చే దృశ్యాలను వాస్తవమని మీరనుకుంటున్నారు. "దుర్గాదాస్! 1919 నుండి నీవు నాతో ప్రేమ పంచుకుంటున్నావు. నేను అజ్ఞానిని. నాకు తెలిసేదికాదు. ఇప్పుడు అర్థమైంది హృదయాన్ని శుద్ధిచేసి పవిత్రంగా చేసుకుని సంవత్సరాల తరబడిగా నా వెంట ఉన్న సజ్జనులకు చెబుతున్నాను. మనకు దొరికే దంతా మనకర్మ ఫలితమే! ఎవరు ఎంత తీసుకునేదుంటే తీసుకుంటారు. ఎవరు బాధలు కలిగించాలో కలిగిస్తారు. అది చూసి దుఃఖపడవద్దు. ఒక మార్గం ఇది. దీనిని నేను మీకు చెప్పాను. నామం ఏమిటి? నామం అంటే అనుభవం, జ్ఞానం - నీ ఆత్మ శరీరమూ కాదు. మనసూ కాదు. ప్రకాశమూ కాదు. శబ్దమూ కాదు. నేనెవరిని? అకహ, అగాధ, అనామీ! ఈ రూపంలో ఉండేవారిలో ఒకానొక స్వాభావిక శక్తి ఉండాలి. ఎవరు అతని సాంగత్యంలోకి వెళ్ళినా, ప్రేమచేసినా వారికి శాంతి లభించాలి. వారి మనోకామనలు పూర్తి కావాలి. ఒకవేళ అలా కాకుంటే అతడెవరి ధ్యానం చేస్తున్నాడో అతడు అసంపూర్ణుడని అనుకోవాలి. అతడు అసంపూర్ణుడు కాకుంటే కబీర్ "సాంచ్ బరాబర్ తాప్ నహీం, ఝూట్ బరాబర్ పాప్ జాకే హృదయ సాంచ్ హైం, తాకే హృదయ ఆప్" అని తప్పు రాశాడనవచ్చు.* ఈ భయానక మాటలు రాసిన కబీర్ దోషి. ప్రభు సుమిరణతో శత్రువులు పారిపోతారని! ఎవరో ఒక మహా పురుషుడు రాశాడు. కానీ అతని బంధువులు అతని పట్ల శత్రుత్వాన్ని వదల్లేదు. దీనికి కారణాలు రెండు. ఆ మహాత్ముడు ప్రభు సుమిరణ చేయనైనా చేయకపోయి ఉండాలి. చేస్తే అతని బంధువులు అతనితో శత్రుత్వాన్ని విడిచేవారు లేదా ఆయన అసత్యపు మాటలు రాసి వెళ్ళాడనవచ్చు. కబీర్ కూడా భయానక మాటలు రాసి ఉండవచ్చు. "బాబా! నిన్ను ధ్యానిస్తే ఇవి జరిగాయి. అవి జరిగాయి." అని చెబుతుంటారు. నాపైన ఒక విధి, బాధ్యత, ఋణం ఉంది. నేను నా ఆత్మను ప్రశ్నిస్తాను, "వారి పనులు స్వాభావికంగానే నెరవేరుతాయి. నా మేధస్సు నుంచి శుభ భావన వెలువడుతుంది. ఎందుకు వెలువడుతుంది? "జిస్ కే హృదయ సాంచ్ హై, ఉస్ కే హృదయ ఆప్" ఎవరి హృదయంలో సత్యం ఉందో ఆ హృదయంలో నీవుంటావు అన్నాడు కబీర్. ఈ మార్గంలో నూటికి నూరుపాళ్ళు ప్రాక్టికల్ కాలేకపోయాను. నేను చెప్పినదంతా సరైనదైతే నన్ను ధ్యానం చేసే వారికి శాంతి దొరికి తీరాలి. మనోకామన పూర్తి అయి తీరాలి. కాకుంటే తప్పుగా రాసిన

కబీర్ సాహబ్‌దే దోషం. ప్రపంచాన్ని తన వలలో చిక్కుబడేశాడు. నేను చాలా నిర్భయుణ్ణి. ఈ సంతులు మనకు సత్యమైన మాటలు చెప్పలేదు. ప్రతి ఒక్క మతం తనను తాను గొప్పగా భావించుకుంది. బ్రాహ్మణుల రాజ్యం ఉన్నప్పుడు గురువుల రాజ్యం. గురువుల మాటే చెల్లుబాటయి వీరిదే రాజ్యంగా ఉండేది. ఏ వృక్షపు పుల్లను పళ్ళుతోముక్కోవడానికని సంతులకు ఇస్తారో ఆ వృక్షానికి మనిషి దేహం లభిస్తుందన్నారు. ఈ మాటలకు ఋజువేముంది? ఇలాంటి మాటలు చెప్పి ఈ గురువులు మనలను దోచుకున్నారు. నేను స్వాభావిక రీతిలో ఏదైనా మాట అనేస్తే అది నెరవేరుతుంది. నిజంగానే నాలో శక్తి ఉంటే నా భార్య రోగాన్ని తగ్గించలేనా? నేను జబ్బుపడినప్పుడు పి.జి.ఐ.లో చెకప్ చేయించుకున్నాను. బోధనా సరళిని మార్చే బాధ్యత నాపై ఉంది. నేను సత్యాన్ని చెబుతున్నాను. నాకు అర్థమైందే చెప్పాను. దావా ఏం లేదు. జరగబోయే సంఘటనే, మాటే సంత్ నోటినుండి వెలువడుతుంది. నువ్వెలా అనేస్తావు అని నన్ను నేనే ప్రశ్నించుకుంటాను. నాకేమీ తెలియదు. నా నోటినుండి వెలువడిన మాట నిజమవుతుంది. నేనేమీ చేయను. మీరు నాకు చాలా సేవచేశారు. నేను 122 రూపాయల రసీదు మందిరానికి నా దగ్గరనుండి తీసిచ్చాను. నాకు మీరు ఊరికే ఇచ్చిన వాటి 122 రూపాయల రసీదు మందిరం పేరిట తీయించాను. నా దగ్గర డబ్బు లేకుంటే దుర్గా దాసును ఇమ్మని అడుగుతాను. ఎందుకంటే ఇతడు నాకవసరమని నెలకు 40 రూపాయలు పంపుతాడు. ఇది నిజమే! కానీ నేనెవరినీ మోసగించదలచుకోను. నేను సంత్ మతంలోకి ఎందుకు వచ్చాను? సంత్ మతం నుండి నాకేం లభించింది? నా మనసులో ఏ ఊహలు ఉదయించేవో ఇదికావాలి, ఇది కావద్దు అనే భావవలన్నీ సమాప్తమయ్యాయి. నాకు సంత్ మతం నుండి లభించినదిదే! ఎవరు సమాప్తం చేశారు? దయ నా దాతాదయాలునిదే కానీ దానిని సమాప్తంచేసిన వారు మీరే! కేవలం ఒకటే భావం - నేనెవరిలోకీ వెళ్ళననే విషయం, నా జీవితపు తీరు మార్చింది. ఇదే ఒక రహస్యాన్ని పరదాలో ఉంచి మానవ జాతి మతాలలో, పంథాలలో, సంప్రదాయాలలో విభజింపబడింది. ఇప్పుడు మనదే రాజ్యం. కబీర్ కాలంలో ముసల్మానులు రాజులుగా ఉన్నారు. అది ముస్లిముల రాజ్యం. స్వామీజీ కాలంలో ఆంగ్లేయుల రాజ్యం. ఇప్పుడు మన రాజ్యం. ప్రస్తుతం భారతీయులకు మత సంప్రదాయాల ఐక్యత, జీవించే రహస్యాల అవసరం

ఎంతైనా ఉంది. నా పైన ఒక బాధ్యత ఉంది.

తేరా రూపహై అద్భుత్, అచ్‌రజ్ తేరీ ఉత్తమ దేహీ ।
జగ్ కళ్యాణ జగత్ మే ఆయా, పరమదయాల్ సనేహీ ॥

అందుకే నేనీ రహస్యాన్ని విప్పాను. ఈ విషయం అర్థమైతే నీకు ఇష్టమైన వారినే పూజించు. రాముణ్ణి పూజించు. కృష్ణుణ్ణి పూజించు. మహమ్మద్‌ను పూజించు. నానక్ సాహబ్‌ను పూజించు. రాముని పూజ నీ విశ్వాసమే! మహమ్మద్ పూజ కూడా నీ విశ్వాసమే! యేసు ప్రభువు పూజ కూడా నీ విశ్వాసమే. బయటి నుండి ఏ మహమ్మదూ, యేసు ప్రభువూ, బాబా సావన్ సింగ్ లేదా ఫకీర్ ఎవరూ నీకు సాయం చేయరు. మహర్షి జీ సహాయం చేసేవాడైతే తన ధామం ధ్వంసం కానిస్తాడా? ఇదంతా నీ విశ్వాసమే! నీ శ్రద్ధ! నీ నమ్మకం. ఇదే చెప్పదలచు కుంటున్నాను. అందుకే నేను ఈ మానవ జాతికి సత్యపు చిరునామా తెలపాలనుకుంటాను. కానీ మీకు సత్యం అవసరం లేదు. మీకు ప్రాపంచిక సుఖాలు కావాలి. దీనినుండి నేను కూడా అతీతుడనేమీ కాదు. నాకు ధనం వద్దు, సుఖం వద్దు అని నేనంటే అది మోసం, అబద్ధమవుతుంది. మరి ఇందుకు ఏం చేయాలి? "మనిషివి కావాలి!" నీ ఖ్యాల్ ఊహ, ఆలోచన, భావనలో బలం ఉంది. ఈ డోగ్రా కుటుంబంపై నా బోధనలు చాలా ప్రభావం చూపుతున్నాయి. ఇందుకు నేను భాగ్యశాలిని. ఫకీర్‌చంద్ ఉన్నాడు. తన తమ్ముళ్ళకు సాయపడలేదు. వారికి ఇతడంటే ప్రేమ ఉంది. కష్టసుఖాలలో ఒకరికొకరు సాయపడతుంటారు. ఇదే నిన్ను తీసుకుపోయేది. నీ ఆస్తి ఏదో ఓ గురువుకి అర్పించడం గొప్ప కాదు. నీ దగ్గర నాలుగు పైసలుంటే ముందుగా నీ బంధువులకు, పేదవారికి సహాయం చేయి. ఇదే నా శిక్షణ. మేం ప్రజల సేవ చేయాలి. ప్రకృతి, ఈశ్వరుడు ఎవరిని నీ వెంట ఉంచాడో వారికి సహాయమందించు. కానీ కాలం ఎట్లా ఉందంటే నీ సహాయం అందుకున్న వారే నీ వైపు కోపంగా చూస్తారు. అవమానం చేస్తూ తిరుగుతారు. ఆడపిల్లలున్నారు. ప్రస్తుతం నా కూతురుంది. నేను ఆమె పెళ్ళిచేశాను. నీకివ్వడానికి ఏమీ లేదు అని చెప్పాను. పీడించే హక్కు అమ్మాయిలకు ఎక్కడుంది? తండ్రి దగ్గర ధనం ఉంటే సంతోషంగా ఇవ్వాలంతే! పెళ్ళయిన ఆడపిల్లలకు

తల్లితండ్రుల్ని పీడించి అడిగి తీసుకునే హక్కులేదు. ఇది పాపం! నేరం! కుర్రవాడు యువకుడయ్యాడు. తండ్రి సంపాదన తినడానికి అతనికేమీ హక్కులేదు. ప్రతి మనిషీ తనే సంపాదించుకుని తినాలి. ప్రస్తుతం ఇళ్ళలో కష్టాలున్నాయి. ఎందుకు? అన్నదమ్ములు ఒకరిపై మరొకరు ఆధారపడుతున్నారు. కొడుకు తండ్రిపై ఆధారపడి ఉన్నాడు. తన దగ్గర చాలినంత డబ్బున్నా కొడుకు నుండి డబ్బు తీసుకునే తండ్రి దోషి. ఒకవేళ తన దగ్గర డబ్బులేకుంటే తిండికీ, బట్టలకూ, రోగాలకూ, ఇంటిఖర్చులకూ కొడుకు నుండి తీసుకోవచ్చు. కానీ దీనికంటే ఎక్కువ ఆశిస్తే ఆ తండ్రి దోషే! కొడుకుల నుండి తీసుకుని బాబా ఫకీర్‌కు దానమివ్వటం నేరం. నా శిక్షణ బోధన ఇదే! ఈ సంతులు తమ కుటుంబాల్ని పోషించారని ఎలా అంగీకరించాలి? వీళ్ళు గద్దెల్ని తమ పిల్లలకు ఇచ్చుకుని వెళ్ళారు. ఇదేమిటి? మనలను మూర్ఖులనుగా చేశారు. కేవలం మీ గృహస్థుల కోసమే నేను అనామీధామం నుండి అవతరించి వచ్చాను. ఈ మతాల వారు, సంతులు మనలను మూర్ఖుల్ని చేశారు. ఎవరూ సత్యం చెప్పలేదు. నిర్భయుడనై ఇదే చెప్పాలనుకుంటున్నాను. నేను పొరపాటు చెబితే ఈ మతాలు, సంప్రదాయాలవారు, నన్ను వ్యతిరేకించనీ, నాకేం అభ్యంతరంలేదు. ఈ మహాత్ములు డబ్బులు పోగుచేసి తమ ఎయిర్ కండిషన్ గదులు కట్టించుకుని తమ పిల్లలకు ఇచ్చుకుని వెళ్ళారు. ఇక ఎలా విశ్వసిస్తాను? ఎలా అంగీకరిస్తాను? నేటి గురువుల దోపిడీకి గురికాకండి, మీరు పొరపడుతున్నారు. మీకెవరూ సత్యం చెప్పరు. నేను సత్యాన్ని ఇష్టపడే మనిషిని. నేను పొరపడితే చెప్పండి. గద్దెలపై ఉన్న గురువులు ఒట్టుపెట్టుకుని చెప్పండి. మీరు వీణాధ్వని విన్నారు, రారంగ్-సారంగ్ విన్నారు. ఎంత శ్రద్ధగా ఏకాగ్రం చేసి ప్రయత్నించినా ఇప్పుడు ఘంట, శంఖ, వీణా నాదాలను వినలేను. ఎందుకంటే ఆ స్థాయి దాటిపోయింది. జ్ఞానం కలిగిన వ్యక్తికి మొదటి నుండీ అ,ఆ, ఇ, ఈ చదవటం అవసరమేం కాదు. మంచి మేధస్సు గలవారు సత్సంగంలోకి వెళ్ళి అభ్యాసం సోహంగ్ కంటే పై స్థాయినుండి ప్రారంభించవచ్చు. ప్రపంచం కావాలని కోరుకునేలా ఐతే కింది స్థానాలలో తప్పక అభ్యాసం చేయండి. చేయకుంటే నీ ప్రపంచం ఏర్పడదు. నీ ప్రపంచాన్ని ఏర్పరచేది నీ మనసు, సంకల్పం. మనసును విడిచి పైన ఉండే మనిషికి అతని ప్రపంచం, లోకం సవ్యంగా ఉండదు.

ఎందుకంటే అతడు మనసుకు అతీతంగా ఉంటాడు. ప్రాపంచిక సంబంధం మనసుతో ఉంటుంది. గృహస్థులందరికీ సంతులు పాంచనామాల స్మరణ చెప్పారు. దీని వలన మీ ప్రపంచం బాగుపడాలని వారి ఉద్దేశ్యం. పూర్తిగా సత్యమైన విషయం. నిర్భయుడనై చెబుతున్నాను. ప్రపంచం కావాలనుకుంటే సహస్ర దళ కమలంలో ధ్యానం చేయండి. రూపాన్ని ధ్యానం చేయండి. నన్ను ధ్యానించమని నేను చెప్పను. ఏ కోరికను తీసుకుని నీవు ధ్యానం చేస్తే నీ ఇచ్ఛ నెరవేరుతుంది. ఎవరూ ఆపలేరు. నీ ఏకాగ్రత ఎంత తీవ్రంగా ఉంటే అంతగా నీ పని సాఫల్యమవుతుంది. ఇది నేనెందుకు చెబుతున్నాను? చాలామంది నాకు తెలియరు. వారు నన్ను ధ్యానం చేస్తారు. వారి పనులు నెరవేరతాయి. మంచిపేరు, కీర్తి నాకు ఇస్తారు. విషయమేమిటి? నేనీ ఫలితానికి, నిర్ణయానికి వచ్చాను. ఓ మనిషీ! నీకు లభించేది నీ ఏకాగ్రతతో లభిస్తుంది. అంతే తప్ప ఏ గురువూ మంత్రం ఊది నీకేమి ఇవ్వడు. మీరు పొరపాటు ఊహల్లో భ్రమలలో ఉన్నారు. నీకు ఏది దొరికినా నీ ధ్యానం వల్లనే దొరుకుతుంది. ఈ చందో నన్ను విశ్వసిస్తుంది. ఈమె పనులన్నీ నెరవేరుతుంటాయి. ఈమె ఇంట్లో నేనేమైనా తింటే నాకు హాని కలుగుతుంది. మీరు బట్టలిచ్చారు. నేను తొడుక్కున్నాను. వాటిని నేను ఇలాగే ఉంచుకోను. మీ ప్రేమ ఉంది. నేను తొడుక్కున్నాను. మనం మనుషులం. ఒకరం మరొకరిపై ఆధారపడి ఉన్నాం. ఇస్తుంటాం. తీసుకొంటూ ఉంటాం. కానీ మోసంతో పైసలు తీసుకోవడం పాపం. మరణించేటప్పుడు ఈ మహాత్ములు నిజంగానే ఎవరినీ తీసుకువెళ్ళరు. వీరు ఎవరి అంతరంలోనూ ప్రాకట్యం కారు. అయినా వీరు తాము వెళ్తామని ప్రచారం చేసుకున్నారు. లేదా ప్రకటమయ్యావని ఎవరైనా చెబితే వెళ్ళింది తాముకాదని నిజం చెప్పలేదు. ఇక మరి వీరిలో సత్యం ఎక్కడుంది? నేను ఉన్నతమైన, సత్యమైన మాటే చెప్పాను. వాళ్ళు ఇక్కడే అబద్ధపరులు. మరి వీరిని ధ్యానించే వారికి ఏం లభిస్తుంది? మీకు మేలు ఎలా జరుగుతుంది? కబీర్ ననుసరించి ఎవరి హృదయంలో సత్యం ఉందో ఆ హృదయంలో ఈశ్వరుడుంటాడు. సత్యమైన, యథార్థ విషయం నీకు చెప్పకుంటే ఆ విధంగానూ నేను సత్యవాదిని కాలేదు. నేను నాలాంటి వారికి అనగా ఎవరైతే రహస్యం కోసం వచ్చారో వారికి సత్యం చెప్పి పోతాను. ఈ కె.సి.జైన్

పది రూపాయలు ఓ సారి పోస్టు ద్వారా పంపాడు. మరోసారి పదకొండు పంపాడు. ఎందుకు పంపాడు? ఇతడు చెప్పాడు - " నాచెల్లిలి పెళ్ళి జరిగింది. మీరు నాతో మూడు రోజులున్నారు. పెళ్ళిముగిసింది" అని! "ఏదైనా సేవ చేయవలసి ఉంటే చెప్పండి" అన్నాడతడు. "పదకొండు రూపాయల మనీఆర్డర్ మానవతా మందిరానికి పంపించు" అన్నానట. నేను మీకు ఏ మాత్రం మోసగించను. ఇతడు పదకొండు రూపాయలు మనీఆర్డర్ పంపాడు. తరువాత ఆఫ్ఘనిస్తాన్ వెళ్ళాడు. నేను అక్కడ అతనితో ఉన్నానట. అతడిలా చెప్పాడు నేను అతణ్ణి ఉన్నత స్థానంలో కూర్చోబెట్టాను. వెళ్ళబోతున్నప్పుడు, "జైన్! ఐదువేలు మందిరానికి పంపించు" అన్నానట. నేనన్నానని ఇతడు చెబుతున్నాడు. ఇతడు మూడు వేల రూపాయల చెక్ మందిరానికి పంపాడు. నేనా చెక్కును తిప్పి పంపేశాను' జైన్ గారూ! మిమ్మల్ని ఐదువేల రూపాయలు పంపమని నేను చెప్పలేదు" అని రాశాను. నేను సత్సంగం ఇస్తున్నాను. నా స్థితి ఇలా ఉంది.

బే కదరాఁ దీ దోస్తీ, తూ క్యాఁ కీతీ హంస్ ।
మాంస్ మాంస్ తేరా సీఖా చఢ్ గయా గలియాఁ రుల్ గయే పఁస్ ॥

ఈనాటి వరకు ఎవరూ చెప్పని రహస్యాన్ని చెబుతాను. దానికి జవాబుగా అతడు నా అంతరంలో ఉండే గురువు చెప్పాడు అని రాశాడు. కొన్నాళ్ళ క్రితం అతని అంతరంలో నా రూపం ప్రగటమైందట. రూపం హోషియార్‌పూర్‌కు వెళ్ళమందట. ఇతడు హోషియార్ పూర్ వచ్చాడు. యాభై రూపాయలు అక్కడ ఇచ్చి వెళ్ళాడు. మిత్రులారా! ఇప్పుడు మీరే చూడండి! నాకేం తెలియదు. నా రూపం ప్రకటిస్తుంది, స్పష్టంగా చెప్పటం వలన మందిరపు మూల వేళ్లలో పార వేస్తున్నానని నాకు తెలుసు. దుర్గాదాస్! నాకు గౌరవం ఉండక పోవచ్చు. నన్నెవరూ పట్టించుకోక పోవచ్చు. నాకు బాగా తెలుసు. ఈ గద్దెల వాళ్ళు నాతో శత్రుత్వం వహించవచ్చు నేను లోకంలోకి వచ్చిందే ఇందుకు!

తూతో ఆయా నర దేహీ మే, ధర్ ఫకీర్ కా బేషా ।
దుఃఖీ జీవకో అంగ్ లగాకర్ లేజా గురుకే దేశా ॥

సత్సంగంలో ఏంచెబుతానో అదే నా నామదానం. నేనిచ్చే నామదానమిదే? నేను తప్పు చెబితే రుజువు చేయమని ఈ మహాత్ములకు హక్కులనిస్తున్నాను.

నేను తప్పైతే చెప్పండి. ఉన్న ఆట, లీలంతా నీ మనసుదే! నీ విశ్వాసానిదే! ఈ మనసు యొక్క మతంపైన నడవకండి.

మన్ కే మతే న చాలియే, మన్ కే మతే అనేక్ ।
జో మన్ పర్ సవార్ హై, వహ సాధూ కోయీ ఏక్ ॥

నీ లోపల ఏదో రూపం ప్రగటమవుతుంది. అది బాబా ఫకీర్‌దే అయినా నీ ఆత్మ శుద్ధంగా, పవిత్రంగా ఉంటే ఆ రూపం ఏదైనా చెబితే నెరవేరుతుంది. నీ ఆత్మ పరిశుద్ధిగా లేకుంటే అది తప్పవుతుంది. నేను పూర్తిగా సత్యమైన మాట మీకు చెప్పాను. ఏ భాగమూ వదిలి పెట్టలేదు. నేనీ పనిని ఎందుకు చేస్తున్నాను? అసలైన నామం ఏమిటి? ఓ మనిషీ! నీ అసలైన రూపం పరమతత్వ ఆధారం. నీవు శరీరం కాదు. మనసు కాదు. నేనిచ్చే నామం ఎవరికి దొరకాలి? దాతా! నీవు పనిచ్చావు. నేను చేశాను. సరిగ్గానే చేశానో పొరపాటుచేశానో నాకు తెలియదు. నా నడవడి శుద్ధిగా ఉంది. ఏ గురువుకూ విరుద్ధంగా లేదు. ఏ మతానికీ విరుద్ధంగా లేదు. ఏ పంథాకూ విరుద్ధంగా లేదు. నా అనుభవం చెప్పిపోతానని ప్రతిజ్ఞ చేశాను. కనుక చెబుతున్నాను. చాలా మంది చెబుతుంటారు - బాబా! నీవు గురువులకు విరుద్ధంగా చెబుతుంటావు అని ! నా పూర్వీకులను నా పరాశురుణ్ణి నా వశిష్టుణ్ణి సంతులు ఏ ఆధారంగా విమర్శించారో అదే ఆధారంగా నేనీ ప్రస్తుత గురువులకు విరుద్ధంగా చెబితే నేను పాపిని కాను.

నిజ బేపారీ నామ్ కా, హాటై చలు భాయీ ।
సాధు సంత్ గహకీ భయే, గురు హాట్ లగాయీ ॥

సార్ సబద్ కఛు వస్తుహై సౌదా కరూ భాయీ ।
భావ్ ఖులా పంచ్ రంగ్ కా బహూ కరత్ దలాలీ ॥

జా కే హాథ్ వివేక్ హై, కరి దేత్ పవాయీ ।
పాప పున్న్ పలరా భయే, సూరత్ భయీ డాండీ ॥

జ్ఞాన్ దుసేరా డారి కే, పూరా కరూ ఆయీ ।
కరి సౌదా ధర్ కో చలే, రోకా దర్‌బానీ ॥

లేఖా దే నిజ నామ్ కా, కహఁ కా బేపారీ ।
పానీ సే బానీ బహీ, గురు ఛాప్ దిఖాయీ ॥

ఇత్‌నా సున్ కాయల్ భయే, జమ్ సీస్ నవాయీ ॥
సంత్ చలే సత్ లోక్ కో, ఛోడా సంసారీ ।
కుందన్ భయే దర్‌బార్ మే, ప్రభు నజర్ గుజారీ ॥
కహే కబీర్ బైఠో సహీ, మిఖ్ లేహు హమారీ ।
కాల్ కలప్ బ్యాపై నహ్వా‌ఁ, రహే నఫా తుమ్హారీ ॥

సాధు సంతులు ఈ నామానికి హక్కుదార్లు అర్హులు. మీ గృహస్థులు ఈ నామానికి అర్హులుకారు. సత్ నామం ఏమిటి? మీరు నేనిచ్చే నా జ్ఞానాన్ని అందుకోరు. మీకేం లాభం కలుగుతుంది? పూర్తిగా సత్యమైన మాట చెబుతున్నాను. మందిరంలో నీకేది ఇష్టమైతే అదివ్వు. నామం యొక్క బేరం ఎవరు చేస్తారు? సాధువులు, సంతులు చేస్తారు. ఎవరి లోపల వీణ మోగుతుందో, ప్రకాశం అవుతుందో వారు నామానికి అర్హులు. వీణ మోగటంవలన ముక్తి లభించదని శాస్త్రాలు చెబుతున్నాయి. నీవు ఈశ్వరునివై పోయావని, బ్రహ్మవయ్యావని దీని ఉద్దేశ్యం కాదు. నేనేం అర్థం చేసుకున్నాను? నేను ఏమయ్యాను? అక్కడికి చేరుకుని అదే అయ్యాను. నా హృదయంలో సత్యముంది. నా నోటి నుండి ఏ మాట వెలువడుతుందో అది నెరవేరుతుంది. నాలో ఈ శక్తి వచ్చింది గదా, మరి నేను నా రోగాన్ని దూరం చేసుకోలేను. నా భార్య రోగాన్ని దూరం చేయలేకపోయాను. నా నుండి కొందరు ప్రసాదం తీసుకు వెళ్తారు. స్వస్థత పొందుతుంటారు. నా భార్య ఏడున్నర సంవత్సరాలు జబ్బు పడితే నేనేమీ తగ్గించలేకపోయాను. మాసక్రమం-బుతుధర్మం ఆగిపోయిన స్త్రీలు సైతం ఎందరో నా నుండి ప్రసాదం తీసుకువెళ్ళగా వారికి సంతానం కలిగింది. నా బిడ్డకు పెళ్ళయి 24 ఏళ్ళయింది. ఎన్నో సార్లు ప్రసాదమిచ్చాను. పిల్లలు పుట్టలేదు. నేనే వ్యాధిగ్రస్థుణ్ణి. పి.జి.ఐ.లో చెకప్ చేయించుకున్నాను. విషయం, రహస్యం ఏమిటని ఆలోచిస్తుంటాను. ఈ నామం వలన మనిషిలోని అహంపనా- అహం 'నేననే' భావం తొలగిపోతుంది. ఇదే లాభం. నాది పోయిందా? నేను అక్కడికి చేరుకుంటే ఏం చేయగలను? ఏమీ చేయలేను. అది జరగవలసినదే జరుగుతుంది. నీ విశ్వాసం చేస్తుంది. నేనేమీ

చేయను. మరి నేనెవరిని? నేను ఒక చైతన్య బుడగను. ఒక తత్వం ఉంది. అందులో కదలిక పుడుతుంది. దానినుండి చంద్రుడు, తారకలు, సూర్యుడు ఏర్పడుతుంటాయి. దీని వలన నాకేం లభించింది? శాంతి. మరణించిన తరువాత ఏమవుతుంది? తెలియదు. మరణించాక ఏం జరుగుతుందో, నేనెక్కడికి వెళ్ళానో చెప్పడానికి ప్రకృతి పరమేశ్వరుడు నాకు శక్తినివ్వాలని అనుకుంటూ ఉంటాను. ఆ నామం యొక్క సౌదా-బేరం ఎవరు చేస్తారో కబీర్ చెబుతున్నారు. ఎవరు బేరం చేస్తారు? ఎవరుకొంటారు? సాధువులు, సంతులు.

సాధు సంత్ గహ కీ భయే। గురు హాట్ లగాయీ

ఆ నామం వేరే! అది వీణా నాదం కాదు, రారంగ్ - సారంగి కాదు. వివేకం ఉంటే అంతా లభిస్తుంది. వివేకం లేకుంటే ఏమీ లేదు. నేను కర్మను అంగీకరించేవాణ్ణి. ఈ పెద్ద పెద్ద గొప్ప గొప్ప మహాత్ములకు అంత్య సమయంలో చాలా కష్టాలను కలగటం చూసి నేను భయపడిపోయాను. నేనెలా మరణిస్తానో నాకు తెలియదు. దుర్గాదాస్! ఈ జీవితంలో నేను ఏ పాపమూ చేయలేదు. ఏ హేరాఫేరీ చేయలేదు. అందుకే సంతోషంగా ఉంది. ఎవరినీ మోసగించలేదు.

నిజ బేపారీ నామ్ కా హాటే చలు భాయీ ।

ఈ విషయాన్ని ఎవరు అర్థంచేసుకుంటారు. నీవు నామం జపించావు. బేరం చేశావు. కొనుగోలు చేశావు.

సార్ శబ్ద కఛు వస్తు హై, సౌదా కర్ భాయీ ॥

ఏ మనిషి ఇంత ఉన్నత స్థితికి చేరుకుంటాడో కర్మ అనుభవించటం నుండి అతడు కూడా తపించుకోలేడు. అతనికి కూడా తను చేసిన కర్మకు ఫలితం అనుభవించక తప్పదు. దాతా దయాల్ మహారాజ్ నాకు ఇలా రాశారు.

ఫకీరా! జా భవ సాగర్ పారా ।

కర్మ భోగం అందరూ అనుభవించవలసే ఉంటుంది. ఇకపైన జ్ఞానం వలన నీ ముందరి కర్మలు ఏర్పడవు. నావి ఏర్పడవు. ఎందుకంటే నేను మనస్సు, మాయల రూపాన్ని తెలుసుకున్నాను. పాతకర్మల ఫలితం అనుభవిస్తున్నాను.

నేను తప్పించుకోలేను. రుజువు ఏమిటంటే మీరెవరూ నా స్వప్నంలోకి రాలేదు. కానీ రైలుబండి, తీగలు, క్రాసింగ్, నా తల్లిదండ్రులు, భార్య ఇప్పటికీ అప్పుడప్పుడు వస్తుంటారు. ఎందుకంటే ఇప్పటి నాపనులు నిష్కామకర్మలు. వీటితో నాకే అనుబంధమూ లేదు. కానీ నా పొట్ట కోసం చేసిన ఆనాటి పనులు, వాటి సంస్కారాలు నా మేధస్సులో నుండి ఇప్పటికీ బయటికి పోలేదు. నేను చేస్తున్న ఈ పని జ్ఞానానికి సంబంధించినది. ఇన్ని మాటలు మాట్లాడతాను. వీటిని గురించి నాకేమీ తెలియదు. ఇదే "నామకీ వ్యాపారీ"...

పానీ సీ బానీ బహీ, గురు ఛాప్ దిఖాయీ
ఇత్‌నా సున్ కాయల్ భయే, జమ్ సకీ నవాయీ

'యమ' అంటే ఏమిటి? యముడు శిరస్సును వంచుతాడు. వంగేలా చేస్తాడు. నీ మనస్సే యముడు. నేను 'గరుడ పురాణ రహస్యం' అనే ఓ పుస్తకం రాశాను. యమరాజు ఎవరు? యమరాజంటే నీ మనస్సే. ఎవరూ బయటి నుండి రారు. ఎవరి మనసు అపవిత్రంగా, మురికి విచారాలతో ఉంటుందో వారి మృత్యు సమయంలో భయపెట్టే ఆకారాలు ఎదుటికి వస్తాయి. యమరాజు రావటమంటే ఇదే! ఎవరి మనసు శుద్ధంగా, పవిత్రంగా, నిర్మలంగా ఉంటుందో వారి ఎదుటికి దేవుళ్ళు, దేవతలు వస్తుంటారు. ఇదే ధర్మరాజు రావటం, బయటినుండి ఏ రాముడూ రాడు, ఏ గురువూ రాడు. వచ్చేది నీ మనసే! ఎలాంటి సంస్కారాలు నీ మేధస్సుపై పడి ఉన్నాయో అవే స్ఫురిస్తాయి.

సంత్ చలే సత్ లోక్ కో, ఛోడా సంసారీ।
కుందన్ భయే దర్‌బార్ మే, ప్రభు నజర్ గుజారీ॥

నాపైన కాల కర్మల రుణం ఉండకుండా నేను ఏ బోధన నివ్వాలి అని నేను నా ఆత్మను ప్రశ్నిస్తాను.

కహే కబీర్ బైఠో సహీ సిఖ్ లేహు హమారీ।
త్రాల్ కలప్ వ్యాపే నహీం, ఇహై నఫా తుమ్‌హారీ॥

కబీర్ ఏం నేర్పుతున్నాడో నాకు తెలియదు. నేనేం అర్థం చేసుకున్నాను?

మీరు నా అక్క చెల్లెళ్ళు. అన్నదమ్ములు. నేనే విషయం గురించీ వాదించను. నా నడవడి పవిత్రంగా ఉంది. మనసు పరిశుద్ధంగా ఉంది. నేను సత్యాన్ని ఏమని అర్థం చేసుకున్నాను? నా లోపల ప్రగటమైన రంగులు, రూపులు అన్నీ మాయ రూపాలేనని అర్థం చేసుకున్నాను. అది తప్ప మరేమీ కాదు. ఇందులో చిక్కుబడ కూడదు. మన నిజ రూపంలో ఉండాలి. మనం అలఖ అగామి అంశలం. నాకు తెలిసింది ఇది. ఇంకేదైనా ఉంటే అది కబీర్‌కు తెలిసి ఉండవచ్చు.

అందరికీ రాధాస్వామి.



# జ్యోతిరాణి



విద్యార్హతలు — బి.యస్సీ., ఎం.ఎ. (తెలుగు)
ఎం.ఎ. (హిందీ), ఎం.ఎ. (ఇంగ్లీష్),
సంస్కృతంలో డిప్లమా,
ఇంగ్లీష్ టైప్‌రైటింగ్ - షార్ట్‌హ్యాండ్

ఉద్యోగం — సబ్-ఎడిటర్, ఈనాడు దినపత్రిక
వందలాది వ్యాసాలు, విపుల అనువాద కథలు,
అడ్వర్టయిజ్‌మెంట్లు, ఫీచర్లు, విచిత్ర విశ్వాలు, జోకులు.

రచనలు

1. మధుజ్వాల (కవితా సంపుటి-1982లో ప్రచురితం)
(1983లో శ్రీశ్రీ స్మారక బహుమతి)
2. భక్తమీరా (గేయ ప్రబంధం - 1985లో ప్రచురితం)
(దీనికి 1986లో వేముగంటి సాహితీ పురస్కారం)
3. మంచు పందిరి (కవితా సంపుటి - 1989)

అనువాదాలు

4. ధర్మచారిణి (ఆధ్యాత్మిక నవల - 1988)
5. ప్రవచన తరంగిణి (1989)
6. ఉపదేశ తరంగిణి (1991)
7. సత్సంగ సుధ (ప్రథమ భాగం - 1992)
8. సత్సంగ సుధ (రెండవ భాగం - 1994)
9. సత్సంగ సుధ (మూడవ భాగం - 1995)
10. రాజభిక్షువు (ఆధ్మాత్మిక నవల - 1995)
11. ఏడు వారాల కథలు (1995)
12. భోక్త ఆరోగ్యానికి భోజన సూత్రాలు (1996)
13. స్వామీజీ మహరాజ్ జీవిత చరిత్ర (1996)
14. ఆనంద యోగం (రీరైట్ - 1996)
15. కాంతి ముత్యం (అధ్యాత్మిక నవల (1997)
16. సమాంతర రేఖలు (1997 మే 'చతుర')
17. గురువాణి (1997)
18. చాత్తాద శ్రీ వైష్ణవులు (1997)
19. మహారామాయణం ( ప్రథమ భాగం - 1998)
20. హుజూర్ రాయ్‌సాలిగ్‌రామ్ మహరాజ్ జీవన చరితం (1998)
21. సత్సంగ సుధ (నాలుగవ భాగం - 1998)
22. మహారామాయణం (రెండవ భాగం - 1999)
23. గుప్త రహస్యం (1999)
24. సత్సంగ సుధ (ఐదవ భాగం - 1999)
25. సత్సంగ సుధ ( ఆరవ భాగం - 2000)
26. మహారామాయణం (మూడవ భాగం-2000)
27. సత్సంగ సుధ (ఏడవ భాగం - 2000)
28. మహారామాయణం (నాలుగవ భాగం - 2001)
29. అంతర్ముఖి ( 2001)
30. సత్సంగ సుధ (ఎనిమిదవ భాగం - 2001)
31. వేయిరంగుల పుష్పగుచ్ఛం (మొదటి భాగం - 2001)

పరమసంత్ పరమ దయాల్
పండిత్ ఫకీర్ చంద్‌జీ మహారాజ్

# సత్సంగ సుధ

**(ఎనిమిదవ భాగం)**

## చండీగఢ్‌లో అమృతవర్షం

అనువాదం
**జ్యోతిరాణి**

ప్రోత్సాహకులు
**దయాల్ ఆనందరావు మహారాజ్**
**దయాల్ శివమంగళ్ సింగ్ మహారాజ్**